ninadamnews.com
తెలుగు దినపత్రిక
# నినాదం
నిఖార్సైన జర్నలిజం
శుక్రవారం, ఆగస్టు 14, 2026 | సంపుటి - 22 | సంచిక 317 | వెల - 7 | పేజీలు - 12 - 8
Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## బిసి మహిళలకు స్వయం ఉపాధి

**ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ ప్రారంభించిన మంత్రి పొన్నం**

బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.



**హైదరాబాద్,ఆగస్టు13(నినాదం):** సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని పొన్నం చెప్పారు. బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టుమిషన్లు అందిస్తామని.. వారిని కేవలం లబ్దిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామిక వేత్తలుగా తీర్చదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి

▸▸తరువాయి 2లో..



## ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ సంస్థ

**ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడి**

ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ ఉగ్రవాద సంస్థ అల్‌ఖైదా ఇన్ ఇండియన్ సబ్‌కాంటినెంట్ కుట్ర ఉందని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించినట్లు సమాచారం. 2025 నవంబర్‌లో ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటనపై దర్యాప్తు నేపథ్యంలో ఈ అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

▸▸వివరాలు 6లో..

## లష్కరే చీఫ్ హఫీజ్ సయీద్‌కు పాక్ అండ

- పాక్‌వైపు కన్నెత్తితో భారత్ సర్వనాశనం తప్పదు
- అవామీ ముస్లిం లీగ్ నాయకుడు షేక్ రషీద్ అహ్మద్ ప్రేలాపన

పంద్రాగస్టు వేడుకలను రెండు రోజుల్లో భారత్ జరుపుకోనుంది. అలాంటి వేళ.. నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కర్ ఎ తైబా చీఫ్‌పై పాకిస్థాన్ మాజీ మంత్రి, అవామీ ముస్లిం లీగ్ నాయకుడు షేక్ రషీద్ అహ్మద్ ప్రశంసల వర్షం కురిపించారు. అలాగే భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

▸▸వివరాలు 2లో..



## ఇసిఐ పేరుతో ఫేక్ మెసేజ్‌లు

**అప్రమత్తంగా ఉండాలన్న సిఇవో**

ఈసీఐ పేరుతో ఓటర్లకు మోసపూరిత సందేశాలను సైబర్ మోసగాళ్లు పంపిస్తున్నారని తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఓటర్ వివరాలు సరిపోలడం లేదం టూ ఫేక్ మెసేజ్‌లు వస్తున్నాయని.. వీటిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



▸▸వివరాలు 2లో..

## ముగిసిన పార్లమెంట్ వర్షా కాల సమావేశాలు

**వందేమాతరం గీతాలాపనతో లోక్‌సభ వాయిదా**



**న్యూఢిల్లీ,ఆగస్టు13(నినాదం):** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. గురువారం ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభమైన తర్వాత సభ్యులంతా కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ సమావేశానికి ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌తోపాటు సభ్యులంతా హాజరయ్యారు. జాతీయ గేయంలోని ఆరు చరణాలను పూర్తిగా ఆలపించిన అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు. దీంతో వర్షాకాల సమావేశాలు ముగిసినట్లు అయింది. వందేమాతరం గేయాన్ని చట్టపరంగా రక్షణ కల్పించే శాసనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేసిన కొన్ని రోజులకే లోక్‌సభలో ఈ పరిణామం చోటు చేసుకుంది. జాతీయ గేయాన్ని ఆలపించడాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా నిరోధించడం శిక్షార్హమైన నేరమని ఈ చట్టం స్పష్టం చేస్తోంది.

▸▸తరువాయి 2లో..

## విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపించుకుందాం

**అప్పులు కడుతూనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం**



- అభివృద్ధి చేసుకుందాం ఆశీర్వదించండి
- కూకట్ పల్లిని ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తాం
- సీఎం రేవంత్ రెడ్డి
- కూకట్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన

**ఉమ్మడి రంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 13 (నినాదం):** గత పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం విధ్వంసానికి గురైందని, దానిని వికాసం వైపు నడిపించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలో నూతనంగా నిర్మించ తలపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల టవర్ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం విషయంలో గత ప్రభుత్వాన్ని తమను బేరీజు వేసుకొని ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు. కెసిఆర్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. తమ ప్రభుత్వంలో 3.28 కోట్ల ప్రజలకు

▸▸తరువాయి 2లో..

## మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

- కొందరు 4శాతం రిజర్వేషన్లపై కోర్టు మెట్లెక్కారు
- ఇంటింటికీ వెళ్లి ఓట్ల గల్లంతును పరిశీలించండి
- మైనార్టీల ప్రతిభా సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, నినాదం:** ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముస్లింలకు కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, వీటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

▸▸తరువాయి 2లో..

## పిల్లల ఆరోగ్యంపై ఆటలొద్దు

- ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్ వేయాల్సిందే
- మీతో కాకపోతే మేమే ఆ పని చేస్తాం
- కేంద్రానికి సుప్రీం కోర్టు చురకలు



**న్యూఢిల్లీ,ఆగస్టు13(నినాదం):** అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్‌లపై లేబుల్స్




ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ కేంద్రానికి తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది.

▸▸తరువాయి 2లో..

## త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు

- దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

**న్యూఢిల్లీ,ఆగస్టు13(నినాదం):** దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గి వినియోగదారులకు తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి బొగ్గు ధరలను పెంచలేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అదే విధంగా సిమెంట్, స్టీల్ వంటి రంగాలకు సంబంధించిన ధరల విషయంలోనూ పెరుగుదలను నియంత్రించే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.



▸▸తరువాయి 2లో..

## వేలం వెర్రిగా భూముల అమ్మకం

**ప్రభుత్వ భూముల జాడలేకుండా మాయం**

- రాయదుర్గం భూ వేలాన్ని వెంటనే ఆపాలి
- సిఎం రేవంత్‌కు హరీష్ రావు లేఖ

**హైదరాబాద్,ఆగస్టు13(నినాదం):** రాష్ట్రంలో ఎక్కడ పడితే అక్కడ భూముల అమ్మకాలు చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. భూముల అమ్మకాలపై ప్రశ్నలు సంధిస్తూ సీఎంకు హరీశ్ లేఖ రాశారు. 'ఎక్కడ ప్రభుత్వ భూములు కనిపిస్తే అక్కడ అమ్మకాలేనా? నాడు ప్రభుత్వ భూములు పెద్దలు ఇచ్చిన జాతి సంపద అని ఉపన్యాసాలు దంచిన నువ్వు.. నేడు ఎక్కడ భూములు కనిపిస్తే అక్కడ వేలం వేస్తూ, ప్రజల ఆస్తులను అమ్మకానికి పెడుతున్నావు' అంటూ ఫైర్ అయ్యారు. కంచ గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యనివర్సిటీ

▸▸తరువాయి 2లో..



## అమరావతి రైతులది త్యాగమే కాదు.. స్ఫూర్తి కూడా

- వారే లేకుంటే అమరావతే లేదన్నది సత్యం
- రైతులను భాగస్వాములను చేసేందుకే ల్యాండ్ పూలింగ్
- గ్రాఫిక్స్ అన్నవారికి చెంపపెట్టులా నిర్మాణాలు
- సైబరాబాద్ స్ఫూర్తితో అమరవాతి నిర్మాణానికి అడుగు
- అమరావతి నిర్మాణం రాష్ట్ర భవిష్యత్‌కు ప్రతీక
- స్టీల్ బ్రిడ్జ్ ప్రారంభంలో సిఎం చంద్రబాబు



*అమరావతి రైతులది త్యాగమే కాదు.. స్ఫూర్తి అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వారు ముందుకు రాకుంటే ఇవాళ రాజధాని నిర్మాణాన్ని ఊహించలేమని అన్నారు. గత ప్రభుత్వం వారిని కేసులతో అనేక ఇబ్బందులకు గురిచేసినా, రాజధాని కోసం త్యాగాలకు వెరవలేదని అన్నారు.*

**అమరావతి,ఆగస్టు13(నినాదం):** రాజధాని అమరావతిని కలిపే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ`3ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రోడ్డును అనుసంధానించే స్టీల్ బ్రిడ్జిల ప్రారంభానికి సూచికగా ఉండవల్లి వద్ద శిలాఫలకాన్ని చంద్రబాబు ఆవిష్కరించారు. అనంతరం కాలినడకన వెళ్లి స్టీల్ బ్రిడ్జిలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు హాజరైన రైతులు, స్థానికులను ఉద్దేశించి సీఎం మాట్లాడారు.

▸▸తరువాయి 2లో..



## పంద్రాగస్టు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

- ప్రోటోకాల్‌ను తప్పక పాటించాలి
- విద్యుత్, తాగునీరు సదుపాయాలు సమకూర్చాలి
- అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలి
- అధికారులకు దిశానిర్దేశం చేసిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్

రవాణా, ఆర్ అండ్ బి శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ పంద్రాగస్టు స్వాతంత్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం గోల్కొండ కోటలో ఏర్పాట్లను పరిశీలించారు.

▸▸వివరాలు 2లో..

## అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఖేలో ఇండియా క్రీడల నిర్వహణ

**కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో వాకిటి శ్రీహరి**



## ప్రజలకు జవాబుదారులుగా అధికారులు

- అంకిత భావంతో ప్రజల సమస్యలను పరిష్కరించాలి
- సీఎం రేవంత్ రెడ్డి నమ్మకాన్ని ఎంపీడీవోలు నిలబెట్టుకోవాలి
- రాష్ట్ర స్థాయి ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి



▸▸వివరాలు 2లో..

# పంద్రాగస్టు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

**హైదరాబాద్,ఆగస్టు13(నినాదం):** రవాణా, ఆర్ అండ్ బి శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ పంద్రాగస్టు స్వాతంత్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం గోల్కొండ కోటలో నిర్వహించనున్న స్వాతంత్య దినోత్సవ వేడుకలు జరిగే ప్రాంతాన్ని గురువారం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఆయన పరిశీలించి, ఏర్పాట్లపై దిశానిర్దేశర చేశారు. వర్షాకాలం నేపథ్యంలో కార్యక్రమంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా వాటర్‌ప్రూఫ్ షామియానాలు, వాటర్‌ప్రూఫ్ జనరేటర్, నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీరు, బారికేడింగ్, గ్యాలరీలు, వచ్చే అతిథులు, విద్యార్థులు, ప్రజల సీటింగ్ సామర్థ్యం, సౌండ్ సిస్టమ్ తదితర ఏర్పాట్లను ఉన్నతస్థాయి అధికారులతో కలిసి ఆయన సమీక్షించారు. కార్యక్రమ నిర్వహణలో ఎక్కడా ప్రోటోకాల్‌కు ఇబ్బంది కలగకుండా అధికారులు నిబద్ధతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. అదే విధంగా స్టేజీ ఏర్పాటుతో పాటు సుందరీకరణ పనులను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నందున ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రతి వాహనంలో వచ్చే పిల్లలకు ఒక లైజనింగ్ అధికారి తప్పని సరిగా ఉండేలా చూడాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.పంద్రాగస్టు రోజున గౌరవ ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లు ఘనంగా ఉండాలని, ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లను పక్కాగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రికి సమర్పించే పోలీసుల గౌరవ వందనం, పోలీస్ కవాతును ఆయన ఉన్నతాధికారులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, సమాచార శాఖ కమిషనర్ జి. ముకుంద రెడ్డి, అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్, స్వాతి లక్రా, సీపీ సజ్జనార్, అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, ఇంటెలిజెన్స్ ఓఎస్డీ కమలాసన్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ జితేందర్ రెడ్డి, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్. జగన్, చీఫ్ ఇంజనీర్ రాధా కిషన్, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ జయ రామమూర్తి, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్ రెడ్డి, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ వెంకన్న, ఆర్డీవో రామకృష్ణ, డీఈఓ యాదయ్య, ఆర్ అండ్ బి, విద్యుత్, వైద్య, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ప్రతిష్ఠాత్మకంగా ఖేలో ఇండియా క్రీడల నిర్వహణ

**న్యూఢిల్లీ, నినాదం:**

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి శ్రీ మన్‌సుఖ్ మాండవీయను తెలంగాణ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి గురువారం న్యూఢిల్లీలో కలిశారు. ఆయనతోపాటు తెలంగాణ ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారు శ్రీ ఏపీ జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శ్రీ కె. శివసేన రెడ్డి ఉన్నారు. తెలంగాణకు ఖేలో ఇండియా క్రీడలను కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి వాకిటి శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాసిన ఆహ్వాన లేఖను కేంద్ర మంత్రి మాండవీయకు అందజేశారు. డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు 12 రోజులపాటు తెలంగాణలో ఖేలో ఇండియా క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖేలో ఇండియా క్రీడలను ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసిందని మంత్రి పేర్కొన్నారు. నిర్వహణలో ఎలాంటి లోపాలు, విమర్శలకు తావులేకుండా అత్యున్నత ప్రమాణాలతో పోటీలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమయం తీసుకుని, ఖేలో ఇండియా క్రీడల ప్రారంభోత్సవానికి హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి స్వయంగా ఆహ్వానిస్తారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నూతన క్రీడా విధానాన్ని తీసుకొచ్చి, విప్లవాత్మక నిర్ణయాలతో రాష్ట్రంలో క్రీడారంగాన్ని ముందుకు తీసుకెళ్తోందని మంత్రి వాకిటి శ్రీహరి చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు. అందరి సహకారంతో ఖేలో ఇండియా క్రీడలను విజయవంతంగా నిర్వహించి తెలంగాణ ప్రతిష్ఠను మరింత పెంచుతామని పేర్కొన్నారు.

## బిసి మహిళలకు స్వయం ఉపాధి

1,000 చొప్పున మొత్తం 1,19,000 కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో దాని విలువ రూ.12,000 కాగా, లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 100 శాతం సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

## లష్కరే చీఫ్ సయీద్‌కు పాక్ అండ

**న్యూఢిల్లీ, నినాదం:**

పంద్రాగస్టు వేడుకలను రెండు రోజుల్లో భారత్ జరుపుకోనుంది. అలాంటి వేళ.. నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కర్ ఎ తైబా చీఫ్‌పై పాకిస్థాన్ మాజీ మంత్రి, అవామీ ముస్లిం లీగ్ నాయకుడు షేక్ రషీద్ అహ్మద్ ప్రశంసల వర్షం కురిపించారు. అలాగే భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. లష్కర్ ఎ తైబా చీఫ్ హాఫీజ్‌కు తాను సేవకుడిని ఆయన ప్రకటించారు. హాఫీజ్ సయీద్ వెంట పాకిస్థాన్‌తోపాటు తాము ఉన్నామని ఈ సందర్భంగా ప్రకటించారు. పాకిస్థాన్ వైపు కనీసం కన్నెత్తి చూస్తే భారత్‌ను అల్లా నాశనం చేస్తారని హెచ్చరించారు. ఆ దేశంలో పక్షుల కిలకిలారావాలు వినపడవని అన్నారు. దేవాలయాల్లో గుడి గంటలు కూడా మోగవని తీవ్ర స్వరంతో పాక్ మాజీ మంత్రి పేర్కొన్నారు. భారత్‌లో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఏం జరగదని ఆయన అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్నప్పుడు తన ఫోన్‌లో హాఫీజ్ ఫోన్ నెంబర్‌ను అధికారులు గుర్తించారని చెప్పారు. దీంతో ఆ దేశం నుంచి తనను బహిష్కరించారని ఈ సందర్భంగా పాక్ మాజీ మంత్రి షేక్ రషీద్ అహ్మద్ గుర్తు చేసుకున్నారు. బహిరంగ సభలో షేక్ రషీద్ చేసిన ఈ వ్యాఖ్యల వీడియో వైరల్ అవుతోంది. లష్కర్ ఎ తైబా సీనియర్ కమాండర్, పాకిస్థాన్ మార్కజీ ముస్లిం లీగ్ అధ్యక్షుడు ఖాలీద్ మసూద్ సంధుతోపాటు ఆ సంస్థ కేంద్ర సలహా కమిటీ సభ్యుడు ఖారీ మొహమ్మద్ యాకూబ్ షేక్ సమక్షంలో పాక్ మాజీ మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు షేక్ రషీద్ అహ్మద్ ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. 2020 నుంచి 2022 వరకు ఇమ్రాన్ క్యాబినెట్‌లో దేశ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రిగా పని చేశారు. అవామీ ముస్లిం లీగ్‌ను షేక్ రషీద్ స్థాపించారు.

## ఇసిఐ పేరుతో ఫేక్ మెసేజ్‌లు

**హైదరాబాద్, నినాదం:**

ఈసీఐ పేరుతో ఓటర్లకు మోసపూరిత సందేశాలను సైబర్ మోసగాళ్లు పంపిస్తున్నారని తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఓటర్ వివరాలు సరిపోలడం లేదంటూ ఫేక్ మెసేజ్‌లు వస్తున్నాయని.. వీటిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దరఖాస్తు తిరస్కరణ పేరుతో రూ.5లు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. వాట్సాప్ లింక్ ద్వారా దరఖాస్తు నింపాలని కోరుతున్నారని తెలిపారు. బ్యాంక్ వివరాలు, పాస్‌వర్డ్, ఓటీపీలను సైబర్ నేరగాళ్లు అడుగుతున్నారని సీఈవో తెలిపారు. ఇలాంటి మెసేజ్‌లు ఇఅఎ, తెలంగాణ అఇక్ష కార్యాలయం నుంచి రావని స్పష్టం చేశారు. ఫేక్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించొద్దని సూచించారు. మోసపూరిత సందేశాలు వస్తే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సీఈవో సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.

## ముగిసిన పార్లమెంట్ సమావేశాలు

తద్వారా దీనికి జాతీయ గీతం 'జనగణమన'తో సమానమైన చట్టపరమైన హోదా లభించినట్లైంది. రాష్ట్రపతి రాక, త్రివర్ణ పతాకావిష్కరణ, గవర్నర్ల ప్రసంగం వంటి సందర్భాల్లో వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలని జనవరి 28వ తేదీన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20వ తేదీన ప్రారంభమై.. ఆగస్టు 13వ తేదీతో ముగిశాయి. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్రం విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతోపాటు విద్యావ్యవస్థలో సంస్కరణలను డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళన చేపట్టింది. జులై 20వ తేదీన వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఆ రోజు చలో పార్లమెంట్ యాత్రకు సీజేపీ పిలుపునిచ్చింది. ఈ ఘటనతో చోటు చేసుకున్న తీవ్ర పరిణామాలతో మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అదే విధంగా పార్లమెంట్ సమావేశాల్లో యాంటీ పేపర్ లీక్ బిల్లుతోపాటు పలు బిల్లులు ఆమోదం పొందాయి. అయితే.. ఢిల్లీలో యువతపై జరిగిన లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలు ఇచ్చారో సభలో ప్రకటన చేయాలంటూ కేంద్రాన్ని ప్రతిపక్షం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో సభలో దాదాపుగా వాయిదాల పర్వం కొనసాగింది. చివరకు ఈ రోజు ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

## పిల్లల ఆరోగ్యంపై ఆటలొద్దు



ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల గురించి అవగాహన కలిగించేందుకు ప్యాకెట్‌ల ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. ఈ విషయంలో ఆహార పరిశ్రమ అభ్యంతరాలను మాత్రమే ఎఫఎసఎసఏఐ పరిగణనలోకి తీసుకుందన్నారు. హార ప్యాకెట్లపై హెచ్చరిక గుర్తులకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు మొదలైన వాటిని రోజుకు ఎంతో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫఎసఎసఏఐ సూచించింది. అయితే ఈ విధానం వినియోగదారులకు అవసరమైనంత అవగాహన అందించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందని ధర్మాసనం ప్రశ్నించింది. హెచ్చరిక లేబుల్స్ వల్ల ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం పడుతుందని తయారీదారులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చని కోర్టు పేర్కొంది. అయితే తాము తినే ఆహారంలో ఎంత చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఉందో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని స్పష్టం చేసింది. హెచ్చరిక ఉన్నప్పటికీ ఉత్పత్తిని కొనాలా, వద్దా అనే తుది నిర్ణయం వినియోగదారుడిదేనని తెలిపింది. హెచ్చరిక లేబుల్స్‌కు సంబంధించిన ప్రతిపాదనపై చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. అవసరమైతే తుది ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

## త్వరలో కోల్ ఎక్స్చేంజ్ ఏర్పాటు

మినరల్స్ అంశంలో రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం చేయబోదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. పన్నులు, సెస్‌ల విషయంలోనూ కేంద్రం జోక్యం చేసుకోదని తెలిపారు. రాష్ట్రాలకు ఉన్న హక్కులు, అధికారాలను గౌరవిస్తూనే ఖనిజ రంగ అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని చెప్పారు. దేశంలో మినరల్స్ ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని కిషన్‌రెడ్డి తెలిపారు.

# విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపించుకుందాం

సన్న బియ్యం, 55 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందజేస్తున్నామన్నారు. సోనియా గాంధీ దీపం పథకం తీసుకొచ్చి మహిళల సమస్యలను పరిష్కారం చేస్తే మోడీ ప్రభుత్వం 400 ఉన్న సిలిండర్ ధరను 1200 కు పెంచిందన్నారు. అయినా ఇందిరమ్మ పాలనలో మహిళలు ఇబ్బందులకు గురికా కూడదని తమ ప్రభుత్వం 500 కే సిలిండర్ అందచేస్తుందని అన్నారు. ఉచిత బస్సు కోసం ఇప్పటికీ 12 వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేసినట్లు తెలిపారు. మహిళల అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం కట్టబడి ఉందని, స్వయం సహాయక సంఘాలకు 65 వేల కోట్ల రుణాలు అందించామని, ఉచిత బస్సు ప్రయాణమే కాకుండా వెయ్యి బస్సులకు మహిళలను యజమానులను చేసిన ఘనత తమ ప్రభుత్వందని తెలిపారు. సోలార్ విద్యుత్ ప్లాంట్లకు, పెట్రోల్ బంకులకు మహిళలను యజమానులు చేసి వారి ఆర్థిక అభివృద్ధికి బాటలు వేశామన్నారు. హైటెక్ సిటీ ప్రాంతంలో మూడున్నర ఎకరాలలో మహిళలు ఉత్పత్తులను అమ్ముకునేందుకు స్టాల్ ఏర్పాటు చేశామని ఈ విధంగా అన్ని రకాల మహిళా ఉద్ధరణ కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. గత ప్రభుత్వం 8.11 లక్షల కోట్ల అప్పుతో రాష్ట్రానికి తమకు అప్పగిస్తే అసలు మిత్తి కలిపి నెలకు 70 వేల కోట్ల రూపాయలు అప్పులు చెల్లిస్తూ రాజీ లేకుండా రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమాన్ని ముందుకు తీసుకుపోతున్నట్లు తెలిపారు. కూకట్ పల్లిలోని విలువైన స్థలంలో 11 ఎకరాలలో ఇందిరమ్మ ఇల్లును నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని అన్నారు. హౌసింగ్ బోర్డ్, రాజీవ్ గృహకల్ప ద్వారా పేదలకు వీటితోపాటు ప్రభుత్వ ఉద్యోగులకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఇల్లు ఇచ్చిందని, ఇప్పుడు కూడా తమ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే పేదలకు ఇల్లు ఇస్తున్నామని గుర్తు చేశారు. ఇక్కడ నిర్మించే ఇళ్లకు భూమి విలువను లబ్ధిదారుల నుండి వసూలు చేయడం లేదని, రిజిస్ట్రేషన్ చార్జీలు కూడా మినహాయించి, కేవలం ఐదు నుండి ఆరు లక్షలు నిర్మాణ వ్యయం లో భాగస్వాములను చేస్తూ వారి సొంత ఇంటి కలను నిజం చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ భూములు కాకుండా వివాదాల్లో ఉంటే వాటిని పరిష్కరించేందుకు భూ యజమానులకు భూములను అప్పగించేందుకు తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. పదిమందికి మేలు చేయాలని అహర్నిశలు తమ ప్రభుత్వం కృషి చేస్తే, కొంతమంది పక్క రాష్ట్రాలకు వెళ్లి చేతబడి పూజలు చేస్తూ ప్రభుత్వంపై చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. చేతబడి తిరగబడితే ఏ విధంగా ఉంటుందో వారిపై ప్రజలు అదే విధంగా తిరగబడతారని హెచ్చరించారు. గత ప్రభుత్వం మాదిరిగా విలువైన భూములను అమ్ముకొని సొమ్ము చేసుకోకుండా ప్రభుత్వ భూములను ప్రజల అవసరానికి మాత్రమే వినియోగిస్తున్నామని అన్నారు. హైటెక్ సిటీలో ఐదు ఎకరాల్లో సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ కార్యాలయం నిర్మాణానికి స్థలం కేటాయించామని అన్నారు. కొడంగల్ లో ఎమ్మెల్యేగా ఓడిన తరువాత పార్లమెంట్ సభ్యుడిగా గెలిపించేందుకు కూకట్ పల్లి ప్రజలు తనకు మద్దతుగా నిలిచారని, నేడు ముఖ్యమంత్రిగా సర్వ అధికారాలతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధిలో కూకట్ పల్లిని ప్రత్యేకంగా పరిగణించాలని జిల్లా ఇంఛార్జ్ మంత్రి శ్రీధర్ బాబుకు సూచించారు. పరిశ్రమలు పాఠశాలలు రోడ్లు ఇతర ఏ అభివృద్ధి పనైనా వెంటనే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పేదవాడు ఎజెండాగా ప్రతి ఇంటికి సంక్షేమం అందించాలని తమ ప్రభుత్వం కృతనిచయంతో పనిచేస్తుందన్నారు. గత ప్రభుత్వం కమిషన్ల కోసం ప్రాజెక్టులు నిర్మించారని, తమ ప్రభుత్వం మాత్రం ప్రతి పేదవాడికి ఇల్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకుందన్నారు. ఏడాది లోపు లబ్ధిదారులకు ఇళ్లను అప్పగిస్తామని, ఎంపిక పారదర్శకంగా జరుగుతుందన్నారు. గత ప్రభుత్వ ఆలోచనకు అందని పనిని తమ ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలలో కట్టిన దానికంటే తమ ప్రభుత్వం రెండంతలు పేదలకు ఇల్లు నిర్మాణం చేసి ఇస్తుందని లేకుంటే తాను ఎన్నికల్లో పోటీ చేయనని సవాలు విసిరారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ జంట నగరాల్లో లక్ష ఇళ్ల నిర్మాణం చేపడతామని, దశలవారీగా పేదలందరికీ ఇల్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇది ఎక్కడితో ఆగిపోదని, ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేరేవరకు కొనసాగుతూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, ఆరెకపూడి గాంధీ, నవీన్ యాదవ్, కాలె యాదయ్య, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి, సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్ శ్రీజన, హౌసింగ్ బోర్డ్ ఎండి గౌతం, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, జగదీశ్వర్ గౌడ్, కొలను హనుమంత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# వేలం వెర్రిగా భూముల అమ్మకం

నేడు రాయదుర్గ్ ఇలా ఎక్కడిక్కడ భూములు అమ్మే కుట్రలు చేస్తుండటం సిగ్గుచేటని మాజీ మంత్రి మండిపడ్డారు. రాయదుర్గ్ పన్మక్త గ్రామంలోని సర్వే నం.83/1లో 10.63 ఎకరాల హెరిటేజ్ భూమిని ఆగస్టు 17, 21 తేదీల్లో వేలం వేయడానికి సిద్ధం కావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 2020లో ఇదే భూములపై రక్షణ కోరుతూ రేవంత్ కోర్టు మెట్లు ఎక్కారని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఒక మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాటనా అని ప్రశ్నించారు. హెరిటేజ్ భూములను కాపాడాల్సిన ప్రభుత్వం.. వాటినే వేలం వేసి అమ్మేందుకు ఎందుకు తొందరపడుతోందని నిలదీశారు. ఇదే సర్వే నంబర్‌లో గతంలో 6.2 ఎకరాలు సుమారు ఎకరాకు 237 కోట్ల చొప్పున వేలం వేస్తే, ఎస్‌బీఐ కోర్టుకు ఎక్కిందని... ప్రస్తుతం ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉందని వెల్లడించారు. అయినా, అదే సర్వే నంబర్‌లో మరో 10.63 ఎకరాలను వేలం వేయడం వెనుక ఆంతర్యం ఏమిటని.. న్యాయ వ్యవస్థ అంటే గౌరవం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూమిపై అనేక వివాదాలు ఉన్నాయని.. భూమి ఎవరిదో తేల్చకుండా వేలం వేయడం ఎందుకన్నారు. భూమి ఎవరిదో తేల్చలేని ప్రభుత్వం.. భూమిని అమ్మడానికి మాత్రం ఎందుకు తొందరపడుతోందని అడిగారు. రూ.2,000 కోట్ల విలువైన హెరిటేజ్ భూములను అమ్మే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారంటూ మండిపడ్డారు. నాడు పీసీసీ అధ్యక్షుడిగా ప్రభుత్వ భూములను తెలంగాణ జాతి సంపదగా అభివర్ణించిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారని..' ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోము' అన్న హామీ ఏమైందని నిలదీశారు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ భూములను అమ్మబోమని చెప్పిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాటలకు విలువ లేదా అని అన్నారు. భూముల వేలంపై రేవంత్ రెడ్డి వైఖరి చూస్తుంటే ఊసరవెల్లి కూడా సిగ్గుపడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సుప్రీంకోర్టు కూడా ఆస్తిని పరిరక్షించడం, కొత్తగా ఆస్తి సృష్టించకుండా చూడాల్సిన అవసరాన్ని స్పష్టం చేసిందని హరీశ్ గుర్తుచేశారు. అలాంటి పరిస్థితుల్లో వివాదాస్పద భూమిని వేలం వేసి కొత్త హక్కులు సృష్టించడం ఏ విధమైన పరిపాలనా బాధ్యత అని ప్రశ్నించారు. ఆగస్టు 17, 21 తేదీల్లో జరగనున్న వేలాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే సర్వే నం.83కు సంబంధించిన హెరిటేజ్, రెవెన్యూ, సర్వే, వక్ఫ్ రికార్డులన్నింటినీ బయటకు తీసి సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలు నిగ్గు తేల్చాలన్నారు. హక్కులు, వివాదాలు తేలకముందే ఈ భూములను కొనుగోలు చేస్తే.. భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు తప్పవని హెచ్చరించారు. విలువైన హెరిటేజ్ భూములను అమ్మాలని చూడటం దారుణమని మాజీ మంత్రి అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారిలా కాకుండా.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వ్యవహరించాలని హితవుపలికారు. అనుముల బ్రదర్స్ ప్రయోజనాల కోసం కాదని.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, తెలంగాణ ప్రయోజనాలను కాపాడే ముఖ్యమంత్రిగా ఉండాలని... లేదంటే చరిత్ర హీనుడిగా మిగిలిపోతారని హరీశ్ రావు లేఖలో పేర్కొన్నారు.

## ప్రజలకు జవాబుదారులుగా అధికారులు

**హైదరాబాద్,ఆగస్టు13(నినాదం):** ప్రజలకు జవాబుదారులం అనే విషయాన్ని అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించవద్దని, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి అధికారి అంకితభావం, బాధ్యతతో విధులు నిర్వహించాలని రాష్ట్ర స్థాయి ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. గురువారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో నిర్వహించిన మండల నోడల్ అధికారులైన ఎంపీడీవోల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల నుంచి వచ్చే ప్రజలతో ఓపికగా మాట్లాడి వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటిని క్షేత్రస్థాయిలోనే పరిష్కరించే గురుతర బాధ్యత మండల నోడల్ అధికారి, వివిధ శాఖల మండల అధికారులపై ఉందని పేర్కొన్నారు. ప్రజలే దేవుళ్ళని వారికి సేవలు అందించడం అధికారుల కనీస బాధ్యత అని చిన్నారెడ్డి గుర్తు చేశారు. ఎంపీడీవోలకు మండల ప్రజావాణి నోడల్ అధికారిగా ఎంతో నమ్మకంగా నియమించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశ్వాసాన్ని వారు నిలుపుకోవాలని, ప్రజావాణి ద్వారా సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలని చిన్నారెడ్డి పిలుపునిచ్చారు.

## మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

రిజర్వేషన్ల రద్దు కోసం అత్యున్నత న్యాయస్థానాల వరకూ వెళ్లారని ముఖ్యమంత్రి విమర్శించారు. అయినా చిత్తశుద్ధితో కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మైనారిటీల ప్రతిభా సదస్సుకు సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మైనారిటీలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మైనారిటీ రిజర్వేషన్లకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యతిరేకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ నేతృత్వంలోనే మైనారిటీలకు సంక్షేమం అందుతోందని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే సెక్యులర్ పార్టీ అని, హిందూ, ముస్లింలను రెండుకళ్లలా చూస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం గ్రూప్`1 పరీక్షలను నిర్వహించలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఓ ఆర్ఎంపీ డాక్టర్‌ను టీజీపీఎస్సీ సభ్యుడిగా నియమించారని సీఎం ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఉన్నంతకాలం దేశంలో సెక్యులర్ వర్గాలకు మనుగడ ఉంటుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హిందూ, ముస్లింలను రెండు కళ్లలా కాంగ్రెస్ చూస్తోందని చెప్పారు. నగరంలోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ఇచ్చింది. వాటిని రద్దు చేయాలని కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుజరాత్‌లో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి చూపాలని సవాల్ విసిరాం. లౌకిక వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పోరాడుతుంది. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌కు గ్రూప్`1 ఉద్యోగం, రూ.3కోట్ల ప్రోత్సాహకం ఇచ్చాం. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్`1 నియామకాల ఊసే లేదు. ఒకసారి నియామకాలు చేపట్టినా పల్లీ, బఠానీల్లా ప్రశ్నపత్రాలు అమ్మారు. మా ప్రభుత్వం వచ్చాక టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం. అందులో విద్యావంతులను నియమించాం. టీజీపీఎస్సీ ద్వారా గ్రూప్`1 పోస్టులు భర్తీ చేశాం. గ్రూప్`1 రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. అక్కడ మంచి న్యాయవాదిని పెట్టి వాదనలు వినిపించాం. తద్వారా నియామకాలు పూర్తిచేశాం. గ్రూప్ 2, 3, 4 పోస్టుల విషయంలోనూ కోర్టుల్లో పోరాడి ఉద్యోగాలు భర్తీ చేశాం'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. య పీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని బలోపేతం చేశామని ధీమా వ్యక్తం చేశారు. రిటైర్డ్ డీజీపీని టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమించామని చెప్పుకొచ్చారు. ఎంతో పారదర్శకంగా గ్రూప్`1 పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నిఖత్ జరీన్ కోసం నిబంధనలు పక్కనపెట్టి మరీ గ్రూప్`1 ఉద్యోగం ఇచ్చామని, అలాగే క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని సీఎం రేవంత్ గుర్తు చేశారు. మైనారిటీ యువత చదువుతో పాటు నైపుణ్యం సంపాదించాలని కోరారు. జర్మనీ, జపాన్ లాంటి దేశాల్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు స్కిల్స్ య నివర్సిటీ కూడా ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. సందర్భంగా తాను అందరి సహకారంతోనే తెలంగాణ ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నట్లు రేవంత్ చెప్పుకొచ్చారు. సర్ పేరుతో ఓట్లు తొలగించాలని కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బెంగాల్‌లో గెలిచామని, ఇక తెలంగాణనే టార్గెట్ అని కొందరు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అక్కడ మమతా బెనర్జీ వదిలేశారేమో కానీ, ఇక్కడ కాంగ్రెస్ కార్యకర్తలు వదిలిపెట్టరని హెచ్చరించారు. 'గల్లీ గల్లీ తిరగండి, ఇంటింటికీ వెళ్లండి.. ప్రతీ ఒక్కరి ఓటును చెక్ చేయండి' అంటూ కార్యకర్తలకు సీఎం పిలుపునిచ్చారు.

# అమరావతి రైతులది త్యాగమే కాదు.. స్ఫూర్తి కూడా

రాష్ట్ర విభజన తర్వాత ఏమవుతుందో తెలియని స్థితిలో అందరం ఉన్నామని, రాజధాని ఎక్కడ నిర్మించాలో అర్థం కాని పరిస్థితి అన్నారు. శివరామ కృష్ణ ఆధ్వర్యంలో కమిటీ వేశారు. మెజారిటీ ప్రజలు అమరావతినే సూచించారు. రాజధాని లేకపోతే మనం ఏవి చేయలేమని గ్రహించి నిర్మాణానికి సంకల్పించా.. కేవలం ఓ 50 ఎకరాల్లో భవనాలు నిర్మించవచ్చని, అయితే భవిష్యత్ ఏం కావాలన్న ప్రశ్న ఉదయించడంతో అమరావతి నిర్మాణానికి పూనుకున్నామని అన్నారు. అయితే ఇందుకోసం భూములు కావాలి కదా? మహానగరంగా ఎలా చేయాలని ఆలోచిస్తే.. ల్యాండ్‌పూలింగ్ కాన్సెప్ట్ వచ్చింది. రాజధాని నిర్మాణంలో రైతులను భాగస్వాములను చేస్తే బాగుంటుందని ఆలోచించా. ఒక్కమాట చెప్పగానే.. నన్ను నమ్మి భూములిచ్చేందుకు అన్నదాతలు ముందుకొచ్చారు. నోటిఫికేషన్ ఇచ్చిన 58 రోజుల్లోనే రైతుల నుంచి విశేష స్పందన వచ్చింది. 33వేల ఎకరాలు ఇచ్చేందుకు.. 29వేల మంది రైతులు ముందుకొచ్చారు. అమరావతి రైతాంగానికి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని నాటి సంగతులను సీఎం చంద్రబాబు వివరించారు.సింగపూర్ మోడల్‌తో అమరావతిని నిర్మిస్తున్నామని చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తనపై ఉన్న నమ్మకంతో ఆ ప్రభుత్వం ఉచితంగా ప్లాన్ ఇచ్చారని అన్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డుతో అమరావతికి కనెక్టివిటీ పెరగనుందని పేర్కొన్నారు. రాజధాని లేకపోతే మనం ఏమీ చేయలేమని గ్రహించా నని తెలిపారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన అమరావతి రైతులకు పాదాభివందనం చేస్తున్నానని అన్నారు. రైతులు లేకపోతే రాజధాని లేదని చెప్పుకొచ్చారు. ఆనాడు అమెరికాలో పర్యటించి.. సైబరాబాద్ రూపకల్పన చేశామని ప్రస్తావించారు. రూపాయి తీసుకోకుండా అమరావతి కోసం సింగపూర్ మాస్టర్ ప్లాన్ రూపొందించిందని సీఎం చంద్రబాబు కొనియాడారు. ఏపీకి గొప్ప చరిత్ర ఉందని తెలిపారు. అమరావతి రైతుల త్యాగమే కాదని.. స్ఫూర్తి కూడా చాలా గొప్పదని ప్రశంసించారు. నాడు రాజధాని ఎక్కడ కట్టాలనే సందిగ్ధత ఉండేదని తెలిపారు. శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఇందుకోసం ఓ కమిటీ వేశారని ప్రస్తావించారు. రాజధానిగా అమరావతినే మెజార్టీ ప్రజలు కోరుకున్నారని ప్రస్తావించారు. ప్రజల నిర్ణయం మేరకే రాజధాని అమరావతి నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. ఆనాడు సైబరాబాద్‌ను నిర్మించామని చెప్పారు. హైదరాబాద్ ఆదాయం పెరగడానికి తాను చేసిన అభివృద్ధే కారణమని పేర్కొన్నారు. ప్రజల నిర్ణయం మేరకే రాజధాని అమరావతిని ఎంపిక చేశామని సీఎం చంద్రబాబు చెప్పారు. ఆనాడు హైటెక్‌సిటీ నిర్మిస్తే కొంతమంది ఎగతాళి చేశారని అన్నారు. తలసరి ఆదాయంలో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందని వెల్లడించారు. హైటెక్‌సిటీ నిర్మాణం దశలోనూ ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నామని చెప్పారు. విమర్శలు పట్టించుకోకుండా సైబరాబాద్ నిర్మాణంపై దృష్టి పెట్టామని తెలిపారు. ఇప్పుడు హైదరాబాద్ ఎదుగుదల చూసి గర్వపడుతున్నామని అన్నారు. రాజధాని లేకపోతే మనం ఏవి చేయలేమని గ్రహించానని చెప్పారు. హైదరాబాద్‌ను మించిన మహానగరాన్ని నిర్మించాలని తాము సంకల్పించామని అన్నారు. సింగపూర్ మోస్ట్‌లివబుల్ కంట్రీ.. అందుకే ఆ మోడల్ తీసుకున్నామని వెల్లడించారు. గ్రాఫిక్స్ అంటూ అమరావతిని వైసీపీ నేతలు ఎగతాళి చేశారని ధ్వజమెత్తారు. ఇప్పుడొచ్చి చూడండి.. అమరావతి ఎలా ఉందో అని ప్రశ్నించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా ఆనాడు అమరావతిని రాజధానిగా అంగీకరించారని ప్రస్తావించారు. 5,10 కాదు.. 40వేల ఎకరాలు కావాలని జగన్ చెప్పారన్నారు. ఆ తర్వాత రాజధాని పేరుతో జగన్ మ డు ముక్కలాట ఆడారని విమర్శించారు. జగన్ హయాంలో రాజధాని రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేది.. అమరావతి ఉద్యమమని తెలిపారు. అమరావతి చరిత్రలో రైతులకు ప్రత్యేక స్థానం ఉంటుందని అన్నారు. దేవతల రాజధాని అమరావతి.. ఇక్కడ ఇబ్బందులు ఉండవని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సీడ్ యాక్సెస్ రహదారి ద్వారా రాజధానికి రాజమార్గం ఏర్పాటు చేసుకున్నాం. అమరావతిని ఆపడం ఇక ఎవరితరం కాదు. నీటి సమస్యలేని ఏకైక రాజధాని అమరావతి. విద్యుత్ స్తంభాలు, వైర్లు కనిపించని ఆధునిక నగరమిది. గ్యాస్‌తో సహా అన్నీ భూగర్భం నుంచే వెళ్లే రాజధాని మన అమరావతి. ఇవాళ ప్రారంభించిన రోడ్డు చిన్న ట్రైలర్ మాత్రమే. రాష్ట్రాభివృద్ధి విజన్‌కు అమరావతి నగర నిర్మాణం మొట్ట మొదటి సక్సెస్. రాష్ట్రాభివృద్ధిలో మొదటి మెట్టు ఎక్కాం. రాజధానితో పాటు రాష్ట్రం అంతటా అభివృద్ధి కావాలన్నదే నా ఆకాంక్ష. హెల్తీ వెల్తీ హ్యాపీ కావాలన్నదే అందరి సంకల్పం కావాలి. అమరావతి నిర్మాణం చేసి చరిత్ర సృష్టిస్తున్నందుకు గర్వంగా ఉందని సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రలుఉ పి.నారాయణ, నాదెండ్ల మనోహర్, తాడికొండ శాసనసభ్యుడు తెనాలి శ్రావణ్ కుమార్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్, ఎంపీ భాష్యం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ చైతన్య విద్యా సంస్థల్లో ఘనంగా వ్యక్తిత్వ నిర్మాణ కార్యక్రమం.. పుస్తకావిష్కరణ





**విజయవాడ, ఆగస్టు 13 (నినాదం):** విద్యార్థులకు విద్యాభ్యాసంతో పాటు మంచి వ్యక్తిత్వాన్ని, నైతిక విలువలను, క్రమశిక్షణను, దేశభక్తిని పెంపొందించేందుకు శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీభాయి ద్వారా ఆగస్టు 13, 2026న కానూరు ఐపీఎల్ క్యాంపస్‌లో వ్యక్తిత్వ నిర్మాణ కార్యక్రమం మరియు పుస్తకావిష్కరణ వేడుక ఘనంగా ప్రారంభించబడింది. ఈ సందర్భంగా విద్యార్థుల సమగ్ర వికాసానికి దోహదపడే ప్రత్యేక పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ వేడుకలో ఝాన్సీ మేడమ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే చదువుతో పాటు సంస్కారము పెంపొందిస్తూ, భారతీయ సంస్కృతి సంప్రదాయాలు, గురువులు, పెద్దలు, తల్లిదండ్రులు మరియు సమాజం పట్ల గౌరవ మర్యాదలు పెంపొందించి న్యాయము, ధర్మము మొదలైన విషయాలు తెలుసుకుని నడుచుకునే విధంగా ఈ వ్యక్తిత్వ నిర్మాణ కార్యక్రమాన్ని విద్యా కరికులమ్‌లో భాగంగా చేరుస్తున్నట్లు తెలిపారు. దేశంలో, ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా ఇలాంటి కార్యక్రమం రూపొందించడం శ్రీ చైతన్యకే సాధ్యమైందని, ఇప్పటివరకు ర్యాంకులతో, మార్కులతో తనదైన శైలితో విజయాల దుందుభి మోగించిన శ్రీ చైతన్య వాటితో పాటు ఇప్పటి నుండి విద్యార్థుల వ్యక్తిత్వ నిర్మాణానికి, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. పాఠ్యబోధనకు అనుబంధంగా విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారా సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుతమైన పౌరులను తీర్చిదిద్దేందుకు శ్రీ చైతన్య విద్యాసంస్థ నిరంతరం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులకు ప్రేరణ ఇచ్చే అంశాలతో రూపొందించిన ఈ పుస్తకంలో పొందుపరిచిన విషయాలు విద్యార్థుల్లో సానుకూల ఆలోచనా విధానము, లక్ష్యసాధన పట్ల పట్టుదల, ఆత్మవిశ్వాసము పెంపొందేందుకు దోహదపడతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈజీఎం మురళీకృష్ణ, ఆల్ ఇండియా అకాడమిక్ కోఆర్డినేటర్ బి.వి. సతీష్, రీజనల్ ఇన్‌ఛార్జీలు, ప్రిన్సిపాల్స్, డీన్స్, సెంట్రల్ ఆఫీస్ టీమ్, ఉపాధ్యాయ, విద్యార్థిని, విద్యార్థుల బృందము పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


बैंक ऑफ़ बड़ौदा
బ్యాంక్ ఆఫ్ బరోడా

**భగత్ నగర్ బ్రాంచ్**
నెం. 8-3-743, నీరజ కాంప్లెక్స్, ఎదురుగా: ఎల్‌ఐసి ఆఫీస్, అంబేద్కర్ స్టేడియం రోడ్, కరీంనగర్-505001.

**డిమాండ్ నోటీసు**
**(SARFAESI యాక్ట్, 2002లోని సెక్షన్ 13 సబ్‌సెక్షన్ (2) క్రింద)**

**దిగువవారికి:** మెస్సర్స్ శ్రీ వెంకటసాయి ఫిల్లింగ్ స్టేషన్ & దాని భాగస్వాములు (1. శ్రీ నీలం శ్రీనివాస్ తండ్రి శంకరయ్య, (2. శ్రీమతి నీలం రేఖ భర్త నీలం శ్రీనివాస్), ఇంటి నెం. 1-149/4/3, సర్వే నెం. 783, పొత్తూరు గ్రామం, ఎల్లంతకుంట మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా, తెలంగాణ-505401. **భాగస్వామి 1 & 2 మరియు వారి చిరునామా: శ్రీ నీలం శ్రీనివాస్ తండ్రి శంకరయ్య,** ఇంటి నెం. 3-34, గ్రామం నాంపల్లె, అన్నూర్, కరీంనగర్ - 505302. **శ్రీమతి నీలం రేఖ భర్త శ్రీనివాస్,** ఇంటి నెం. 334, నాంపల్లె, అన్నూర్, కరీంనగర్ -505302. **హామీదారు 1 & 2 మరియు వారి చిరునామా: శ్రీ బెరిగెల తిరుపతి తండ్రి చంద్రయ్య,** ఇంటి నెం. 8-5-274, లక్ష్మీనగర్, కరీంనగర్-505001. **శ్రీమతి బెరిగెల పద్మజ భర్త తిరుపతి,** ఇంటి నెం. 8-5-274, లక్ష్మీనగర్, కరీంనగర్-505001.

**విషయము:** సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (ఇకపై "చట్టము"గా పిలువబడుతుంది)లోని సెక్షన్ 13(2) క్రింద నోటీసు. **మెస్సర్స్ శ్రీ వెంకటసాయి ఫిల్లింగ్ స్టేషన్ & దాని భాగస్వాములు (శ్రీ నీలం శ్రీనివాస్ మరియు శ్రీమతి నీలం రేఖ) మరియు హామీదారులు (శ్రీ బెరిగెల తిరుపతి మరియు శ్రీమతి బెరిగెల పద్మజ) ల ఖాత సర్/మేడమ్,**

**రెఫరెన్స్: మా భగత్ నగర్ బ్రాంచ్ వద్ద గల రుణ సదుపాయములు.**

మా ఉత్తర్వు నెం. BMDP SBM CHA 166629, తేది: 21-09-2021 నాటి వివిధ రుణ సదుపాయముల మంజూరు మరియు మంజూరు నిబంధనలను తెలియజేస్తూ రెఫర్ చేయడమైనది. పైన తెలిపిన రుణ సదుపాయములు పొంది మరియు సెక్యూరిటీ ఏర్పాటు చేసిన తరువాత వినియోగించుకోవడమైనది. కావున క్రింద తెలిపిన రుణముకు సంబంధించి సెక్యూరిటీ ఇంటరెస్ట్ కల్పిస్తూ వివిధ రుణము/ రుణ సదుపాయముల ఖాతాలో ప్రస్తుతం రావలసిన బకాయి క్రింది విధముగా ఉన్నవి.

| సదుపాయ రకము మరియు స్వభావము | పరిమితి | వడ్డీ రేటు | 31.07.2026 నాటికి రావలసిన బకాయి (30.06.2026 వరకు వడ్డీతో కలుపుకొని) | సెక్యూరిటీల సంక్షిప్త వివరణతో పాటు సెక్యూరిటీ అంగ్రిమెంట్ |
|---|---|---|---|---|
| నగదు రుణము (స్టాక్ & రుణ పుస్తకముల తనఖా) | రూ. 50,00,000.00 | అపరాధ వడ్డీ 10.35 + 2.00% | రూ. 49,98,874.62 | **ప్రాథమిక:** తెలంగాణ-505401, రాజన్న సిరిసిల్ల జిల్లా, ఎల్లంతకుంట మం॥, పొత్తూర్ గ్రా॥లోని సర్వే నెం. 783లో ఇంటి నెం. 1-149/4/3 గల మెస్సర్స్ శ్రీ వెంకట సాయి ఫిల్లింగ్ స్టేషన్ యొక్క స్టాకు మరియు రుణ పుస్తకములు/ప్రస్తుత ఆస్తుల తనఖా. **కొల్లెటరల్:** కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, వేములవాడ మం॥, ప్రస్తుత వేములవాడ మున్సిపాలిటీ, నాంపల్లి, గురవయ్య నగర్, ఇంటి నెం. 3-39 సమీపాన మొత్తం ఎ. 03-04 గుంటలకు గాను సర్వే నెం. 528లో 272 చ॥గ॥ల విస్తీర్ణము గల యావదాస్తి శ్రీ నీలం శ్రీనివాస్ తండ్రి నీలం గురవయ్య పేరున న్యాయబద్ధ తనఖా. సరిహద్దులు: తూర్పు: 100' వెడల్పు రోడ్డు, పడమర: రోడ్డు, ఉత్తరం: నీలం ముత్తయ్య భూమి, దక్షిణం: 30' వెడల్పు రోడ్డు. |

1. బ్యాంక్/ఆర్‌బిఐ మార్గదర్శకముల ప్రకారం రుణ పుస్తక స్టేట్‌మెంట్ మరియు స్టాక్ దాఖలు చేయుటలో మీరు విఫలమైనట్లు విదితమే.
2. పర్యవసానముగా మీరు విఫలమైన దృష్ట్యా రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సూచనలు మరియు మార్గదర్శకములను అనుసరించి తేది: 30.07.2026న మీ రుణ ఖాతాను నిరర్ధక ఆస్తిగా వర్గీకరించినారు. పలుమార్లు డిమాండ్ మరియు వినతులు పంపిననూ మీరు రుణ పుస్తక స్టేట్‌మెంట్ మరియు స్టాక్ దాఖలు చేయలేదు.
3. పైన తెలిపిన పేరా 1లో వివిధ సెక్యూరిటీల ద్వారా సెక్యూర్డ్ చేయబడిన రుణ సదుపాయములకు సంబంధించి మీ రుణములు తీర్చుటలో విఫలమైనందున మీ ఖాతాను నిరర్ధక ఆస్తిగా వర్గీకరించడమైనది. కావున ఈ నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా పైన పేరా 1లో తెలిపినట్లు బ్యాంకుకు చెందిన బకాయి మొత్తం **రూ. 49,98,874.62** ను పూర్తిగా చెల్లించమని కోరుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (2) క్రింద మీకు నోటీసు జారీ చేయడమైనది. తదుపరిగా చెల్లింపు తేదీ వరకు వడ్డీ మరియు పైన తెలిపిన బకాయి చెల్లించుటలో విఫలమైనచో సదరు చట్టములోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (4) క్రింద అన్ని లేదా ఏవైన హక్కులను మేము వినియోగించుకొనెదమని గమనించగలరు.
4. పూర్తిగా చెల్లింపు తేదీ వరకు ఒక్కొక్క రుణ సదుపాయమునకు పైన తెలిపిన పేర 1లో పొందుపరచిన రేట్లతో వడ్డీ లెక్కింపు కొనసాగించబడునని గమనించవలెను.
5. మా ముందస్తు వ్రాత పూర్వక అనుమతి లేకుండా అమ్మకము, లీజు లేదా ఇతర విధములైన బదిలీలను (సాధారణ వ్యాపార పద్ధతిలో కాకుండా) పైన తెలిపిన పేర 1లో రెఫర్ చేయబడిన సెక్యూర్డ్ ఆస్తులను ఏవిధములైన బదిలీల నుండి నిబంధనలు అనుసరించి సబ్ సెక్షన్ 13 క్రింద మిమ్మల్ని నిషేధించినారని మీ దృష్టికి తేవడమైనది. ఒక వేళ సదరు చట్టములోని సెక్షన్ 13(13) క్రింద పైన తెలిపిన నిబంధనలను ఉల్లంఘించినచో సదరు చట్టములోని సెక్షన్ 29 శిక్షార్హము.
6. మాకు చెందిన బకాయిలకు సంబంధించి తదుపరి డిమాండ్ చేయుటకు గల హక్కు, పరిమితి లేకుండా కలుపుకొని ఏవైన ఇతర హక్కులు లేదా పరిష్కారములతో మినహాయింపు లేదని మరియు మా హక్కులకు భంగం కలగకుండా ఈ డిమాండ్ నోటీసు జారీ చేయడమైనదని మీరు గమనించగలరు.

**తేది: 04.08.2026**
**ప్రదేశం: కరీంనగర్**
చీఫ్ మేనేజర్/అధీకృత అధికారి
బ్యాంక్ ఆఫ్ బరోడా



## శ్రీ హవిష హాస్పిటాలిటీ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం: వేణూస్ ప్లాజా, బేగంపేట్, హైదరాబాద్-500016 ఇండియా.
**CIN:** L40102TG1993PLC015988, **Tel:** +91 40 27902929, 27905656, **E-mail:** cs@srihavisha.in, **Website:** www.srihavisha.in

**30 జూన్ 2026 నాటి మొదటి త్రైమాసిక ముగింపు కొరకు ఆడిట్ కాని స్వతంత్ర ఆర్థిక ఫలితాల స్టేట్‌మెంట్**

ఆడిట్ కమిటీ సిఫారసుల ఆధారంగా శ్రీ హవిష హాస్పిటాలిటీ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, (ది కంపెనీ) డైరెక్టర్ల బోర్డు తేది 12 ఆగస్టు 2026 నాడు జరిగిన వారి సమావేశంలో 30 జూన్, 2026 నాటి మొదటి త్రైమాసిక ముగింపు కొరకు ఆడిట్ కాని స్వతంత్ర ఆర్థిక ఫలితాలను ఆమోదించినారు.

పైన తెలిపిన ఆర్థిక ఫలితాలు, వాటిపైన పరిమిత సమీక్ష నివేదికలతో పాటు కంపెనీ వెబ్‌సైట్ https://srihavisha.in/quarterly-reports/ లో లభిస్తాయి మరియు దిగువ ఇవ్వబడిన క్విక్ రెస్పాన్స్ కోడ్ స్కానింగ్ ద్వారా కూడా పొందవచ్చును.

ప్రదేశం : హైదరాబాద్,
తేది : 14.08.2026

శ్రీ హవిష హాస్పిటాలిటీ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్,
డైరెక్టర్ల బోర్డు కొరకు మరియు తరపున
సం/- వెంకట్ మనోహర్ దొంతంశెట్టి
మేనేజింగ్ డైరెక్టర్,
DIN:00223342



## స్టెడ్‌ఫాస్ట్ కార్పొరేషన్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం: 8-2-293/82/జె/బి-60, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీ హిల్స్, హైదరాబాద్ - 500033 తెలంగాణ
CIN: L74999TG1995PLC037139, వెబ్‌సైట్: www.steadfastcorp.in, ఇమెయిల్ ఐడి: steadfastcorp@gmail.com.

**30.06.2026 నాటి త్రైమాసిక ముగింపు కొరకు ఆడిట్ కాని ఆర్థిక ఫలితాల నమూనా**

(EPS మినహా, రూ.లక్షలలో)

| S. No. | వివరములు | స్వతంత్ర | | | ఏకీకృత | | |
|---|---|---|---|---|---|---|---|
| | | త్రైమాసికపు ముగింపు 30 జూన్, 2026 ఆడిట్ కానివి | త్రైమాసికపు ముగింపు 31 మార్చి, 2026 ఆడిట్ అయినవి | త్రైమాసికపు ముగింపు 30 జూన్, 2025 ఆడిట్ కానివి | త్రైమాసికపు ముగింపు 30 జూన్, 2026 ఆడిట్ కానివి | త్రైమాసికపు ముగింపు 31 మార్చి, 2026 ఆడిట్ అయినవి | త్రైమాసికపు ముగింపు 30 జూన్, 2025 ఆడిట్ కానివి |
| 1 | ఆపరేషన్స్ నుండి మొత్తం ఆదాయం (నికరము) | - | 88.33 | 2.83 | - | 88.33 | 2.83 |
| 2 | ప్రస్తుత కాలమునకు నికర లాభం/ (నష్టం) (పన్ను, మినహాయించిన మరియు/ లేదా అసాధారణ ఐటమ్‌లకు ముందు) | 3.74 | -5.20 | -3.08 | 3.74 | -5.20 | -3.08 |
| 3 | ప్రస్తుత కాలమునకు నికర లాభం/ (నష్టం) పన్నుకు పూర్వము (మినహాయింపు మరియు / లేదా అసాధారణ ఐటమ్స్ తరువాత) | 3.74 | -5.20 | -3.08 | 3.74 | -5.20 | -3.08 |
| 4 | ప్రస్తుత కాలమునకు నికర లాభం/ (నష్టం) పన్నుల తరువాత (మినహాయింపు మరియు/ లేదా అసాధారణ ఐటమ్స్ తరువాత) | 2.77 | -1.23 | -3.77 | 2.77 | -1.46 | -3.77 |
| 5 | ప్రస్తుత కాలమునకు మొత్తం సమగ్ర ఆదాయము (లాభం/ (నష్టం) కలిగి యున్నది) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత). | 2.77 | -1.23 | -3.77 | 2.77 | -1.46 | -3.77 |
| 6 | ఈక్విటీ షేర్ క్యాపిటల్ | 713.10 | 713.10 | 713.10 | 713.10 | 713.10 | 713.10 |
| 7 | రిజర్వులు (క్రితం సంవత్సరం బ్యాలెన్స్ షీట్స్‌లో చూపిన విధంగా రీవాల్యుయేషన్ రిజర్వు మినహాయించి). | 351.93 | | | 355.77 | | |
| 8 | ఒక్కొక్క షేర్‌కు ఆదాయములు (ఒక్కోటి రూ.10/-ల చొప్పున) (కంటిన్యూయింగ్ మరియు డిస్‌కంటిన్యూడ్ ఆపరేషన్ల కొరకు) | | | | | | |
| | ఎ) బేసిక్ | 0.04 | -0.02 | -0.05 | 0.04 | -0.02 | -0.05 |
| | బి) డైల్యూటెడ్ | 0.04 | -0.02 | -0.05 | 0.04 | -0.02 | -0.05 |

**గమనికలు:**
1) పైన తెలిపిన ఫలితములు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు ఆమోదించబడినవి మరియు **12 ఆగస్టు 2026**న జరిగిన వారి సమావేశంలో కంపెనీ డైరెక్టర్ల బోర్డుచే ఆమోదించబడినవి.
2) పైన తెలిపిన వివరమైన త్రైమాసికపు/ వార్షిక ఆర్థిక ఫలితాల నమూనా SEBI (లిస్టింగ్ అండ్ అదర్ డిస్క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్ 2015లోని రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల వద్ద దాఖలు చేయబడినవి. త్రైమాసికపు/ వార్షిక ఆర్థిక ఫలితాల పూర్తి నమూనా కంపెనీ వెబ్‌సైట్ www.steadfastcorp.in లో లభించును.

బోర్డు ఉత్తర్వు ద్వారా
స్టెడ్‌ఫాస్ట్ కార్పొరేషన్ లిమిటెడ్ తరపున
సం/-
కీసర వివేక్ రెడ్డి
మేనేజింగ్ డైరెక్టర్
DIN : 07907507

ప్రదేశం: హైదరాబాద్
తేది: 13.08.2026



## సూర్యాంబ స్పిన్నింగ్ మిల్స్ లిమిటెడ్

CIN: L18100TG2007PLC053831
రిజిస్టర్డ్ ఆఫీస్: 1వ అంతస్తు, సూర్య టవర్స్, 105, ఎస్.పి. రోడ్డు, సికింద్రాబాద్, తెలంగాణ-500003. కార్పొరేట్ ఆఫీస్: ఎ-101, కన్హ అపార్ట్‌మెంట్,128, ఛావని, కటోల్ రోడ్, నాగ్‌పూర్-440013, ఎంహెచ్, టెలి నెం. 040 27813360, 0712-2591072, ఇ-మెయిల్: samba.ngp@gmail.com, వెబ్‌సైట్: www.suryaamba.com

**30.06.2026తో ముగిసిన కాలానికి ఆడిట్‌కాని స్వతంత్ర ఆర్థిక ఫలితాల సారాంశం**

(ఒక్కో షేరు డేటా మినహా రూ. లక్షలలో)

| వివరములు | త్రైమాసికపు ముగింపు 30-06-2026 ఆడిట్‌కానివి | త్రైమాసికపు ముగింపు 31-03-2026 ఆడిట్‌అయినవి | త్రైమాసికపు ముగింపు 30-06-2025 ఆడిట్‌కానివి | సంవత్సరపు ముగింపు 31-03-2026 ఆడిట్‌అయినవి |
|---|---|---|---|---|
| ఆపరేషన్స్ నుండి మొత్తము ఆదాయము (నికరం) | 4949.94 | 4782.13 | 5260.44 | 20779.92 |
| ప్రస్తుత కాలమునకు లాభము (పన్ను, మినహాయించబడిన మరియు/ లేదా అసాధారణ ఐటమ్స్‌కు పూర్వము) | (73.90) | 108.51 | 81.22 | 417.22 |
| *పన్ను తరువాత ప్రస్తుత కాలానికి లాభం | (55.31) | 71.56 | 61.04 | 304.28 |
| ప్రస్తుత కాలానికి మొత్తం సమగ్ర ఆదాయం పన్ను తరువాత ((ప్రస్తుత కాలానికి లాభం/(నష్టము) కలిగి ఉన్నది (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)) | (56.30) | 63.76 | 62.31 | 300.31 |
| చెల్లించిన ఈక్విటీ వాటా మూలధనం (ఒక్కొక్కటి రూ. 10/- ల ముఖ విలువతో) | 293.19 | 293.19 | 293.19 | 293.19 |
| రిజర్వులు (రీవాల్యుయేషన్ రిజర్వులు మినహా) & గత సంవత్సరపు ఆడిట్ అయిన బ్యాలెన్స్ షీట్‌లో తెలిపిన విధముగా ఇతర ఈక్విటీ | - | - | - | 6252.65 |
| ఒక షేరుకు ఆదాయములు (వార్షికము కానివి) (రూ. లలో) | | | | |
| బేసిక్: | (1.89) | 2.44 | 2.08 | 10.38 |
| డైల్యూటెడ్: | (1.89) | 2.44 | 2.08 | 10.38 |

*రిపోర్టింగ్ కాలమునకు మినహాయించిన మరియు అసాధారణ ఐటమ్‌లు ఏమీలేవు

**గమనికలు:**
1. 30 జూన్, 2026తో ముగిసిన త్రైమాసికపు కంపెనీ ఆర్థిక ఫలితములు ఆడిట్ కమిటీచే సమీక్షించబడి సిఫార్సు చేయబడినవి మరియు తేది: 13 ఆగస్టు, 2026న జరిగిన కంపెనీ బోర్డుచే సమావేశంలో ఆమోదించబడినవి. 30 జూన్, 2026తో ముగిసిన త్రైమాసికపు స్వతంత్ర ఆర్థిక ఫలితాలలో మార్పులేని అభిప్రాయంతో సంస్థ యొక్క చట్టబద్ధమైన ఆడిటర్లు సంక్షిప్త సమీక్ష నివేదికను జారీచేసారని కంపెనీ ధృవీకరించినది.
3. ప్రస్తుత కాలమునకు ప్రజెంటేషన్ అనుగుణంగా అవసరమని భావించిన చోట గత కాలపు సంఖ్యలు రీ గ్రూప్ చేయబడినవి.
4. సెబి (లిస్టింగ్ అండ్ అదర్ డిస్క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్ 2015లోని రెగ్యులేషన్ 33 క్రింద త్రైమాసికపు ఆర్థిక ఫలితాల యొక్క పైన తెలిపిన వివరమైన నమూనా యొక్క సారాంశము స్టాక్ ఎక్స్ఛేంజ్ వద్ద దాఖలు చేయబడినవి. సవివరమైన ఆర్థిక ఫలితములు స్టాక్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్ అనగా BSE లిమిటెడ్ (www.bseindia.com) మరియు కంపెనీ వెబ్‌సైట్: www.suryaamba.com లో లభించును.

సూర్యాంబ స్పిన్నింగ్ మిల్స్ లిమిటెడ్ తరపున
సం/- వీరేందర్ కుమార్ అగర్వాల్
(మేనేజింగ్ డైరెక్టర్)
DIN: 00013314

తేది: 13.08.2026
ప్రదేశం: సికింద్రాబాద్


## క్రమశిక్షణ, దేశభక్తి కలిగిన యువత భారత ఔన్నత్యానికి చిహ్నం





- తిరంగా ర్యాలీలో పాల్గొన్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్
- తిరంగర్యాలీలో వేలాదిగా పాల్గొన్న యువత విద్యార్థులు

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 13 (నినాదం ):** భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఐడీపీఎల్ చౌరస్తాలో భారతీయ జనతా పార్టీ బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన "తిరంగా ర్యాలీ"లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్యఅతిథిగా హాజరైనారు. జాతీయ జెండాను చేతబూని ర్యాలీలో పాల్గొన్న ఈటల రాజేందర్ మాట్లాడుతూ క్రమశిక్షణ దేశభక్తి కలిగిన యువత దేశ ఔన్నత్యానికి చిహ్నం అని తెలిపారు. ప్రధాని పిలుపు మేరకు ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని ఎంపీ ఈటెల రాజేందర్ ప్రజలకు పిలుపునిచ్చారు. విభిన్న జాతులు, సంస్కృతులు, భాషలు ఉన్నప్పటికీ కలిసి జీవించే దేశం భారతదేశమని అన్నారు. మనందరం భారతమాత ముద్దుబిడ్డలమని పేర్కొన్నారు. జనగణమన, వందేమాతరం వంటి జాతీయ భావనలు ఆసేతు హిమాచలం భారతీయులను ఐక్యంగా ఉంచుతున్నాయని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రపంచ పటంపై భారతదేశ ఔన్నత్యం సమున్నతంగా నిలుస్తోందన్నారు. దేశ అభివృద్ధి కోసం మోదీ కి ప్రతి ఒక్కరూ చేయూతనిచ్చి, ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు ఇంచార్జి మల్లారెడ్డి, వడేపల్లి రాజేశ్వర్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొల్లి మాధవి, జిల్లా జనరల్ సెక్రెటరీ విగ్నేష్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు శేఖర్ యాదవ్, రాష్ట్ర మున్సిపల్ సెల్ కో కన్వీనర్, మాజీ కార్పొరేటర్ శేషగిరి, కూకట్‌పల్లి అసెంబ్లీ ఇంచార్జ్ కాంత రావు, కన్వీనర్ శ్రీకర్ రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్ల జయశేఖర్ గౌడ్, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ తాడూరి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు, సీనియర్ నాయకులు వేముల రమేష్, బీజేవైఎం నాయకులు శ్రీనాథ్, సాయి కిరణ్ రెడ్డి, ఆర్తిక్ యాదవ్ పాల్గొన్నారు.


**BRANCH SHIFTING**

మా విలువైన కస్టమర్ల కోసం, మా **NALGONDA - PRAKASAM BAZAR** బ్రాంచ్ నూతన ప్రాంగణం లోనికి **14.11.2026** నుండి మార్చబడుతుంది. నూతన చిరునామా క్రింద ఇవ్వబడినది;

**Muthoot Finance Ltd**
Ground Floor, H.No.5-7-118(Old),
5-7-208 (New), Manyam Chelka,
Nalgonda, Nalgonda District,
Telangana State, Pin - 508001.
Phone No : 09188902854, 09633013544.
Email id : mgnal4219@muthootgroup.com

"ఏదైనా ఫిర్యాదు ఉంటే దయచేసి 0484 4804074 కు కాల్ చేయండి".

మీ నిరంతర చేయూత మరియు మద్దతును కోరుతున్నాము.

Muthoot Finance
A Muthoot M George Enterprise


## బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫర్నీచర్ అందజేత

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 13(నినాదం ):** మంచాల మండలం దాద్ పల్లి గ్రామం లో బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి గారి సహకారం తో మహిళా స్వయం సహాయక సంఘాలకు, గ్రామ పంచాయతీ కి ఫర్నిచర్ అందజేయడం జరిగింది. మరియు గ్రామం లో ప్రజలకు త్రాగు నీరు కోసం మంచి నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు కోసం హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇప్పటికి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లోని చాలా గ్రామాలకు మరియు వ్యక్తుల వారీగా భాదితులకు కూడా ఎన్నో రకాలుగా సహాయ సహకారాలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో మంచాల మాజీ వైస్ ఎంపీపీ నర్సింగ్ వెంకటేష్ గౌడ్, గ్రామ సర్పంచ్ నేనావత్ శాంతి రాజు నాయక్, ఉప సర్పంచ్ కావేటి నర్సింగ్ రావు, వార్డు సభ్యులు నేనావత్ పార్వతి, నేనావత్ రాజేందర్, దాద్ పల్లి మహిళా సంఘాల సభ్యులు ఎదీఖ నేనావత్ సునీత, మాజీ వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

### పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి





**పటాన్చెరు, ఆగస్టు 13(నినాదం):** ముత్తంగి డివిజన్, ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని సరిహద్దు కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న మొరిగినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం ఇస్నాపూర్ మున్సిపల్, ముత్తంగి డివిజన్ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో కలిసి కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముత్తంగి డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల నుండి వచ్చే మురుగు నీటిని ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని యుజిడిల ద్వారా తరలించాల్సి వస్తోందని తెలిపారు. యుజిడిల పైపు సామర్థ్యం తక్కువ ఉండడం మూలంగా నిరంతరం సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని ఆయా శాఖల అధికారులు ఎమ్మెల్యే జీఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు. రెండు శాఖల అధికారులు సమన్వయంతో జనాభాకు అనుగుణంగా నూతన అంతర్గత మురుగు నీటి కాలువల పైపులైన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి అతి త్వరలో నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట కిషన్ రావు, డిఈలు కృష్ణవేణి, నరసింహ రావు, మాజీ జడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, కౌన్సిలర్లు ఆంజనేయులు, వెంకటేష్, మేరాజ్ ఖాన్, నిజాముద్దీన్ బాబా, అబిద్ పాల్గొన్నారు.

## జలసిరితో ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు

- ఎమ్మెల్యే బాలు నాయక్



**చింతపల్లి, ఆగస్టు 13(నినాదం):** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న జలసిరి కార్యక్రమం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ జలసిరి ద్వారా గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన, సురక్షితమైన నీరు అందించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని, నీటి వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన సూచించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించడమే జలసిరి లక్ష్యమని, ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని అన్నారు. ప్రతి తండాలో గ్రామపంచాయతీ భవన నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలతో పాటు, శిథిలావస్థలో ఉన్న భవనాల స్థానంలో నూతనంగా భవనాలు నిర్మించడం జరుగుతుందని ఆయన వివరించారు. వివో భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ మంజూరు చేయించే దిశలో తమ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా మోదుగుల మల్లేపల్లి సర్పంచ్ ముద్దం మల్లేష్ గౌడ్, మల్లారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ నల్ల సుమిత రఘుమా రెడ్డి, కుర్మపల్లి సర్పంచ్ కట్ట మహేష్, గొడకొండ్ల గ్రామ సర్పంచ్ కాశగోని వెంకటయ్య , దేనియా తండా సర్పంచ్ రామావత్ కొండల్, తదితరులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. మండల ప్రత్యేక అధికారి నాగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీడీవో సుజాత, మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతశీ అలివేలు సంజీవరెడ్డి, తాసిల్దార్ పండాల విజయలక్ష్మి, డి ఎల్ పి ఓ శంకర్ నాయక్, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి ప్రాధాన్యత క్రమంలో కార్యక్రమాలు అమలు చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు



గద్వాల బ్యూరో ఆగస్టు 13( నినాదం): గ్రామాల అవసరాలకు అనుగుణంగా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి, ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసి తమ ఛాంబర్ నందు 2026--27 ఆర్థిక సంవత్సరానికి జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై జిల్లా స్థాయి కార్యాచరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధిని మరింత వేగవంతం చేయడంతో పాటు గ్రామస్థాయిలో సమగ్ర అభివృద్ధిని సాధించేందుకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు సమర్థవంతమైన సాధనమని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు గ్రామాల వాస్తవ అవసరాలను ప్రతిబింబించేలా ఉండాలని స్పష్టం చేశారు. పేదరిక నిర్మూలన, జీవనోపాధి మెరుగుదల, ఆరోగ్యవంతమైన గ్రామాలు, బాలలకు అనుకూల వాతావరణం, నాణ్యమైన విద్య,తాగునీటి సౌకర్యం,పారిశుద్ధ్యం, పచ్చదనం, స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాలు,సామాజిక న్యాయం,సుపరిపాలన,మహిళా సాధికారత వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. తమ శాఖలకు సంబంధించిన గణాంకాలు, భౌతిక,ఆర్థిక ప్రగతి,అవసరాల వివరాలను సకాలంలో అందించి ప్రణాళికల రూపకల్పనకు సహకరించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు,పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధి వంటి ప్రాజెక్టులను ప్రాధాన్యతగా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల్లో చేర్చాలని సూచించారు.అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి తమ శాఖల పథకాలు, నిధులు,వనరులను సమీకరిస్తూ ఫండ్ కన్వర్జెన్స్ ద్వారా గ్రామాల అవసరాలకు అనుగుణంగా సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు రూపొందించాలని ఆదేశించారు. గ్రామసభల ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించి, గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించాలని తెలిపారు. రూపొందించే ప్రణాళికలు గ్రామాల సమగ్రాభివృద్ధికి దోహదపడటంతో పాటు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో అదర్శంగా నిలవాలని అన్నారు.ప్రతి శాఖ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి నిర్దేశిత గడువులోగా ప్రతిపాదనలు సమర్పించాలని, శాఖల మధ్య సమన్వయంతో నాణ్యమైన జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగేంద్రం, డీఆర్డీఓ మహ్మద్ బేగం, డీపీఓ శ్రీకాంత్, డీడబ్ల్యూఓ సునంద, డియంహెచ్ఓ సంధ్య కిరణ్మయి,మత్స్య శాఖ అధికారి షకీలా భాను, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆవేశంలో రైలు పట్టాలెక్కిన వ్యక్తి...

### సకాలంలో స్పందించిన పోలీసులు



నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు 13, (నినాదం): కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి ఆత్మహత్యకు యత్నించిన ఒక వ్యక్తిని మక్తల్ పోలీసులు చాకచక్యంగా కాపాడారు. సమయస్ఫూర్తితో స్పందించి ఒక నిండు ప్రాణాన్ని నిలబెట్టిన పోలీసుల పనితీరుపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.వివరాలలోకి వెళితే...నారాయణపేట జిల్లా జక్లేర్ గ్రామానికి చెందిన నరసింహ అనే వ్యక్తి కుటుంబ సమస్యల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం రాత్రి తన భార్య మంగమ్మకు ఫోన్ చేసి, తాను చనిపోతున్నానని చెప్పి రైల్వే ట్రాక్ వైపు వెళ్లాడు. ఆందోళన చెందిన భార్య వెంటనే రాత్రి 11 గంటల సమయంలో మక్తల్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఆవేదనతో సమాచారం అందించింది. రంగంలోకి దిగిన పోలీసులు బాధితురాలి నుంచి సమాచారం అందుకున్న మక్తల్ ఎస్ఐ రాజు తక్షణమే స్పందించారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న బ్లూకోల్ట్, పెట్రోలింగ్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. హెచ్‌సీ-693 బలరాం, పిసి-763 హరీష్ గౌడ్, పిసి-2501 నరేష్, హెచ్‌జీ-150 శ్రీనివాస్. ఎస్ఐ ఆదేశాలతో అప్రమత్తమైన పోలీస్ బృందం ఆలస్యం చేయకుండా జక్లేర్ గ్రామ శివారులోని రైల్వే ట్రాక్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే చీకట్లో రైల్వే ట్రాక్‌పై ఉన్న నరసింహను పోలీసులు గుర్తించారు. అతనికి నచ్చజెప్పి, ఆవేశంలో ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని ధైర్యం చెప్పారు. అనంతరం అతడిని సురక్షితంగా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కుటుంబ సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని కౌన్సెలింగ్ ఇచ్చి, భద్రంగా ఇంటికి తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు.సమయానికి స్పందించి తమ నరసింహ ప్రాణాలు కాపాడిన మక్తల్ పోలీసులకు కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతూ కృతజ్ఞతలు తెలిపారు. రాత్రి వేళలోనూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రాణాపాయం తప్పించిన సిబ్బందిని పోలీస్ ఉన్నతాధికారులు సైతం ప్రత్యేకంగా అభినందించారు.

## హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### . . . సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు



నిజామాబాద్ (ప్రతినిధి, ఆగస్టు 13 (నినాదం) : ఐఎంఎల్ డిపో హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం మండల తహసీల్దార్‌కు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ 2023 అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో హమాలీ కార్మికుల కోసం ప్రత్యేకంగా వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని, హెల్త్ కార్డులు అందజేస్తామని ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెట్ యార్డులు, సివిల్ సప్లైస్, రైస్ మిల్లులు, దాల్ మిల్లులు, గిడ్డంగులు, వ్యాపార సంస్థలు, బజారు ముఠాలు, కోల్డ్ స్టోరేజీలు, కూరగాయల--పండ్ల మార్కెట్లు, రైల్వే, సిమెంట్, స్టీల్ తదితర రంగాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులు ప్రజలకు నిత్యావసర సరుకులు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగినా హమాలీల కూలీ రేట్లు పెరగలేదని, పని భద్రత, సామాజిక భద్రత, ఆరోగ్య రక్షణ, సంక్షేమ సౌకర్యాలు లేక వేలాది మంది హమాలీ కార్మికులు తీవ్ర ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు కాలేదని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కొండ గంగాధర్ మాట్లాడుతూ, ఐఎంఎల్ డిపో కార్మికుల్లో 50 సంవత్సరాలు పైబడిన హమాలీ కార్మికులకు నెలకు రూ. 6,000 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం చెల్లించాలని, కార్మికులందరికీ హెల్త్ కార్డులు అందించాలని కోరారు. ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు రమేష్, లక్ష్మణ్, రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు యూనిఫామ్,టై, బెల్ట్, పంపిణీ చేసిన సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి



కల్వకుర్తి ఆగస్టు 13 (నినాదం) తలకొండపల్లి మండలం పడకల్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వము నుండి వచ్చిన యూనిఫామ్,టై, బెల్ట్, షూ, విద్యార్థిని విద్యార్థులకు అందజేసిన గ్రామ సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి ఈ సందర్భంగా సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వంలో నిరుపేద విద్యార్థులు చదువుకుంటారు వారికి నాణ్యమైన విద్యను అందిస్తూ నాణ్యత మైన దుస్తులు అందించి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల బలోపేతం లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు అని అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు, గ్రామ ఉపసర్పంచ్, రాఘవేందర్ ,వార్డు సభ్యులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.



## మెనూ ప్రకారం భోజనం ఏదీ?

### మిక్స్డ్ వెజిటబుల్ కర్రీ, వెజిటేబుల్ బిర్యానీ ఇవ్వాల్సి ఉండగా..

### తెల్ల అన్నం, అనపకాయ కూర వడ్డింపు




నాగర్ కర్నూల్ ఆగస్ట్ 13 (నినాదం) : నాగర్‌కర్నూల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా తిమ్మాజిపేట మండలం మారేపల్లి ప్రాథమిక పాఠశాలలో భోజనం వడ్డిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారంగా గురు వారం విద్యార్థులకు మిక్స్ వెజిటబుల్ కర్రీ, వెజిటేబుల్ బిర్యానీ అందించాల్సి ఉండగా.. పాఠశాలలో మాత్రం తెల్ల అన్నం, అనపకాయ కూర మాత్రమే వండి వడ్డిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత పాఠశాల సిబ్బందిపై ఉన్నప్పటికీ, మెనూకు విరు ద్ధంగా భోజ నం అందించడంపై విద్యార్థులు, తల్లిదం డ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు అందించే భోజనంలో మెనూ పాటిస్తున్నారా? లేదా? అనే అంశంపై అధికారులు పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు. మెనూ అమలుపై అధికారులు దృష్టి సారించి, విద్యార్థులకు ప్రతిరోజూ నిర్దేశిత మెనూ ప్రకారం భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్లు విడుదల చేయాలి

### ఖాళీగా ఉన్న జూనియర్ కళాశాల లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలి

### విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించాలి: ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్



ఖమ్మం, ఆగస్టు 13(నినాదం): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో గురువారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌ను వేలాది మంది విద్యార్థులతో ముట్టడించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమం లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ. వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్లు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం విద్యారంగంపై సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని విమర్శించారు. విద్యార్థుల హక్కుగా అందాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మెంట్లను బిక్షగా చూడొద్దని, తక్షణమే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అనేక సబ్జెక్టులకు లెక్చరర్లు లేక విద్యార్థు లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అసెంబ్లీలో ప్రకటించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల మధ్యాహ్న భోజన పథకాన్ని మాటలకే పరిమితం చేయకుండా తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మం నగరంలోని బీపీఈడీ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం లేకపోవడంతో ప్రతిరోజూ తెల్లవారుజామున మూడు కిలోమీటర్ల మేర నడిచి గ్రౌండ్‌కు రావాల్సి వస్తోందని ప్రవీణ్ తెలిపారు. కళాశాలకు అనుబంధంగా బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలని కోరారు. సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కొరత ఉందని, వాటి అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి లేకపోవడం దురదృష్టకరమని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా విద్యా శాఖ మంత్రిని కేటాయించాలని అన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మం త్రులు విద్యారంగ సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో జిల్లాలో మంత్రుల పర్యటనలను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్ర మంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వంకాయల రాజు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సాత్విక, జిల్లా ఉపాధ్యక్షులు దొంతబోయిన వెంకటేష్, ఖమ్మం డివిజన్ అధ్యక్షులు రెడ్డిపోగుల త్రినాథ్, జిల్లా కమిటీ సభ్యులు భాను, శ్రీకర్, ఎస్ఆర్ఎన్ బీజీఎన్ఆర్ కళాశాల కార్యదర్శి శ్యామ్, నాయకులు లోకేష్, భరత్, గోపీచంద్, సత్యారాం, సంజు, రాగిణి, పూజిత, త్రివేణి, సింధు, భువనకీర్తి, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు అందించాలి

### పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఫుడ్ కమిషన్ చైర్మన్





కల్వకుర్తి ఆగస్టు 13 (నినాదం) ఇబ్రహీం పట్నం నియోజక వర్గంలోని మంచాల మండలం ఆరుట్ల గ్రామ పంచాయతీ పరిధిలో తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మరియు కమిషన్ సభ్యులు శారద, ఆనంద్, భారతి తెలంగాణ పబ్లిక్ పాఠశాలను ఆకస్మి కంగా తనిఖీ నిర్వహించారు. చైర్మన్,సభ్యులు ఉదయం విద్యార్థులకు అందిస్తున్న బ్రేక్ ఫాస్ట్‌ను స్వయంగా రుచి చూసి,ఆహార నాణ్యతను పరిశీ లించారు. మెనూ ప్రకారం మిల్లెట్ ఇడ్లీ,రాగి జావ అందించాల్సి ఉండగా, జీరా రైస్ అందిం చడంపై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా సమస్య కార ణంగా టిఫిన్ అందిం చలేకపోయామని ప్రిన్సిపాల్, మెస్ ఇన్‌చార్జ్ వివరిం చారు. అయితే కారణాలు చెప్పకుండా నిర్దేశిత మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాల్సిన బాధ్యత ఉందని చైర్మన్ స్పష్టం చేశారు. విద్యార్థులతో మాట్లాడగా, మెనూ ప్రకా రం ఆహారం అందడం లేదని, తరచూ అన్నం మాత్రమే పెడుతున్నారని, టిఫిన్ సరిగా అందడం లేదని తెలిపారు. కిచెన్, డైనింగ్ హాల్ మరియు ఫుడ్ స్టోరేజీని పరిశీలించగా పాడైన కూరగాయలు,నాణ్యత లేని బియ్యం నిల్వలు గుర్తించారు. స్టోరేజ్ రూమ్‌లో కొన్ని సామగ్రిని నేలపై ఉంచినట్లు గుర్తించారు. మెనూ బోర్డు, కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేయకపోవడం కూడా గుర్తించారు. సివిల్ సప్లై అధికారు లకు నాణ్య మైన బియ్యం అందించాలని అదేసించారు. తరచు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయిం చాలని ఆదేశించారు. విద్యార్థులకు నిర్ణయించిన మెనూ ప్రకారం నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించడం తప్పనిసరి అని చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థుల ఆహార విషయంలో నిర్లక్ష్యా న్ని సహించబోమని హెచ్చరించారు. అనంతరం ప్రిన్సిపాల్, హెడ్ మాస్టర్లు, స్కూల్ కమిటీ సభ్యులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఇప్పటివరకు జరిగిన స్కూల్ కమిటీ సమావేశాల్లో ఆహార భద్రత, విద్యార్థుల ఆరోగ్య ప్రొఫైల్ అంశాలను అజెండాలో చేర్చకపోవడం కమిషన్ దృష్టికి వచ్చింది. విద్యార్థుల ఆరోగ్యం, ఆహార నాణ్యత మరియు మెనూ అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, భవిష్యత్తులో ఇలాంటి లోపాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కమిషన్ బృందం ఆదేశించింది.

## ఆగి ఉన్న టూరిస్ట్ బస్సును ఢీకొన్న లారీ

### ఇద్దరు మహిళల దుర్మరణం..

### మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

### గోవింద్‌పేట్ బ్రిడ్జి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### సంఘటన స్థలానికి పరిశీలించిన పోలీస్ కమిషనర్



నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 13 (నినాదం) : జాతీయ రహదారిపై టైర్ పంక్చర్ అయి ఆగి ఉన్న టూరిస్ట్ బస్సును వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీ కొట్టడంతో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఆర్మూర్ మండల పరిధిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వట్ ప్రాంతానికి చెందిన భక్తులు హైదరాబాద్‌లోని చిన్న జీయర్ స్వామి దర్శనం కోసం రెండు టూరిస్ట్ బస్సుల్లో తీర్థయాత్రకు బయలుదేరారు. ఆర్మూర్ మండల పరిధిలోని గోవింద్‌పేట్ బ్రిడ్జి సమీపానికి చేరుకున్న సమయంలో ముందుగా వెళ్తున్న టూరిస్ట్ బస్సు టీజీ 01 టీ 1864 టైర్ పంక్చర్ కావడంతో రెండు టీజీ 21 టీ 2172 బస్సులను జాతీయ రహదారిపై నిలిపివేశారు. టైర్ పంచర్ కావడంతో బస్సులోని కొంతమంది ప్రయాణికులు కిందికి దిగి, రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌పై కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇదే సమయంలో వెనుక వైపు నుంచి వేగంగా వస్తున్న లారీ టీజీ 27 టీఎఫ్ 7482 డ్రైవర్ ఆగి ఉన్న టూరిస్ట్ బస్సును సకాలంలో గుర్తించకపోవడంతో బస్సును బలంగా ఢీకొట్టాడు. లారీ ఢీకొట్టడంతో ఆగి ఉన్న టూరిస్ట్ బస్సు ముందుకు కదిలి డివైడర్ ప్రాంతంలో కూర్చున్న ప్రయాణికులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సుజాత (54), మాధవి(47)అనే ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు ప్రయాణికులు సునీత, చిటక్కలకు తీవ్రంగా గాయపడటంతో వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులకు వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడ ఉన్న ఇతర ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా,పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

**సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీస్ కమిషనర్**

ప్రమాదం ఘటన సమాచారం తెలుసుకున్న పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద పరిస్థితులను పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును సంబంధిత పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, వాహనాలు ఏ విధంగా నిలిపి ఉన్నాయనే అంశాలతో పాటు లారీ ఢీకొన్న తీరును అధికారులు సీపీకి వివరించారు. సంఘటనా స్థలంలో సహాయక చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన విధానం తదితర అంశాలను కమిషనర్ పరిశీలించారు. అనంతరం క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, వారి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేలా చర్యలు చేపట్టారు. సీపీ వెంట ఆర్మూర్ ఏ.సి.పి వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ, ఆర్మూర్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రాహుల్ కుమార్, ఆర్మూర్, జక్రాన్ పల్లి, బాల్కొండ ఎస్సైలు, అసిస్టెంట్ ఎం.వి.ఐ పాల్గొన్నారు.

## కొత్తగూడెం కార్పొరేషన్‌ను చిదిమేయకండి: ఎమ్మెల్యే కూనంనేని



కొత్తగూడెం, ఆగస్టు 13(నినాదం): కొత్తగా ఏర్పడిన కొత్తగూడెం కార్పొరేషన్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాల్సిన సమయంలో అనవసర ఆరోపణలు, తప్పుడు ప్రచారాలతో ప్రజల్లో అనుమానాలు సృష్టించవద్దని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా రూ. 600 కోట్ల నిధులు సాధించే దిశగా చర్యలు చేపట్టామని, డీపీఆర్ టెండర్లలో పూర్తి పారదర్శకత పాటిస్తామని తెలిపారు. కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు సమకూరనున్నాయని చెప్పారు. దేశవ్యాప్తంగా ఈ పథకంలో కేంద్ర సహాయం, రాష్ట్ర వాటా, బ్యాంకు రుణాల ద్వారా నిధుల సమీకరణ జరుగుతుందని వివరించారు. ఖమ్మం కార్పొరేషన్‌కు సుమారు రూ. 2,670 కోట్ల రుణం వచ్చే అవకాశం ఉండగా, కొత్తగూడెం కార్పొరేషన్‌కు రూ. 600 కోట్ల రుణం కోసం ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ నిధులతో రోడ్లు, డ్రైనేజీలు, విద్యాసంస్థలు, క్రీడా ప్రాంగణాలు, ఇతర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు.


**రూ. 9.60 కోట్ల అవినీతి ఆరోపణలు అబద్ధం**

రూ. 600 కోట్ల అంచనా పనులకు 1.6 శాతం చొప్పున డీపీఆర్ తయారీ టెండర్ ఒప్పందం జరిగితే రూ. 9.60 కోట్ల అవినీతి జరిగిందని ప్రచారం చేయడం అవగాహన లేమికి నిదర్శనమని కూనంనేని విమర్శించారు. రాష్ట్రంలోని నల్గొండలో 1.6 శాతం, మహబూబ్‌నగర్‌లో రూ. 1,000 కోట్ల పనులకు 1.5 శాతం చొప్పున డీపీఆర్ ఒప్పందాలు జరిగిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇతర పట్టణాల్లో ఇదే విధానం అమలవుతున్నప్పుడు కొత్తగూడెంలోనే అవినీతి జరిగిందని ఆరోపించడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. "ఆరు నెలల పసికందులాంటి కొత్తగూడెం కార్పొరేషన్‌ను పురిటిలోనే చిదిమేయకండి" అని అన్నారు.

**ఆన్‌లైన్ టెండర్లకు ఆదేశాలు**

ప్రజల్లో ఉన్న అనుమానాలు, అపోహలను నివృత్తి చేసేందుకే ఆఫ్‌లైన్ డీపీఆర్ విధానాన్ని రద్దు చేసి ఆన్‌లైన్ టెండర్లకు ఆదేశాలు ఇచ్చామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. 0.5 శాతం లేదా అంతకంటే తక్కువకు డీపీఆర్ పనులు చేపట్టే సామర్థ్యం ఉన్నవారు ఆన్‌లైన్ టెండర్లలో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ ప్రక్రియలో పూర్తి పారదర్శకత ఉంటుందని చెప్పారు. చుంచుపల్లి ఉమ్మడి పంచాయతీ 45 ఏళ్లుగా సీపీఐ ఆధీనంలో ఉందని, ప్రజాదరణ లేకపోతే తాము ఎన్నికల్లో గెలిచేవాళ్లమా అని ప్రశ్నించారు. గతంలో ప్రపంచ బ్యాంకు రుణాల విధానాన్ని తాము వ్యతిరేకించిన విషయాన్ని కూడా గుర్తుచేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరైనా తప్పులకు పాల్పడినా, పేదలను మోసం చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని కూనంనేని హెచ్చరించారు. అయితే ఆధారాలు లేకుండా అనవసర ఆరోపణలు చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించవద్దని సూచించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, నాయకులు ఎండి యూసుఫ్, మునిగడప వెంకటేశ్వర్లు, పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పేర్ల మార్పు సమస్యను వెంటనే పరిష్కరించాలి



కొత్తగూడెం, ఆగస్టు 13(నినాదం): సింగరేణి కార్మికుల కుటుంబాలకు సంబంధించిన పేర్ల మార్పు సమస్యను వెంటనే పరిష్కరించాలని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ డిమాండ్ చేశారు. సుదీర్ఘకాలంగా విజిలెన్స్ విచారణ పేరుతో సమస్య పెండింగ్‌లో ఉండటంతో సుమారు 400 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆయన అన్నారు. స్థానిక హెడ్ ఆఫీస్ ఎదుట బాధితులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించిన శివకుమార్, దీక్ష చేస్తున్న వారికి సంఘీభావం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ తీసుకుని సింగరేణి యాజమాన్యంతో చర్చించి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో అన్ని సంఘాలను కలుపుకుని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుండా రమేష్, పి. సురేందర్, భూపతి అశోక్, మచ్చా పృథ్వీరాజ్, ఎనిగంట శ్రీనివాస్, అన్వర్ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

## లేఅవుట్లలో రోడ్ల విస్తీర్ణం, హద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

### మున్సిపల్ కమిషనర్‌కు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశాలు



నాగర్ కర్నూల్ ఆగస్టు 13 (నినాదం) : నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన ప్రైవేటు ప్లాట్ల లేఅవుట్లపై జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ సందర్శించారు. పట్టణ విస్తరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో ప్రైవేటు లేఅవుట్లు ,పట్టణాభివృద్ధి క్రమబద్ధంగా సాగేందుకు, ప్రజలకు భవిష్యత్తులో రహదారులు, మౌలిక సదుపాయాల విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, కలెక్టర్ ఆదేశించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదురుగా, జిల్లా ఎస్పీ ఎదురుగా, జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రైవేటు లేఅవుట్లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, లేఅవుట్ల ఏర్పాటు ప్రభుత్వ నిబంధనలు, మున్సిపల్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉందా లేదా అనే అంశాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. లేఅవుట్లలో ప్లాట్ల విభజన, రహదారుల ఏర్పాటు, రోడ్లకు కేటాయించిన స్థలం, లేఅవుట్ హద్దులు, ఇతర మౌలిక సదుపాయాలకు కేటాయించిన ప్రదేశాలను కలెక్టర్ పరిశీలించారు. లేఅవుట్ అభివృద్ధి సమయంలో నిబంధనలకు అనుగుణంగా స్థలాలను కేటాయించారా, రహదారుల విస్తీర్ణం నిర్ణీత ప్రమాణాల మేరకు ఉందా, లేఅవుట్ హద్దులు సక్రమంగా నిర్ధారించారా అనే విషయాలపై లేఅవుట్ ల పరిశీలించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...., పట్టణ ప్రాంతాల్లో ప్రైవేటు లేఅవుట్ల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల మేరకే జరగాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా లేఅవుట్లలో రహదారులు, ప్రజా అవసరాలకు కేటాయించే స్థలాలు, ఇతర మౌలిక సదుపాయాల కోసం నిర్దేశించిన ప్రదేశాలను నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేయాల్సిన బాధ్యత సంబంధిత నిర్వాహకులపై ఉందన్నారు. ప్రైవేటు లేఅవుట్ల విషయంలో మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు ఏర్పాటు చేయకుండా ముందస్తు పర్యవేక్షణ చేపటాలని, ఇప్పటికే ఏర్పాటు చేసిన లేఅవుట్లను కూడా పరిశీలించి, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా నిర్ధారించాలని కలెక్టర్ తెలిపారు. లేఅవుట్లలో రహదారుల విస్తీర్ణం అత్యంత కీలకమైన అంశమని, భవిష్యత్తులో జనాభా పెరుగుదల, వాహనాల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని రహదారుల వెడల్పు, హద్దులు నిబంధనల మేరకు ఉండేలా చూడాలని, రహదారులకు కేటాయించిన స్థలాన్ని ఇతర అవసరాలకు వినియోగించకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా లేఅవుట్ల హద్దులు స్పష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములు, రహదారులు లేదా ప్రజా అవసరాలకు సంబంధించిన స్థలాలు ఆక్రమణకు గురికాకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. లేఅవుట్లను అనుమతించే సమయంలోనే అన్ని నిబంధనలను కచ్చితంగా పరిశీలించాలని, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి లేఅవుట్లు ఏర్పాటు చేసినట్లు గుర్తిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేసే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా, లేఅవుట్లకు సంబంధించిన అనుమతులు, నిబంధనల అమలుపై అధికారులు స్పష్టమైన పర్యవేక్షణ కలిగి ఉండాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రణాళికకు అనుగుణంగా అభివృద్ధి జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. లేఅవుట్ల విషయంలో ఎలాంటి అవకతవకలకు, నిబంధనల ఉల్లంఘనలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రైవేటు లేఅవుట్లను క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న పనులను గుర్తించి వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. లేఅవుట్లకు సంబంధించిన రికార్డులు, అనుమతులు, స్థల వివరాలను పరిశీలించి, నిబంధనల మేరకు ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు లేఅవుట్లకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్‌కు వివరించారు. జిల్లా కలెక్టర్ వెంట నాగర్ కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**anjani foods**

# అంజనీ ఫుడ్స్ లిమిటెడ్

CIN: L65910AP1983PLC004005
రిజిస్టర్డ్ కార్యాలయం: డా॥ బి.వి.రాజు మార్గ్, విష్ణుపూర్, దుర్గాపూర్, గరగపర్రు రోడ్, భీమవరం-534202, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.
వెబ్‌సైట్: www.anjanifoods.in Tel No: 040-40334848 Email-id: cs@freshchoice.in

**30 జూన్, 2026 నాటి త్రైమాసికపు ముగింపు కొరకు స్వతంత్ర మరియు ఏకీకృత ఆడిట్ కాని ఆర్థిక ఫలితాల సారాంశం**

(రూ.లక్షలలో)

| క్ర. సం. | వివరములు | ఏకీకృత | | | | స్వతంత్ర | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | త్రైమాసికపు ముగింపు | త్రైమాసికపు ముగింపు | త్రైమాసికపు ముగింపు | సంవత్సర ముగింపు | త్రైమాసికపు ముగింపు | త్రైమాసికపు ముగింపు | త్రైమాసికపు ముగింపు | సంవత్సర ముగింపు |
| | | 30.06.2026 | 31.03.2026 | 30.06.2025 | 31.03.2026 | 30.06.2026 | 31.03.2026 | 30.06.2025 | 31.03.2026 |
| | | ఆడిట్ కాని | ఆడిట్ అయిన | ఆడిట్ కాని | ఆడిట్ అయిన | ఆడిట్ కాని | ఆడిట్ అయిన | ఆడిట్ కాని | ఆడిట్ అయిన |
| 1. | ఆపరేషన్ల నుండి మొత్తం ఆదాయం (నికర) | 1,426.20 | 1,511.49 | 1537.06 | 6273.33 | 1228.24 | 1330.23 | 1365.74 | 5,529.53 |
| 2, | నికర లాభం / (నష్టం) ప్రస్తుత కాలమునకు (పన్నుకు మినహాయించబడిన మరియు/ లేదా అసాధారణ ఐటమ్స్ పూర్వము) | 21.14 | 43.39 | 36.99 | 186.41 | 22.35 | 67.15 | 46.74 | 217.73 |
| 3. | నికర లాభం / (నష్టం) ప్రస్తుత కాలమునకు పన్నుకు పూర్వము (మినహాయింపు మరియు / లేదా అసాధారణ ఐటమ్స్ తరువాత) | 21.14 | 14.46 | 8.07 | 70.72 | 22.35 | 38.21 | 17.82 | 102.05 |
| 4. | నికర లాభం / (నష్టం) ప్రస్తుత కాలమునకు పన్నుల తరువాత (మినహాయింపు మరియు/లేదా అసాధారణ ఐటమ్స్ తరువాత) | 12.30 | 3.10 | (2.96) | 19.12 | 15.27 | 26.63 | 7.81 | 48.87 |
| 5. | ప్రస్తుత కాలమునకు మొత్తం సమగ్ర ఆదాయము (పన్ను తరువాత) | 12.30 | 13.89 | (2.96) | 29.33 | 15.27 | 37.10 | 7.81 | 59.33 |
| 6. | చెల్లించిన ఈక్విటీ వాటా మూల ధనం | 558.98 | 558.98 | 558.98 | 558.98 | 558.98 | 558.98 | 558.98 | 558.98 |
| 7. | క్రితం అకౌంటింగ్ సంవత్సరము బ్యాలెన్స్ షీట్ ప్రకారం రీవాల్యుయేషన్ రిజర్వులు మినహాయించి రిజర్వులు | 0 | 0 | 0 | 1,068.58 | | | - | 1,114.03 |
| 8. | ఒక్కొక్క షేర్‌కు ఆదాయములు (ఇపిఎస్) అసాధారణ ఐటంల పూర్వము | | | | | | | | |
| | (ఎ) బేసిక్ | 0.06 | 0.05 | 0.01 | 0.12 | 0.05 | 0.10 | 0.03 | 0.17 |
| | (బి) డైల్యూటెడ్ | 0.06 | 0.05 | 0.01 | 0.12 | 0.05 | 0.10 | 0.03 | 0.17 |
| 9. | ఒక్కొక్క షేర్‌కు ఆదాయములు (ఇపిఎస్) అసాధారణ ఐటంల తరువాత | | | | | | | | |
| | (ఎ) బేసిక్ | 0.06 | 0.05 | 0.01 | 0.12 | 0.05 | 0.10 | 0.03 | 0.17 |
| | (బి) డైల్యూటెడ్ | 0.06 | 0.05 | 0.01 | 0.12 | 0.05 | 0.10 | 0.03 | 0.17 |

**గమనిక:**
సెబి (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ & డిస్క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్ 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద 30 జూన్, 2026 నాటి త్రైమాసికపు ముగింపు కొరకు ఆర్థిక ఫలితాలతో పైన తెలిపిన వివరణాత్మక నమూనాను స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో దాఖలు చేయడమైనది. 30 జూన్, 2026 నాటి త్రైమాసికపు ముగింపు కొరకు ఆర్థిక ఫలితాల పూర్తి నమూనా స్టాక్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్ (www.bseindia.com) పై లభ్యమగును.

ఫలితాలను వీక్షించుటకు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

తేది: 13.08.2026
ప్రదేశము : హైదరాబాద్

అంజనీ ఫుడ్స్ లిమిటెడ్ తరుపున
సం/-
కలిదిండి ఆదిత్య విస్సం
మేనేజింగ్ డైరెక్టర్
DIN. 06791393


## వీరనారి చాకలి ఐలమ్మ

# విగ్రహానికి భూమి పూజ



**చింతపల్లి, ఆగస్టు 13 (నినాదం) :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరనారి, ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనకు గురువా రం భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిం చారు. మండలంలోని గడియ గౌరారం గ్రామంలో శివమచి రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు, రజక సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళులు అర్పించారు. అన్యాయానికి ఎదురు నిలిచి, అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన చాకలి ఐలమ్మ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. తనకు ఎదురైన కష్టాలను లెక్కచేయకుండా న్యాయం కోసం పోరాడిన ఆమె త్యాగం చిరస్మరణీయ మని అన్నారు. అలాంటి వీరనారి విగ్రహ ఏర్పాటు కోసం భూమి పూజ చేయడం తమకు ఎతో గర్వంగా ఉందన్నారు. ఆమె జయంతి సందర్భంగా సెప్టెంబర్ 26న విగ్రహ ఆవిష్కరణ చేయనున్నట్లు రజక సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉజ్జిని హేమలత నరేందర్ రావు, ఉప సర్పంచ్ అదిరాల కృష్ణయ్య, శివమచ్చి రజక సంఘం అధ్యక్షుడు పగిళ్ల సాగర్, జనరల్ సెక్రటరీ భూతరాజు యాదయ్య, సహాయ కార్యదర్శి లింగం పాల్గొన్నారు. అలాగే గణేష్, లాలయ్య, గోవర్ధన్, గిరి, సతీష్, రామకృష్ణ, గుణమోని కొండల్, జక్కుల వెంకటయ్య, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొని ఐలమ్మకు ఘన నివాళులు అర్పించారు.

## కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుకై

# గౌడ కల్లుగీతన్నలు పోరాటాలకు సిద్ధం కావాలి

**ఆగస్టు 2 నుండి 18 వరకు గీతన్నల చైతన్య యాత్ర**

**కల్లుగీత కార్మిక సంఘం**
**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు**





**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 13 (నినాదం ):** కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 2 నుండి 18 వరకు అమరుల యాధిలో గీతన్నల చైతన్య బస్సు యాత్ర రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని లికల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం సంగారెడ్డి పట్టణంలో అమరుల యాదిలో గీతన్నల చైతన్య బస్సు యాత్ర కు ఘన స్వాగతం పలకడం జరిగింది పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం నాలుగో తరగతి ఉద్యోగుల భవనంలో ఆశన్న గౌడ్అధ్యక్షతన సభనిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు యం.వి.రమణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గౌడ సంక్షేమానికి కల్లుగీత కార్మికుల ఉపాధికి బడ్జెట్లో 5000 కోట్లు కేటాయించాలని, గత ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారంగీత కార్మికులకు పెన్షన్ 4 వేలకు పెంచుతామని, ఎక్స్‌గ్రేషియా 10 లక్షలు ఇస్తామని అవి కూడా నెల రోజుల లోపే ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో చెప్పారు. కానీ ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదని. అన్నారు. వృత్తిలో ప్రమాదాలు జరిగిన వారికి ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా 20 కోట్ల రూపాయలు అధికారంలోకి వచ్చి 30 నెలలు దాటినప్పటికీ ఇవ్వలేదని అన్నారు. 50 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్ ఇవ్వాలని జీవో ఉన్నప్పటికీ కొత్తగా ఎవరి దరఖాస్తులు స్వీకరించడం లేదని అన్నారు. మేము కొత్తగా కోరికలు ఏమి కోరడం లేదని మీరిచ్చిన వాగ్దానాలే అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వృత్తిలో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచం ఇస్తుందన్నారు. రాష్ట్రంలో సభ్యత్వం కలిగిన వాళ్లు 2 లక్షల 30 వేల మంది ఉండగా కేవలం 30 వేల మందికే ఇచ్చారని అన్నారు. వృత్తి చేసే వారందరికీ వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. తాటి ఈత చెట్ల పెంపకానికి ప్రతి సొసైటీకి ఐదు ఎకరాలు చొప్పున భూమి ఇవ్వాలని, నీరా తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలను ప్రోత్సహించాలని అన్నారు. నందనములోని నీరా ప్రాజెక్టు ను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్లో నీరాకు కేటాయించిన 25 కోట్లు, సంక్షేమానికి కేటాయించిన 67 కోట్లు వెంటనే విడుదల చేసి ఖర్చు చేయాలన్నారు. గీత కార్మికుల సమస్యలు పరిష్కారంకై ప్రభుత్వం పై ఒత్తిడి పెంచేందుకే ఈ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఆగస్టు 18 వరకు సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ప్రతిష్టించాలని వారు డిమాండ్ చేశారు. ఈ యాత్ర బృందం కు గౌడ సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ రాష్ట్ర చైర్మన్ బాలగోని బాలరాజు గౌడ్. డాక్టర్ విజయకుమార్ గౌడ్. బీసీ సంఘం నాయకులు దుర్గా గౌడ్. గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజుగౌడ్. మధు గౌడ్. మాజీ జెడ్పిటిసి మనోహర్ గౌడ్. మల్ల గౌడ్. కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి జిల్లా యువ నాయకులు వినయ్ గౌడ్. తదితరులు కలిసి సంఘీభావం మద్దతు పలికారు. ఈకార్యక్రమంలో యాత్ర బృందం సభ్యులు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్ రమేష్ గౌడ్ , బూడిద గోపి, సంఘం సీనియర్ నాయకులు భీమగోని చంద్రయ్య, కుర్ర ఉప్పలయ్య, కార్యక్రమంలో కల్లు గీత కార్మిక సంఘం జిల్లా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్. సంగారెడ్డి మండలాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ఉపాధ్యక్షులు కృష్ణ గౌడ్ జిల్లా నాయకులు వెంకటేశం గౌడ్ యాదగౌడ్ రామా గౌడ్. రవి గౌడ్ ప్రవీణ్ గౌడ్ ప్రభు గౌడ్ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ రవి గౌడ్. మెదక్ ప్రధాన కార్యదర్శి లచ్చ గౌడతదితరులు పాల్గొన్నారు. బస్సు యాత్ర కార్యక్రమానికి,జూవీ పార్టీ జిల్లా కార్యదర్శి జయరాజుగారు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింలు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అశోక్. హాజరయ్యి మద్దతు ప్రకటించారు.


# కెర్నెక్స్ మైక్రోసిస్టమ్స్ (ఇండియా) లిమిటెడ్

**KERNEX** Delivering Railway Safety

నమోదిత కార్యాలయం : ప్లాట్ నెం.38-41, హార్డ్‌వేర్ పార్క్, టిఎస్ఐఐసి లేఅవుట్, సర్వే నెం.1/1, కంచ ఇమారత్, రావిర్యాల (గ్రామం), మహేశ్వరం మండలం, రంగారెడ్డి (జిల్లా), హైదరాబాద్-501510. CIN : L30007TG1991PLC013211

**30 జూన్,2026 నాటి త్రైమాసిక ముగింపు కొరకు ఆడిట్ కాని ఆర్థిక ఫలితాలు (స్వతంత్ర & ఏకీకృత) నమూనా**

(రూ.లక్షలలో)

| వివరములు | స్వతంత్ర | | | | ఏకీకృత | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | త్రైమాసికపు ముగింపు | | | సం॥ ముగింపు | త్రైమాసికపు ముగింపు | | | సం॥ ముగింపు |
| | 30.06.2026 | 31.03.2026 | 30.06.2025 | 31.03.2026 | 30.06.2026 | 31.03.2026 | 30.06.2025 | 31.03.2026 |
| | ఆడిట్ కానివి | ఆడిట్ అయినవి | ఆడిట్ కానివి | ఆడిట్ అయినవి | ఆడిట్ కానివి | ఆడిట్ అయినవి | ఆడిట్ కానివి | ఆడిట్ అయినవి |
| ఆపరేషన్స్ నుండి మొత్తం ఆదాయం | 50,251.15 | 25,494.62 | 5,401.67 | 42,857.52 | 50,406.74 | 25,549.74 | 5,629.13 | 43,246.78 |
| ప్రస్తుత కాలమునకు నికర లాభం/ (నష్టం) (పన్ను, మినహాయించిన మరియు/ లేదా అసాధారణ ఐటమ్‌లకు ముందు) | 14,786.29 | 8,843.01 | 950.50 | 10,942.47 | 14,813.71 | 9,211.88 | 955.18 | 11,704.26 |
| ప్రస్తుత కాలమునకు నికర లాభం/ (నష్టం) పన్నుకు పూర్వము (మినహాయింపు మరియు / లేదా అసాధారణ ఐటమ్స్ తరువాత) | 14,786.29 | 8,843.01 | 950.50 | 8,062.42 | 14,813.71 | 9,211.88 | 955.18 | 11,704.26 |
| ప్రస్తుత కాలమునకు నికర లాభం/ (నష్టం) పన్నుల తరువాత (మినహాయింపు మరియు/ లేదా అసాధారణ ఐటమ్స్ తరువాత) | 10,957.16 | 6,456.23 | 736.53 | 8,062.42 | 10,984.57 | 6,825.09 | 774.21 | 8,824.30 |
| ప్రస్తుత కాలమునకు మొత్తం సమగ్ర ఆదాయము (లాభం/ (నష్టం) కలిగి యున్నది) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత). | 10,957.16 | 6,394.53 | 736.53 | 8,008.20 | 10,984.32 | 6,762.59 | 741.21 | 8,758.24 |
| ఈక్విటీ షేర్ క్యాపిటల్ (ముఖ విలువ ప్రతిదానికి రూ.10/-ల చొప్పున) | 1,680.36 | 1,680.24 | 1,675.94 | 1,680.24 | 1,680.36 | 1,680.24 | 1,675.94 | 1,680.24 |
| రిజర్వులు (రిజర్వు రీవాల్యుయేషన్ మినహాయించి క్రితం సంవత్సరం ఆడిటైన బ్యాలెన్స్ షీట్స్‌లో చూపిన విధంగా. | | | | 23,950.29 | | | | 23,131.24 |
| ఒక్కొక్క షేర్‌కు ఆదాయములు (అసాధారణ ఐటములకు ముందు) (ఒక్కోటి రూ.10/-ల చొప్పున) | | | | | | | | |
| ఎ) బేసిక్ | 65.21 | 38.49 | 4.39 | 48.07 | 65.37 | 40.69 | 4.45 | 52.71 |
| బి) డైల్యూటెడ్ | 65.21 | 38.49 | 4.38 | 48.07 | 65.37 | 40.69 | 4.44 | 52.67 |

**గమనికలు:**
1) పైన తెలిపిన ఫలితములు ఆడిట్ కమిటీచే సమీక్షించబడి మరియు **ఆగస్టు 13, 2026**న జరిగిన వారి సమావేశంలో కంపెనీ డైరెక్టర్ల బోర్డుచే ఆమోదించబడినవి.
2) పైన తెలిపిన వివరమైన ఆర్థిక ఫలితాల నమూనా SEBI (లిస్టింగ్ అండ్ అదర్ డిస్క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్ 2015లోని రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల వద్ద దాఖలు చేయబడినవి. త్రైమాసికపు/ వార్షిక ఆర్థిక ఫలితాల పూర్తి నమూనా కంపెనీ వెబ్‌సైట్ అనగా BSE లిమిటెడ్ www.bseindia.com మరియు NSE లిమిటెడ్ www.nseindia.com మరియు కంపెనీ వెబ్‌సైట్ www.kernex.in లో లభించును.

బోర్డు ఉత్తర్వు ద్వారా
కెర్నెక్స్ మైక్రోసిస్టమ్స్ (ఇండియా) లిమిటెడ్

ప్రదేశం: హైదరాబాద్
తేది: 13.08.2026

సం/-
ప్రసాద రావు కల్లూరి
కంపెనీ సెక్రటరీ


# పాలకవీడుకు బస్సు 'దారి' మరిచిందా?


**దశాబ్దంగా ఎదురుచూపులే.. బస్సు జాడేది?**

**రోడ్లు వచ్చాయి..**
**రవాణా రాలేదు! మండల ప్రజల వెతలు**

**ప్రైవేట్ వాహనాల**
**దోపిడీ!ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు..**

**మంత్రి ఉత్తమ్ చొరవతో రహదారులు**
**అభివృద్ధి.. ఆర్టీసీ సర్వీసులపై మాత్రం నిర్లక్ష్యం!**

**కలెక్టర్ సార్... స్పందించి బస్**
**సౌకర్యం కల్పించాలని వినతి**






**పాలకవీడు,ఆగస్టు 13(నినాదం):** రోడ్లు కనిపిస్తున్నాయి.. కానీ ఆ రోడ్లపై ఆర్టీసీ బస్సు మాత్రం కనిపించడం లేదు! పాలక వీడు మండల ప్రజలకు బస్సు సౌకర్యం కల్పించాలన్న విషయం ఆర్టీసీ అధికారుల దృష్టిలోకి రాలేదా.. లేక బస్సులు ఈ మండ లం దారి మరిచాయా అన్నట్లుగా పరిస్థితి తయారైంది. దశాబ్ద కాలంగా పలు గ్రామాల ప్రజలు బస్సు కోసం ఎదురుచూ స్తున్నా సమస్యకు పరిష్కారం లభించడం లేదు. దీంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, కూలీలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. బొత్తలపాలెం, అలింగాపురం, గుండ్లపహాడ్, రాఘవపురం, మీగడం పహాడ్‌తండా, నర్లింగులగూడెం, గుండెబోయినగూడెం, దేవులతండా, మహంకాళిగూడెం, మీగడంతండా, సజ్జాపురం, బెట్టతండా, మూసిఒడ్డుసింగారం, ఎల్లాపురం తదితర గ్రామాల ప్రజలు పదేళ్లుగా బస్సు సౌకర్యం కోసం ఎదురు చూస్తున్నారు. కనీస ప్రజా రవాణా లేకపోవడంతో అత్యవసర పనులకైనా ప్రైవేటు వాహనాలనే ఆశ్రయించాల్సి వస్తోంది.

**ప్రైవేటు వాహనాలే దిక్కు**
ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రైవేటు వాహనదారులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. అధిక చార్జీలు వసూలు చేయడంతో పాటు ఫిట్‌నెస్ లేని వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తున్నారని ఆరోపిస్తున్నారు. వేగంగా వాహనాలు నడపడంతో ప్రమాదాల ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు....



**విద్యార్థుల చదువుకూ బ్రేక్**
గుండెబోయినగూడెం, గుండ్లపహాడ్, నర్లెంగులగూడెం, రాఘవపురం, మీగడం పహాడ్‌తండా, దేవులతండా, అలంగాపురం, బొత్తలపాలెం, రావిపహాడ్, శూన్యం పహాడ్, మహంకాళిగూడెం, సజ్జాపురం, బెట్టతండా, ఎల్లాపురం, మూసిఒడ్డుసింగారం తదితర గ్రామాల నుంచి విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు. సమయానికి బస్సులు లేక ప్రైవేటు వాహనాలకు రోజూ అధిక చార్జీలు చెల్లించలేక కొందరు చదువులను మధ్యలోనే ఆపి కూలీ పనులకు వెళ్తున్నారని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మహిళా ఉద్యోగులకూ తప్పని తిప్పలు..**
మండలంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు సైతం సమయానికి కార్యాలయాలకు చేరుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు వాహనాల్లో అధిక చార్జీలు చెల్లించడంతో పాటు భద్రతపై ఆందోళన చెందుతున్నారు. ఫిట్‌నెస్ లేని వాహనాల్లో ప్రయాణించాల్సి రావడంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్తున్నామని వాపోతున్నారు.

**భక్తులకూ అవస్థలే**
నేరేడుచర్ల–పాలకవీడు మార్గంలోని షిర్డీ సాయిబాబా ఆలయం, జాన్‌పహాడ్ దర్గా, గుండ్లపహాడ్ దర్గా, కృష్ణానది ప్రాంతాలకు నిత్యం భక్తులు వెళ్తుంటారు. ఈ మార్గంలో సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో వారికీ ఇబ్బందులు తప్పడం లేదు.

**ఉర్సు వేళ బస్సుల జాతర.. మిగతా రోజుల్లో కరువు!**
జాన్‌పహాడ్ దర్గా ఉర్సు సమయంలో మాత్రం వివిధ డిపోల నుంచి వందలాది ట్రిప్పులు నడిపే ఆర్టీసీ.. మిగతా రోజుల్లో ఈ ప్రాంత ప్రజలను ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఉర్సుకు భక్తులు వస్తే బస్సులకు దారి తెలుస్తోంది.. అదే దారిలో నిత్యం ప్రయాణించే ప్రజలకు మాత్రం బస్సు ఎందుకు కనిపించదని నిలదీస్తున్నారు.

**రోడ్లు వచ్చాయి.. బస్సులు మాత్రం రాలేదు**
మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో నేరేడుచర్ల నుంచి జాన్‌పహాడ్ దర్గా, శూన్యం పహాడ్ మీదుగా దామరచర్ల వరకు, నేరేడుచర్ల నుంచి రాఘవపురం మీదుగా మఠంపల్లి వరకు, గరిడేపల్లి నుంచి గుండ్లపహాడ్ మీదుగా మఠంపల్లి, దామరచర్ల మండలాల వరకు డబుల్ రోడ్లు అందుబాటులోకి వచ్చాయి. రహదారులు మెరుగుపడినా వాటిపై ప్రజా రవాణా మాత్రం అందుబాటులోకి రాకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.

**కలెక్టర్ సార్ స్పందించి.. కొత్త సర్వీసులు ప్రారంభించాలి..**
ప్రస్తుతం డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ వరకు మిర్యాలగూడ డిపో నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో ఒక బస్సు మాత్రమే నడుస్తోంది. కోదాడ డిపో నుంచి రాత్రి నైట్ ఆల్ట్ డీలక్స్ సర్వీసు హైదరాబాద్ వరకు నడుస్తోంది. ఈ సర్వీసులు మండలంలోని అన్ని గ్రామాల అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదని ప్రజలు చెబుతున్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని ఆర్టీసీ అధికారులతో మాట్లాడి నేరేడుచర్ల నుంచి గుండెబోయినగూడెం, మీగడం పహాడ్‌తండా, మహంకాళిగూడెం తదితర మార్గాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో షటిల్ ఆర్టీసీ సర్వీసులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దశాబ్దంగా ఎదురుచూస్తున్న పాలకవీడు ప్రజల బస్సు కష్టాలకు ఇకనైనా తెరదించి, రోడ్లపై బస్సులను పరుగులు పెట్టించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పటాన్‌చెరు జర్నలిస్టుల ఐక్యతకు రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు

**త్వరలో పటాన్‌చెరులో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహిద్దాం: కే. విరహత్ అలీ**

**విరాహత్ ఆలిని మర్యాదపూర్వకంగా కలిసిన పటాన్చెరు నూతన కార్యవర్గం**







**పటాన్చెరు, ఆగస్టు 13(నినాదం) :** టీయూడబ్ల్యూజే–ఐజేయూ పటాన్‌చెరు నియోజకవర్గ నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కే. విరహత్ అలీని గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని యూనియన్ కార్యాల యంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి అధ్యక్షతన, పటాన్‌చెరు నియోజకవర్గ అధ్యక్షుడు పత్తి నరసింహ ఆధ్వర్యంలో ఈ కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కే. విరహత్ అలీ మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గంలో ఇటీవల నిర్వహించిన జర్నలిస్టుల సమా వేశం కనీవినీ ఎరుగని రీతిలో విజయవం తమై రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించిందని ప్రశంసించారు. సంఘం పట్ల జర్నలిస్టుల్లో విశ్వాసాన్ని పెంపొందిం చేలా కార్యవర్గం పనిచేసిందని కొనియా డారు. టీయూడబ్ల్యూజే–ఐజేయూ సంఘానికి 75 ఏళ్ల ఘన చరిత్ర ఉందని పేర్కొన్న ఆయన, క్రమశిక్షణకు మారు పేరైన ఈ సంఘంలో ప్రతి జర్నలిస్టు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పదవి అనేది అధికారం కాదని, అది ఒక బాధ్యత మాత్రమేనని అన్నారు. అహంకారానికి దూరంగా ఉండి సేవాభావంతో పనిచేసినప్పుడే పదవికి గౌరవం లభిస్తుందని తెలిపారు. త్వరలో రాష్ట్రస్థాయి సమావేశాన్ని పటాన్‌చెరులో భారీ స్థాయిలో నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, అందుకు స్థానిక కార్యవర్గం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పటాన్‌చెరుకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఆ ప్రాంతం ప్రత్యేక అనుభూతి కలిగి ఉందని, ఆ ప్రాముఖ్య తను మరింత పెంచేలా నూతన కార్యవ ర్గం పనిచేయాలని సూచించారు. సంఘా న్ని బలోపేతం చేయడంతో పాటు జర్నలి స్టుల హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేయాలని అన్నారు. యూనియన్ కోసం నిస్వార్థంగా కష్టపడే ప్రతి కార్యకర్తను నాయకత్వం గుర్తిస్తుందని, వారి సేవలను ఎల్లప్పుడూ గౌరవిస్తుందని విరహత్ అలీ పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రుమాండ్ల అనిల్, రాష్ట్ర కమిటీ నాయకులు అబ్దుల్ బాసిత్, జిల్లా ఉపాధ్యక్షుడు పర్చ శ్రీనాథ్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి బసవేశ్వర్, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ భూపాల్ రెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి యాదగిరి, ఉపాధ్యక్షులు శివకుమార్, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, కమిటీ సభ్యులు శేఖర్, పురుషోత్తం, శ్రీనివాస్, సిద్ధు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో చెట్టు కొమ్మ పడి విద్యార్థి మృతి పలువురికి గాయాలు

**చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**







**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 13 (నినాదం) :** భువనగిరి పట్టణ కేంద్రంలోని బగాయత్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం మధ్యాహ్నం విద్యార్థులు ఆటలు ఆడుతున్న సమయంలో వేప చెట్టు కొమ్మ విరిగిపడి పలువురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. ఒక్కసారిగా చెట్టు కొమ్మ విరిగిపడటంతో విద్యార్థులు భయకంపితులై పరుగులు పెట్టారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, గాయపడిన విద్యార్థులను హుటాహుటిన భువనగిరి జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం, వైద్యుల సలహా మేరకు నలుగురు విద్యార్థు లను బీబీనగర్ ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. భువనగిరి హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన దావుద్ అలీ, అమీనా లో కూతురు "అలీమ" మృతి చెందింది. హర్షిత్, మరో విద్యార్థికి కాళ్ళు విరిగాయని ఎయిమ్స్ వైద్యులు తెలి పారు. మృతి చెందిన కుటుంబానికి 50 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాలని సామాజిక కార్యకర్త కోడారు వెంకటేష్ ప్రభుత్వం డిమాండ్ చేశారు.

**విషాద సంఘటన జరగడానికి కారణాలు**
భువనగిరి బగాయత్ పాఠశాల ఆవరణ తాగుబోతు లకు అడ్డాగా మారింది. ఒక ప్రాథమిక పాఠశాల, హైస్కూల్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఓకే ఆవరణలో ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, పోలీసుల పెట్రోలింగ్ సక్రమంగా జరగకపోవడంతో తాగుబోతులు వికృత చేష్టలకు అడ్డాగా మారిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత వారం క్రితం తాగుబోతులు ఒక వేపచెట్టును తగులబెట్టినట్లు సమాచారం. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పినట్లు స్థానికులు చెబుతున్నారు. వేప చెట్టు కాలిపోవడం తో తొర్ర ఏర్పడి, చెట్టు పటుత్వం తప్పి కూలిపోయినట్టు తెలుస్తోంది. అలీమ కుటుంబానికి , ప్రభుత్వం 50 లక్షల రూపాయల పరిహారం అందించి ఆదుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా నాయకులు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

**బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం : ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**
ప్రభుత్వ పాఠశాలలో పంద్రాగస్టు సందర్భంగా క్రీడలు ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులపై చెట్టు కొమ్మ విరిగి మృతి చెందిన విద్యార్థిని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మృతి చెందిన విద్యార్థి కుటుంబాన్ని పరామర్శించారు. వారిని ఆదుకుంటామని ధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంఘటన జరగడం దురదృష్టం కరమని విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.




**తక్షణమే ఆర్థిక సాయం**
విద్యార్థిని మృతి కుటుంబానికి తక్షణమే ఆర్థిక సాయం కింద ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పదివేల రూపాయలు, మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ పదివేలు, డీఈవో 50,000 ప్రభుత్వం నుండి 50,000, ఆర్థిక సాయం అందజేశారు.

# పార్లమెంట్‌ను అపవిత్రం చేశారు!

తిలా పాపం తలా పిడికెడు అన్నట్లుగా.. పార్లమెంటు సమావేశాలు మట్టి కరవడానికి అందరూ బాధ్యులే. 19 రోజుల పాటు ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరించి ఎన్నుకున్న ప్రజలను అవమానానికి గురి చేశారు. ప్రజలు ఎంతో నమ్మకంతో వీరిని ఎన్నుకుని పంపితే చట్టసభలను చట్టుబండలు చేస్తున్నారు. సమస్యలను చర్చించకుండా..వ్యక్తిగత ఎజెండాలతో భ్రష్టు పట్టించారు. ఇలాంటి నేతలు ప్రజల సమస్యలు పరిష్కరిస్తా రని, వారి ఆశలను పరిశీలిస్తారని అనుకోవడం బుద్ధితక్కువ తప్ప మరోటి కాదు. చట్టసభల్లో సమస్యలు చర్చించాలి. సమస్యలకు సమాధానాలు రాబట్టాలి. చట్టాలను చేయాలి. కానీ ఇవేవీ జరగకుండా విపక్షాలు అడ్డుకుంటే..అధికార పక్షం చోద్యం చూసింది. దొందూ దొందే అన్నచందంగా సమావేశాలు సాగకుండా 19 రోజుల పాటు నానా రభస సృష్టించారు. చివరి రోజు గురువారం కూడా సభలు సజావుగా సాగక పోవడంతో ఉభయ సభలను నిరవధికంగా వాయిదా వేశారు. మొత్తంగా ఈ 19 రోజులు ప్రతిపక్ష సభ్యుల ఆందోళనల మధ్య ఎటువంటి కార్యకలాపాలు జరగకుండానే వాయిదాపడ్డాయి. దీంతో పార్లమెంటు సమావేశాలు మొదలైన జులై 20 నుంచి ఇప్పటిదాకా 19 రోజులు సభా కార్యకలాపాలు తుడిచిపెట్టుకుపోయాయి. అధికార, ప్రతిపక్షాలు పట్టు వీడకపోవడంతో ఆఖరి రోజూ సజావుగా సాగలేదు. విద్యార్థుల ఆందోళనపై చర్చకు సిద్ధమని బుధవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సవాల్ విసిరారు. చర్చకు ప్రతిపక్షం అంగీకరిస్తే పార్లమెంటు సమావేశా లను పొడిగించడానికీ సిద్ధమని కేంద్రం తెలిపింది. అయితే ఆయన లెక్చర్ వినడానికి సిద్ధంగా లేమని ప్రతిపక్షం ఆ సవాల్‌ను తోసిపుచ్చింది. బుధవారం ఉదయం 11గంటలకు లోక్‌సభ సమావేశం కాగానే ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి వచ్చి నినాదాలు చేశారు. చర్చను ప్రారంభిద్దామని మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపాదించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో సభ నిరవధికంగా వాయిదా పడింది. ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉంటే ప్రతిపక్షం పారిపోవడం తొలిసారిగా చూస్తున్నా' అని పార్లమెంటరీ వ్యవహారా మంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యానించారు. నిజయోకవర్గ సమస్యలను ఎలాగూ ప ట్టించుకోవడం లేదు. అలాగే దేశ సమస్యలపైనా బాధ్యత లేదు. ప్రతిపక్షం బలంగా గళం వినిపిస్తేనే ప్రభుత్వాలు తలవంచుతాయి. ఆందోళన చేయడం కూడా ఓ రకమైన నిరసన అని చెప్పుకుని తప్పించుకోవడం మినహా విపక్షం చేసిందేమీ లేదు. పార్లమెంట్ లోపాలా, బయటా ధర్నాలు చేయడం మినహా సాధించిందేమీ లేదు. దీనికోసం ప్రజలు ఎంపిలను ఎన్నుకోలేదు. విద్యార్థుల ఆందోళనలపై ప్రభుత్వం చర్చకు సిద్ధమని చెప్పడం.. అమిత్ షా ప్రతిష్ఠ అనే గాలి బుడగ పేలిపోయాక దానిలో గాలిని నింపడానికి చేసిన చివరి ప్రయత్నంగా రాహుల్ అభివర్ణించారు. అసలు తమపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరపడానికి ఎవరు ఆదేశించారో తెలుసుకోవాలని యువత కోరుకుంటున్నారని రాహుల్ పట్టుపడుతూ వచ్చారు. అమిత్ షా ఉపన్యాసం వినడానికి సిద్ధంగా లేమని తేల్చి చెప్పారు. విద్యార్థుల ఆందోళనలు, వాటికి సంబంధించిన అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నానని అమిత్ షా తెలిపారు. ప్రతిపక్షాలు చర్చను కోరుతూ లోక్‌సభ స్పీకరుకు లేఖ ఇవ్వాలని, వారు అడిగే అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇస్తానని ఆయన స్పష్టం చేశారు. మొత్తం చర్చలో తాను పాల్గొంటానని తేల్చి చెప్పారు. చర్చ నుంచి తాను పారిపోతున్నా నన్న ప్రతిపక్షాల ఆరోపణలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన స్పీకర్‌కు లేఖ రాశారు. ప్రతిపక్షాలతో సంప్రదించి విద్యార్థుల ఆందోళనలపై చర్చ చేపట్టాలని కోరారు. కానీ విపక్షం చర్చకు సిద్ధంగా లేదని తేలిపోయింది. కేవలం బలప్రదర్శన వేదికగా వర్షాకాల సమావేశాలు నిలిచాయి. విపక్షాలు బలంగా ఉన్నాయని చాటి చెప్పడానికి ప్రయత్నించారు. ప్రధానంగా విదేశీ విరాళాల సవరణ బిల్లును అడ్డుకోవడం కోసం చేసిన ప్రయత్నం ఫలించింది. ప్రజలు ఇప్పుడు ఆలోచించాల్సిన సమయం వచ్చింది. ఉభయ సభలు ఈ వర్షాకాల సమావేశాల్లో సజావుగా జరగకూడదన్న విపక్షం ఎజెండా విజయం సాధించింది. పార్లమెంటులో విపక్షాల నినాదాలు, పోడియంలోకి దూసుకుని రావడం, స్పీకర్ ఓంబిర్లా వారించడం నిత్యకృత్యంగా మారాయి. దీంతో సమావేశాలను విపక్ష పార్టీలు కావాలనే స్తంభింప చేసాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే అధికార పార్టీ సభ్యులు కూడా ఈ సమావేశాల్లో మకరద్వారం వద్ద ప్రతిపక్షాలను నిలదీస్తూ 'రాహుల్ గాంధీ జవాబ్ దో..' అని నినాదాలు చేశారు. అయితే ఇవేవీ ప్రజలకు ఉపయోగపడే వ్యవహారాలు కావు. అటు అధికార పార్టీ, ఇటు విపక్ష పార్టీలు రెండూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయనడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదు. నినాదాలు చేస్తున్న పాలక, ప్రతిపక్ష సభ్యుల తీరును ప్రజలు గమనించారు. ఎవరేంటో తెలుసుకుంటున్నారు. వీరితీరుపైనా జెన్‌జీలు దృష్టి సారించాలి. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న నాయకులను కనిపెట్టాలి. లేకుంటే పార్లమెంట్ సమావేశాలకు అర్థం లేకుండా పోతుంది. ఇలా 19 రోజులు సభలను వృధా చేసినందుకు నేతల జీతభత్యాలను కట్ చేయాలి. వారికి తగిన ఫైన్ వేయాలి. అప్పుడే నేతల్లో జవాబుదారీతనం వస్తుంది.

సంపాదకీయం

## అశాస్త్రీయ అఖండ భారత విభజన మిగిల్చిన

# మారణహోమం, హింసోన్మాదం

**(14 ఆగష్టు "విభజన భయానక ఘటనల జ్ఞాపకార్థ దినం" సందర్భంగా)**

1947లో అశాస్త్రీయ అఖండ భారతదేశ విభజన మిగిల్చిన తీవ్రమైన గాయాలను ప్రస్తుత, భవిష్యత్తు తరాలకు గుర్తు చేసే ప్రయత్నంలో భాగంగా, ప్రతి ఏటా 14 ఆగష్టు రోజు "విభజన భయాందోళనల జ్ఞాపకార్థ దినం (పార్టీషన్ టెర్రర్స్ రిమెంబ్రెన్స్ డే)" పాటించడం 2021 నుంచి ఆనవాయితీగా మారింది. 1947లో దేశ విభజన సమయంలో మిలియన్ల ప్రాణాలు పోవడంతో పాటు అసంఖ్యాక సామాన్య జనులు గాయపడ్డారు. ఈ భయానక దేశ విభజనలు ప్రాణాలు కోల్పోయిన అమాయక ప్రజలకు హృదయపూర్వకంగా నివాళులు అర్పించడం లక్ష్యంగా ఈ రోజును పాటిస్తున్నాం. విభజన సమయంలో బాధపడిన ప్రజల త్యాగాలను స్మరించుకోవడం, వారి బాధలను అర్థం చేసుకొని గుర్తు చేసుకోవడం, వారి జ్ఞాపకాలను సజీవంగా ఉంచడం లాంటి అంశాలు ఈ వేదికగా చర్చకు వస్తాయి. భారత స్వాతంత్ర్యానికి ఒక రోజు ముందు, అనగా 14 ఆగష్టు 1947 రోజున "విభజన భయానక ఘటనల జ్ఞాపకార్థ దినం" జరుపుకుంటున్నాం. విభజన జరిగిన సమయంలో ప్రజల భయాందోళనలు, తీవ్రమైన బాధలు, కోల్పోయిన ప్రాణాలు, అనుభవించిన చిత్ర హింసలు, మానభంగాలు, అపహరణాలు, హత్యలు, రోడ్డున పడ్డ కుటుంబాలు, బలవంతపు వలసలతో స్థానభ్రంశాలు, విషాద ఘటనలు, ఛిన్నాభిన్నం అయిన కుటుంబాల అంతులేని క్షోభలు లాంటి అమానవీయ ఘటనలతో మిలియన్ల కొద్ది జనులు తమ సర్వస్వం కోల్పోయారు.

భారత దేశ చరిత్రలో చీకటి అధ్యాయం :
దేశ విభజన చరిత్రలో అత్యంత విషాదకరమైనా ఘటనగా హృదయాలను కలిచి వేస్తున్నది. దేశ విభజన జరిగిన సమయంలో బాధపడిన వారి స్మృతులను గౌరవించడం, చారిత్రక గాయాలను గుర్తు చేసుకోవడం, మానవ నష్టాల పట్ల అవగాహన కల్పించడం, శాంతి స్థాపనకు నడుం బిగించడం, ఐక్యతను బలోపేతం చేయడం లాంటి లక్ష్యాలతో ఈ రోజు కార్యక్రమాలు నిర్వహిస్తారు. లక్షలాది మంది మతపరమైన అల్లరులలో ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 20 మిలియన్ల ప్రజలు సర్వస్వం కోల్పోయారు. మహిళలపై అఘాయిత్యాలు, దారుణమైన హింస చెలరేగాయి. ఏ సంబంధం లేని అమాయక నిరపరాధులు ఘోరానికి బలి అయ్యారు. సరిహద్దులకు ఇరువైపులా దాదాపు కోటిన్నరతో పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారు. పుట్టి పెరిగిన ఊళ్లు, ఇండ్లు, భూములు వదిలి హుటావుటిన బయటకు వచ్చి శరణార్థులుగా మారి కట్టుబట్టలతో కొత్త ప్రాంతాలను ఖాళీ చేతులతో బలవంతంగా తరలి వచ్చారు. అన్నదమ్ములు, తల్లితండ్రులు విడిపోయారు. శరణార్థి శిబిరాల్లో దయనీయ దుస్థితిలో గడిపారు.

అఖండ భారత అశాస్త్రీయ విభజన:
దేశ అశాస్త్రీయ విభజన ఒక ఘోరమైనా చారిత్రక తప్పిదం అది మిగిల్చిన గాయాలు నేటికీ మనల్ని వేయిస్తూనే ఉన్నాయి. శతాబ్దాల పాటు విదేశీ పాలనలో సర్వం కోల్పోయిన భరతజాతి మేల్కొని పోరాడి స్వాతంత్ర్యం సాధించుకుంది. స్వాతంత్ర్యోద్యమం శాంతియుతంగా, అహింసాయుత పద్దతిలో జరిగింది. కాని స్వాతంత్ర్యం వచ్చిన సంతోష సమయంలో జరిగిన ఘోరమైన విభజన రక్తపాతాన్ని మిగిల్చింది. స్వాతంత్ర్యం రావడం, దేశ విభజన జరగడం ఏక కాలంలో జరిగాయి. దుర్బుద్ధితో అఖండ భారతాన్ని అశాస్త్రీయంగా భారత్, పాకిస్థాన్‌లా విడగొట్టారు. విభజన మిగిల్చిన ఘోరాలు ఓ మహావిషాదం. మతపరమైన విభజన కోరిన ముస్లింలు పాకిస్థాన్ స్వాతంత్ర్య దినోత్సవాన్ని 14 ఆగష్టున జరుపుకుంటున్నారు. శవాల గుట్టల పునాదిగా జరిగిన విభజన దేశ చరిత్రలో ఓ చీకటి రోజు. భారత్‌కు స్వాతంత్ర్యం ఇవ్వాల్సి వచ్చిన సమయంలో బ్రిటీష్ తెల్ల కోతులు భారత్ ఏనాటికైనా తమకు ముప్పు చేయవచ్చని తలచిన కుట్రలో భాగమే ఈ దేశ విభజన అని గమనించాలి. మహ్మద్ జిన్నాను దువ్వి ద్విజాతి సిద్ధాంతాన్ని తెరపైకి తెచ్చి మత ప్రాతిపదికన విభజనలు పురుడు పోశారు. ముస్లింలకు ప్రత్యేక దేశం కావాలని జిన్నా చేసిన ప్రతిపాదనతో దేశవ్యాప్తంగా తీవ్రమైన అల్లర్లు, ఊచకోతలు, మానభంగాలు జరిగాయి. నాటి గాంధీ సూచనలతో నెహ్రూ నాయకత్వ కాంగ్రేస్ తమ పదవుల స్వార్థం కోసం విభజనకు తలలు ఊపారు. విభజన సమయంలో పెద్ద ఎత్తున మతపరమైన అల్లర్లు జరుగుతాయని భావించినా నాటి నెహ్రూ కాంగ్రేస్ పాలకులు అడ్డుకునే ప్రయత్నం చేయకపోవడం అంతు చిక్కని ప్రశ్నగానే మిగిలి ఉండిపోయింది. దేశ భౌగోళిక పరిస్థితులు ఏ మాత్రం తెలియని బ్రిటీష్ లాయర్ 'సిరిల్ రెడ్‌క్లిఫ్' అఖండ భారత పటంపై కళ్లు మూసుకొని గీసిన తెలివి తక్కువ గీతలే దేశ సరిహద్దులు అయ్యాయి. ఆయన నాడు గీసిన సరిహద్దు గీతలను "రెడ్‌క్లిఫ్ లైన్" అని పిలవడం సోచనీయం. ముస్లింలు అధికంగా ఉన్న పంజాబ్ ప్రాంతాన్ని వెస్ట్ పాకిస్థాన్‌గా, ముస్లింసు అధికంగా ఉన్న బెంగాల్ ప్రాంతాన్ని ఈస్ట్ పాకిస్థాన్ (నేటి బంగ్లాదేశ్‌లా విభజించి) వేరు చేశారు. అటు జిన్నా, ఇటు నెహ్రూ ఇరువురు ప్రధానులు అయ్యారు. ఈ అశాస్త్రీయ విభజనలో 20 లక్షల ప్రాణాలు పోయాయి. అదే సమయంలో 20 మిలియన్ల మానవ వలసలు జరిగాయి.

వ్యాపార బుద్ధితో ప్రవేశించి, దేశ సంస్కృతి వారసత్వాలను నాశనం చేసి, దేష అమూల్య సంపదను కొల్లగొట్టి, శవాల దిబ్బలను మిగిల్చి బ్రిటీష్ పాలకులు వెళ్ళిపోయిన దుర్దినంగా ఆగష్టు 14 భారత చరిత్రలో చీకటి రోజుగా మిగిలింది. నాడు జరిగిన మారణహోమం, హింసాత్మక ఘటనలు భారతీయులపై చెరగని శాశ్వత మచ్చలుగా మిగిలిపోయాయి. నెహ్రూకు విభజన అనేది ఒక ఆటగా మారి, జిన్నాను వదిలించుకోవడణ కోసమే దేశ విభజనకు ఒప్పుకున్నారనే విమర్శలు ఎదురుకుంటున్నారు. ఈ విభజన నెహ్రూ, జిన్నాలు కలిసి పంచుకున్న స్వంత ఆస్తులు వలె ఉన్నాయని భావించినా వారు ఉన్నారు. దేశ విభజన సమయంలో జరిగిన రక్తపాతం, హింసోన్మాదం, అరాచక అకృత్యాలకు బలైన భరతమాత బిడ్డలను స్మరించుకోవాలనే సదుద్దేశంతో ప్రతి ఏటా 14 ఆగష్టున "విభజన విషాద/భయానక స్మృతి దినం" పాటించడానికి నిర్ణయం తీసుకోవడం సముచితంగా ఉన్నది. ముక్కలైన దేశాన్ని ఒకటి చేయడంతో భరతమాత కడుపుకోత కొంతైనా తీరుతుందని ఆశిద్దాం.

**జై హింద్ : జై అఖండ భారత్ : జై హిందూస్థాన్**

**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**

## ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ సంస్థ

### ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడి

**న్యూఢిల్లీ,ఆగస్టు13(నినాదం):**
ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ ఉగ్రవాద సంస్థ అల్‌ఖైదా ఇన్ ఇండియన్ సబ్‌కాంటినెంట్ కుట్ర ఉందని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించినట్లు సమాచారం. 2025 నవంబర్‌లో ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటనపై దర్యాప్తు నేపథ్యంలో ఈ అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆల్‌ఖైదా ప్రాంతీయ కార్యకలాపాలను విస్తరిస్తున్న ఉగ్రవాద సంస్థగా నివేదిక పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాలిబన్ల నుంచి మద్దతు, ఆశ్రయం లభిస్తున్నట్లు ఐక్యరాజ్య సమితి నివేదికలో ప్రస్తావించినట్లు సమాచారం. దీంతో పలు ప్రాంతాల్లో అల్‌ఖైదా నెట్‌వర్క్ మరోసారి బలపడుతున్నదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా భారత్ సహా ఆయా దేశాల్లో ఉగ్రవాద కార్యకలాపాలకు అల్‌ఖైదా ముప్పుగా మారే అవకాశం ఉందని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. 2025 నవంబర్‌లో ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన కుట్ర, ఉగ్రవాద నెట్‌వర్క్‌పై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి నివేదికలోని అంశాలు కీలకంగా మారాయి. అల్‌ఖైదా తన కార్యకలాపాలను విస్తరించేందుకు ప్రాంతీయ నెట్‌వర్క్‌లను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తోందని నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాలిబన్ల మద్దతుతో పలు ప్రాంతాల్లో సురక్షిత స్థావరాలు లభిస్తున్నాయనే ఆరోపణలు కూడా ఈ నివేదికతో మరోసారి చర్చకు వచ్చాయి. ఉగ్రవాద సంస్థల కదలికలను నిశితంగా పర్యవేక్షించాల్సిన అవసరాన్ని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఢిల్లీ పేలుళ్ల కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే కొద్దీ ఈ అంతర్జాతీయ ఉగ్రవాద నెట్‌వర్క్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



## ఖైదీ కూలీల చెమటతో

# రూపుదిద్దుకున్న

**నిజాంసాగర్ ప్రాజెక్టు..**

**శతాబ్దం దాటినా**

**చెక్కుచెదరని నిర్మాణం..**

మంజీరా నదిపై నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టు తెలంగాణ చరిత్రలో ఒక అపూర్వమైన ఇంజినీరింగ్ అద్భుతం. నాటి హైదరాబాద్ సంస్థానంలో నిజాం ప్రభుత్వం 1923లో ప్రారంభించిన ఈ భారీ ప్రాజెక్టు 1931లో పూర్తయింది. అప్పట్లో 29.72 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో సుమారు 2.75 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో దీనిని నిర్మించారు. నిజాంసాగర్ నిర్మాణం వెనుక కేవలం ఇంజినీర్ల ప్రతిభ, పాలకుల ప్రణాళిక మాత్రమే కాదు.. వేలాది మంది కూలీల శ్రమ కూడా దాగి ఉంది. ఆ కాలంలో జైళ్లలో ఉన్న ఖైదీలను కూడా కఠిన శ్రమలో భాగంగా నిర్మాణ పనులకు వినియోగించారనే స్థానిక చారిత్రక కథనాలు నేటికీ వినిపిస్తుంటాయి. రాళ్లు కొట్టడం, మట్టి తరలించడం, నిర్మాణ సామగ్రిని మోసుకెళ్లడం వంటి కష్టమైన పనుల్లో వారు పాలుపంచుకున్నారనే కథనాలు పెద్దల నుంచి తరతరాలకు వస్తున్నాయి. రాళ్లలో కనిపించే నాటి శ్రమ

నేటి ఆధునిక యంత్రాలు, భారీ క్రేన్లు, సాంకేతిక పరికరాలు అందుబాటులో లేని కాలంలో ఇంతటి భారీ జలాశయాన్ని నిర్మించడం చిన్న విషయం కాదు. వేలాది మంది కూలీలు రోజుల తరబడి చెమటోడ్చి పని చేయడంతోనే ఈ మహా నిర్మాణం సాకారమైంది. ఆ కష్టానికి నిదర్శనంగానే నిజాంసాగర్ ఆనకట్ట నేటికీ చరిత్రను మోస్తూ నిలిచింది. అప్పటి నిర్మాణ పద్ధతులు, ఉపయోగించిన రాళ్లు, ఆనకట్ట నిర్మాణంలో కనిపించే నైపుణ్యం నేటి తరాన్ని కూడా ఆశ్చర్యానికి గురిచేస్తాయి.

సాగునీటికి జీవనాధారం

నిజాంసాగర్ కేవలం ఓ ఆనకట్ట కాదు.. ఉమ్మడి నిజామాబాద్ ప్రాంతంలోని వేలాది రైతు కుటుంబాల జీవనాధారం. బాన్సువాడ, బోధన్, నిజామాబాద్ తదితర ప్రాంతాల్లో వ్యవసాయానికి ఈ ప్రాజెక్టు కీలకంగా మారింది. కాలం మారింది.. ప్రభుత్వాలు మారాయి.. సాగు పద్ధతులు మారాయి. కానీ మంజీరా నీటిని ఒడిసిపట్టి రైతుల పొలాలకు తరలించే నిజాంసాగర్ ప్రాధాన్యం మాత్రం కొనసాగుతూనే ఉంది.

నిజాంసాగర్ నిర్మాణానికి ప్రత్యేక రైల్వే లైన్!

నిజాంసాగర్ దాదాపు శతాబ్దం క్రితం నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో అప్పట్లో ప్రత్యేకంగా 2 అడుగుల నారో గేజ్ రైల్వే లైన్ ను ఉపయోగించినట్లు చారిత్రక రికార్డులు పేర్కొంటున్నాయి. ఈ నిర్మాణ రైల్వేను ప్రాజెక్టు కాలువల నిర్మాణ పనులకు వినియోగించారు. నిర్మాణ సామగ్రి, ఇతర అవసరాలను తరలించేందుకు ఈ చిన్న రైల్వే కీలకంగా పనిచేసినట్లు సమాచారం. యంత్రాలు అందుబాటులో లేని ఆ కాలంలో.. రైల్వే సహాయంతో సాగిన భారీ నిర్మాణ పనులు నాటి ఇంజినీరింగ్ ప్రతిభకు నిదర్శనం.

ఖైదీ కూలీల చెమటతో నిర్మితమైన నిజాంసాగర్!

నిజాంసాగర్ మంజీరా నదిపై నిజాం పాలనలో నిర్మితమైన నిజాంసాగర్ ప్రాజెక్టు నేటికీ తెలంగాణ చరిత్రలో ఓ అద్భుత ఇంజినీరింగ్ కట్టడంగా నిలిచింది. 1923లో ప్రారంభమైన నిర్మాణం 1931లో పూర్తయింది. అప్పట్లో సుమారు 2.75 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ భారీ ప్రాజెక్టును చేపట్టారు.

ప్రాజెక్టు నిర్మాణ సమయంలో జైళ్లలో ఉన్న ఖైదీలను కూడా కూలీలుగా ఉపయోగించుకున్నారనే స్థానిక చారిత్రక కథనం ఉంది. కఠిన పరిస్థితుల్లోనూ వారు రాళ్లు, మట్టి, నిర్మాణ సామగ్రిని తరలిస్తూ ప్రాజెక్టు నిర్మాణంలో భాగస్వాములయ్యారని పెద్దలు చెబుతుంటారు.

కూలీల కష్టం.. ఇంజినీర్ల నైపుణ్యం.. నాటి పాలకుల ప్రణాళిక.. ఇవన్నీ కలిసే నిజాంసాగర్ రూపుదిద్దుకుంది. అందుకే దాదాపు శతాబ్దం దాటినా ఈ ప్రాజెక్టు చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.

నేటి తరానికి నిజాంసాగర్ ఒక నీటి వనరు మాత్రమే కాదు.. నాటి శ్రమ, సాంకేతిక నైపుణ్యం, చరిత్రకు నిలువెత్తు గుర్తు!

చరిత్రను కాపాడుకోవాల్సిన బాధ్యత

శతాబ్దానికి చేరువైన ఈ ప్రాజెక్టు కేవలం నీటి పారుదల వ్యవస్థగా కాకుండా ఒక చారిత్రక వారసత్వ సంపదగా కూడా భావించాల్సిన అవసరం ఉంది. దీని నిర్మాణ చరిత్ర, అప్పటి ఇంజినీరింగ్ విధానాలు, కూలీల జీవితం, నాటి సామాజిక పరిస్థితులపై మరింత పరిశోధన జరగాలి.

నిజాంసాగర్ గోడల్లో కనిపించేది కేవలం సిమెంట్, రాళ్లు కాదు.. నాటి ఇంజినీర్ల మేధస్సు, కూలీల శ్రమ, రైతుల భవిష్యత్తుపై నాటితరం కన్న కలల జ్ఞాపకాలు.

అందుకే నిజాంసాగర్‌ను చూస్తే.. అది ఒక ప్రాజెక్టుగా మాత్రమే కనిపించదు. ఒక శతాబ్దపు చరిత్ర మన కళ్లముందు నిలిచినట్టుగా అనిపిస్తుంది.

**ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9440287170**

# "భారత జాతీయ పతాక నేపథ్యం"

**త్రివర్ణ పతాకం భారత దేశపు గడ్డమీద మొదటి సారిగా బోస్ చేత మణిపూరులో ఆవిష్కరించ బడింది.1923లో మొదట ఎగిరిన స్వరాజ్ పతాకం అని పేరున్న భారత జాతీయ కాంగ్రెస్ పతాకం భారత జాతీయ పతాకానికి ఆధారం. రెండవ ప్రపంచ యుద్ధంలో ఆజాద్ హింద్ ఫౌజ్ వాడిన జెండా, అదే సమయంలో ఇండియన్ నేషనల్ ఆర్మీ ఈ పతాకాన్ని స్వల్ప మార్పులతో - చరఖా స్థానంలో "ఆజాద్ హింద్" అన్న అక్షరాలు, ముందుకు దూకుతున్న పులి బొమ్మతో - వాడుకొంది.**

20వ శతాబ్దం ప్రారంభంలో స్వాతంత్ర్యోద్యమం బాగా ఊపందుకున్నప్పుడు జాతీయోద్యమ స్ఫూర్తిని, లక్ష్యాలను ప్రతిబింబించే జాతీయ పతాకం అవసరమైంది. 1904లో వివేకానందుడి శిష్యురాలైన ఐరిష్ వనిత సోదరి నివేదిత భారత దేశపు మొట్టమొదటి పతాకాన్ని రూపొందించింది. ఇది పసుపు, ఎరుపు రంగుల్లో ఉన్న జెండా. జెండా మధ్య భాగంలో వజ్రాయుధం, తెల్ల తామర గుర్తులున్నాయి. "(భారత) మాతకు వందనం" అనే అర్థం వచ్చే బెంగాలీ మాటలు (వందేమాతరం)" ఆ జెండా మీదున్నాయి. ఎరుపు స్వాతంత్ర్య పోరాటానికి, పసుపు విజయానికి, తెల్లతామర స్వచ్ఛతకు చిహ్నాలు.1907 లో మేడం భికాజీ కామా ఎగరేసిన జండా మొట్ట మొదటి త్రివర్ణ పతాకం1905లో జరిగిన బెంగాల్ విభజనను వ్యతిరేకిస్తూ జరిగిన ఒక నిరసన ప్రదర్శనలో 1906 ఆగష్టు7 న కలకత్తాలోని పార్శీబగాన్ స్క్వేర్లో శచీంద్ర ప్రసాద్ బోస్ చే ఆవిష్కరించ బడింది. ఈ పతాకాన్ని "కలకత్తా పతాకం" అంటారు. ఈ పతాకంలో సమాన వెడల్పుతో అడ్డంగా మూడు పట్టీలున్నాయి: పైన నారింజ రంగు, మధ్యలో పసుపుపచ్చ, క్రింద ఆకుపచ్చ పాటు సమాంతర గీతలను కలిగి ఉంది. పైపట్టీ మీద సగం విచ్చుకున్న ఎనిమిది తామర పూలు, క్రింది పట్టీ మీద నెలవంక, సూర్యుడు మధ్యలో దేవనాగరి లిపిలో "వందేమాతరం" అనే అక్షరాలు ఉన్నాయి.

1917 లో హోంరూల్ ఉద్యమంలో వాడిన జండా, 1907 ఆగష్టు 22 న మేడం భికాజీ కామా జర్మనీ లోని స్టుట్‌గార్ట్ లో మరో జండాను ఎగరేసింది. ఈ జండాలో పైన ఆకుపచ్చ, మధ్యన కాషాయం, అడుగున ఎరుపు రంగులు ఉన్నాయి. ఇందులో ఆకుపచ్చ ఇస్లాముకు, కాషాయం హిందూ, బౌద్ధాలకు సూచికలు. ఆకుపచ్చ పట్టీలో బ్రిటిషు భారతంలోని 8 ప్రావిన్సులకు గుర్తుగా 8 పద్మాలు ఉన్నాయి. మధ్యనున్న కాషాయ పట్టీలో దేవనాగరి లిపిలో వందేమాతరం రాసి ఉంది. అడుగున ఉన్న పట్టీలో స్థంభానికి దగ్గరగా నెలవంక, రెండో చివర సూర్యుడు ఉన్నాయి. ఈ జండాను భికాజీ కామా, వీర సావర్కార్, శ్యాంజీ కృష్ణ వర్మలు కలిసి తయారు చేసారు.

మొదటి ప్రపంచ యుద్ధం మొదలయ్యాక, బెర్లిన్ కమిటీలోని భారతీయ విప్లవకారులు దీన్ని స్వీకరించాక, ఈ జండా బెర్లిన్ కమిటీ జండాగా పేరు పొందింది. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో మెసొపొటేమియాలో ఈ జండాను విస్తృతంగా ఉపయోగించారు. గదర్ పార్టీ జండాను కూడా అమెరికాలో భారతీయ చిహ్నంగా కొన్నాళ్ళు ఉపయోగించారు.

1917లో తిలక్, అనీబిసెంట్లు హోంరూల్ ఉద్యమంలో ఐదు ఎరుపు, నాలుగు ఆకుపచ్చని అడ్డపట్టీలు గల ఇంకొక జెండాను వాడారు. జెండా పైభాగంలో ఎడమవైపు తాము కోరిన డొమినియన్ హోదాకు సూచికగా యూనియన్ జాక్ గుర్తు, కుడివైపు తార-నెలవంక గుర్తులను వాడారు. దానికి దిగువన హిందువులకు పవిత్రమైన సప్తర్షి మండలానికి గుర్తుగా ఏడు నక్షత్రాలున్నాయి.

యూనియన్ జాక్ ఉండడం వల్లనేమో ఇది జనామోదం పొందలేకపోయింది. 1916లో మచిలీపట్నానికి చెందిన పింగళి వెంకయ్య ఒక జాతీయ పతాకాన్ని రూపొందించే ప్రయత్నం చేశాడు. ఆయన ప్రయత్నాన్ని గుర్తించిన ఉమర్ సుభాని, ఎస్.బి.బొమ్మన్‌జీ ఇండియన్ నేషనల్ ఫ్లాగ్ మిషన్ ను ఏర్పాటుచేశారు. వెంకయ్య తాను రూపొందించిన పతాకాన్ని గాంధీజీకి చూపించగా, ఆయన దాంట్లో భారతదేశానికీ, దేశం తానెదుర్కొంటున్న సమస్యలనుంచి విముక్తి పొందడానికీ చిహ్నంగా నిలిచిన చరఖా (రాట్నము)ను చేర్చమని సలహా ఇచ్చాడు. నిరాడంబరమైన రాట్నము గాంధీజీ నేతృత్వంలో భారతదేశ ఆర్థిక పునరుత్థానానికి ప్రతీకగా నిలిచింది. పింగళి వెంకయ్య గాంధీ సూచన ప్రకారం ఎరుపు-ఆకుపచ్చ రంగు పట్టీలమీద రాట్నము గుర్తును రూపొందించి చూపాడు. ఐతే అది అన్ని మతాలకూ ప్రాతినిధ్యం వహించేలా లేదని గాంధీ దాన్ని తిరస్కరించాడు. గాంధీ ఆలోచనలకు అనుగుణంగా ఇంకొక త్రివర్ణపతాకం పైనుంచి క్రిందకు వరుసగా తెలుపు, ఆకుపచ్చ, ఎరుపు పట్టీలతో, మూడు పట్టీలమీదుగా ఒకే పెద్ద రాట్నము గుర్తుతో రూపొందించ బడింది. ఆ మూడు పట్టీలు మైనారిటీ మతాలు, ముస్లిం, హిందూ మతాలకు సూచికలు. ఇది అప్పటి బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యపో



రాటం సాగిస్తోన్న ఐర్లాండు పతాకాన్ని పోలి ఉంది. ఈ పతాకాన్ని అహమ్మదాబాదు కాంగ్రెసు సమావేశంలో ఆవిష్కరించారు. ఇది కాంగ్రెసు అధికార పతాకం కాకపోయినా జాతీయోద్యమంలో ఎక్కువగా వాడారు. ఐతే ఆ జెండాలో మతాలకు చిహ్నాలుండడం చాలామందికి నచ్చలేదు.1924లో కలకత్తాలో సమావేశమైన ఆలిండియా కాంగ్రెస్ హిందువులకు చిహ్నాలుగా కాషాయ రంగును, గదను చేర్చాలని కోరింది. అదే సంవత్సరం హిందూ యోగుల, ముస్లిం ఫకీర్లు-దర్వేషీల వైరాగ్యానికి చిహ్నమైన జేగురు రంగును చేర్చాలనే ప్రతిపాదన కూడా వచ్చింది. సిక్ఖులు తమ మత చిహ్నంగా పసుపురంగును కూడా చేర్చాలని, లేనట్లైతే మతపరమైన సూచికలను పూర్తిగా తొలగించాలని కోరారు. భారతదేశంలో అతిపెద్ద రాజకీయ వేదికగా ఉన్న భారత జాతీయ కాంగ్రెసు 1921లో తెలుపు, ఆకుపచ్చ, ఎరుపు రంగులతో అనధికారికంగా ఒక పతాకాన్ని రూపొందించుకొంది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఒక యువకుడు జెండా తయారు చేసి గాంధీజీకి ఇచ్చాడు. ఈ కార్యక్రమం 1921లో బెజవాడ (ప్రస్తుతం విజయవాడ)లో జరిగింది. ఇది రెండు రంగులతో తయారు చేయబడింది. ఎరుపు హిందూ మతానికి, ఆకుపచ్చ ఇస్లాం మతానికి, తెలుపు ఇతర మతాలకు సూచికలు. కాంగ్రెసు 1931లో కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులతో, మధ్యలో రాట్నము బొమ్మగల పతాకాన్ని తన అధికారిక పతాకంగా స్వీకరించింది. ఈ పతాకంలో ఎటువంటి మతపరమైన ప్రతీకలూ లేవు.

ఈ పరిణామాల మధ్య కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 1931 ఏప్రిల్ 2న ఈ వివాదాలను పరిష్కరించడానికి ఏడుగురు సభ్యులతో ఫ్లాగ్ కమిటీని నియమించింది. "జెండాలోని మూడు రంగులూ మతాలనుద్దేశించినవే కాబట్టి అభ్యంతరకరమైనవేనని" కమిటీ తీర్మానించింది. ఫలితంగా పూర్తిగా ఎర్రమట్టిరంగులో, పైభాగాన రాట్నము గుర్తుతో ఒక కొత్త జెండా తయారైంది. దీన్ని ఫ్లాగ్ కమిటీ ఆమోదించినా ఇది కూడా మతపరమైన భావజాలాన్నే సూచిస్తోందనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ ఆమోదించలేదు.

తర్వాత 1931 కరాచీ కాంగ్రెస్ సమావేశంలో పై నుంచి కిందకు వరుసగా కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగుల్లో పట్టీలు, మధ్యలో చరఖాతో పింగళి వెంకయ్య రూపొందించిన పతాకాన్ని స్వీకరిస్తూ జాతీయజెండాపై తుది తీర్మానం ఆమోదించబడింది.

స్వతంత్ర భారతదేశ జాతీయ పతాకాన్ని నిర్ణయించడానికి రాజ్యాంగసభ, 1947 జూన్ 23న బాబూ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన మౌలానా అబుల్ కలామ్ ఆజాద్, కె.ఎం.పణిక్కర్, సరోజినీ నాయుడు, రాజాజీ, కె.ఎం.మున్షీ, బి.ఆర్.అంబేద్కర్ లతో ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ 1947 జూలై 14న కాంగ్రెస్ పతాకాన్నే అన్ని పార్టీలకు, మతాలకు ఆమోదయోగ్యమయ్యే మార్పులతో జాతీయపతాకంగా స్వీకరించాలని నిర్ణయించింది. దాంట్లో మతపరమైన సూచికలేవీ ఉండరాదని తీర్మానించింది. 1947 ఆగస్టులో భారతదేశానికి స్వాతంత్ర్యం రావడానికి కొన్నిరోజుల ముందు ఏర్పాటైన రాజ్యాంగసభ, కాంగ్రెస్ పార్టీ పతాకాన్నే అన్ని పార్టీలకు, అన్ని మతాలవారికి ఆమోదయోగ్యమైన మార్పులు చేసి జాతీయ పతాకంగా స్వీకరించడానికి నిర్ణయించింది. అన్నిటికంటే ముఖ్యమైన మార్పు రాట్నము స్థానంలో అశోకచక్రాన్ని చేర్చడం. చరఖా స్థానంలో సారనాథ్ స్థూపంలోని ధర్మచక్రాన్ని చేర్చారు. ఈ కొత్త పతాకాన్ని స్వతంత్ర భారత జాతీయ పతాకంగా ఉద్వేగ భరిత వాతావరణంలో 1947 ఆగష్టు 15 నాడు ఆవిష్కరించారు.

**రామకిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

ఆస్పైర్ సమ్మిట్ 3.0లో నిజామాబాద్

## నారాయణ బ్రాంచ్‌కు ద్వంద్వ గౌరవం




**నిజామాబాద్ జోన్ ఏజీఎం సూర్యవంశీ శివాజీ పటేల్**

**నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 13 (నినాదం) :** విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తూ, వారి విద్యా ప్రగతికి నిరంతర సహకారం అందించడంలో నారాయణ స్కూల్స్ ముందంజలో ఉందని, ఈ కృషికి మరోసారి గుర్తింపుగా ఆస్పైర్ సమ్మిట్ 3.0లో తెలంగాణ కార్యక్రమంలో నిజామాబాద్ జోన్‌లోని నారాయణ బ్రాంచ్ కు ప్రత్యేక గుర్తింపును సాధించిందని నిజామాబాద్ జోన్ ఏజీఎం సూర్యవంశీ శివాజీ పటేల్ అన్నారు. 2025-26లో అత్యధిక విద్యార్థుల రిటెన్షన్ రేట్ సాధించినందుకు నిజామాబాద్ బ్రాంచ్ ఈ- కిడ్జ్ , ఈ --చాంప్స్ రెండు విభాగాల్లోనూ ఎంపిక కావడం విశేషమన్నారు. రెండు విభాగాల్లో ఎంపిక కావడం ద్వారా నిజామాబాద్ బ్రాంచ్ విద్యార్థుల విద్యా ప్రయాణాన్ని కొనసాగించడంలో, వారితో బలమైన అనుబంధాన్ని ఏర్పరచడంలో తన ప్రత్యేక ప్రతిభను చాటుకుందన్నారు. ఈ సందర్భంగా ఏజీఎం సూర్యవంశీ శివాజీ పటేల్ మాట్లాడుతూ నిజామాబాద్ బ్రాంచ్ సాధించిన ఈ ద్వంద్వ గుర్తింపు విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్, సిబ్బంది, తల్లిదండ్రుల సమిష్టి కృషికి నిదర్శనమని తెలిపారు. విద్యార్థులపై ఉపాధ్యాయులు చూపిన శ్రద్ధ, తల్లిదండ్రుల సహకారం, విద్యార్థుల పట్టుదల ఈ విజయానికి ప్రధాన కారణాలని పేర్కొన్నారు. జీఎం గోపాల్ రెడ్డి , డీజీఎం వెంకటరమణ రెడ్డిలు మాట్లాడుతూ నిజామాబాద్ బ్రాంచ్ సాధించిన ద్వంద్వ విజయాన్ని అభినందిస్తూ విద్యార్థుల ప్రతిభను వెలికితీయడంలో బ్రాంచ్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది చేస్తున్న కృషిని ప్రశంసించారు. భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. ఆగస్టు 11న హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ, శిల్పకళా వేదికలో ఆస్పైర్ సమ్మిట్ 3.0 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమా మామ్ విజేతలను ఘనంగా సత్కరించి, వారి విజయాలను అభినందించారు. నారాయణ నిజామాబాద్ జోన్‌లో నిజామాబాద్ బ్రాంచ్ సాధించిన ఈ ద్వంద్వ గుర్తింపు మొత్తం జోన్ కు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మొత్తం నారాయణ స్కూల్స్ కుటుంబానికి గర్వకారణంగా నిలిచిందన్నారు.




# పిత్తాశయంలో వాపు ఉంటే కనిపించే లక్షణాలు


పిత్తాశయంలో రాళ్లు ఎక్కువగా ఉంటే కోలిసిస్టైటిస్ ప్రమాదం పెరుగు తుంది. అసలు కోలిసిస్టైటిస్ అంటే ఏంటి, ఇది రావడానికి కారణాలు, కని పించే ప్రధాన లక్షణాలు, వ్యాధి నిర్ధార ణ, చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి పూర్తి వివరాల్ని డాక్టర్ కిరణ్ పెద్ది అందించారు. కోలిసిస్టైటిస్ అంటే పిత్తాశయం వాపునకు గురికావడం అంటే ఇన్ఫెక్షన్. పిత్తాశయం అనేది కాలేయం కింద ఉండే ఒక చిన్న అవయవం. మనం తిన్న ఆహారంలోని కొవ్వుల్ని జీర్ణం చేయడానికి కాలేయం 'పైత్యరసం' ను తయారుచేస్తే, పిత్తాశయం దానిని నిల్వ ఉంచుతుంది. ఆహారం తిన్న తర్వాత చిన్న పైపుల వంటి నాళాల ద్వారా ఈ పైత్యరసాన్ని పేగుల్లోకి పంపుతుంది. ఈ పైత్యరస నాళాల్లో అడ్డంకులు లేదా ఇన్ఫెక్షన్ ఏర్పడినప్పుడు పైత్యరసం బయటకు వెళ్లకుండా పిత్తాశయంలోనే నిలిచిపో తుంది. దీనివల్ల వాపు, తీవ్రమైన నొప్పి, ఇన్ఫెక్షన్ వస్తాయి.

ఆకస్మికంగా వచ్చే వాపును అక్యూట్ కోలిసిస్టైటిస్ అంటారు. అదే చాలా కాలంగా ఉండే సమస్యను క్రోనిక్ కోలిసిస్టైటిస్ అని పిలుస్తారు. ప్రపంచ జనాభాలో దాదాపు 15% మందికి పిత్తాశయంలో రాళ్లు ఉంటాయి. వీరిలో 20% మందికి రకరకాల కాంప్లికేషన్లు వస్తాయి. కోలిసిస్టైటిస్ సమస్య రావడానికి 95% ప్రధాన కారణం ఈ పిత్తాశయ రాళ్లే.

**ఈ సమస్యకు కారణాలు ఏంటి?**



**పిత్తాశయ రాళ్లు :** పైత్యరసం వెళ్లే మార్గాన్ని రాళ్లు మూసివేయడం వల్ల పైత్యరసం పేరుకుపోయి వాపు వస్తుంది.
**చిక్కటి పైత్యరసం:** పైత్యరసం గడ్డకట్టినట్లు గట్టిపడి మార్గాన్ని మూసివేస్తుంది.
**ఇన్ఫెక్షన్లు:** రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో త్వరగా వస్తుంది.
టిష్యూ గ్రోత్ లేదా ట్యూమర్లు: ప్యాంక్రియాస్ (క్లోమం), కాలేయం లేదా పైత్యరస నాళాల్లో గడ్డలు ఏర్పడటం.
**రక్తప్రసరణ తగ్గడం:** తీవ్రమైన అనారోగ్యం, గాయాలు లేదా డయాబెటిస్ ఉన్నవారిలో పిత్తాశయానికి రక్తప్రసరణ తగ్గుతుంది.
**సుదీర్ఘమైన నిరాహారదీక్ష/ఫాస్టింగ్:** ఎక్కువరాత్రులు లేదా రోజులు ఆహారం తీసుకోకుండా సెలైన్‌ద్వారా మాత్రమే పోషణ పొందుతున్న వారిలో పైత్యరసం కదలకుండా నిలిచిపోతుంది.




**కోలిసిస్టైటిస్ ప్రధాన లక్షణాలు**

పొత్తికడుపు పైభాగంలో (కుడివైపు) తీవ్రమైన నొప్పి.
ఈ నొప్పి కుడి భుజానికి లేదా వీపు వెనుక భాగానికి పాకడం.
వికారం, వాంతులు. జ్వరం, వణుకు. కడుపు ఉబ్బరం లేదా పొట్టను తాకితే తీవ్రమైన నొప్పి. కళ్ళు లేదా చర్మం పసుపు రంగులోకి మారడం

**ఎవరికి ప్రమాదం ఎక్కువ?**

మహిళలు (ప్రత్యేకంగా గర్భవతులు)
40 సంవత్సరాలు దాటినవారు
అధిక బరువు ఉన్నవారు
మధుమేహం (షుగర్) ఉన్నవారు
రక్తంలో కొలెస్ట్రాల్ లేదా ట్రైగ్లిజరైడ్స్ ఎక్కువగా ఉన్నవారు
వేగంగా బరువు తగ్గినవారు
కుటుంబంలో పిత్తాశయ రాళ్ల చరిత్ర ఉన్నవారు

**వ్యాధి నిర్ధారణ ఎలా చేస్తారు?**

**శారీరక పరీక్ష :** పొట్టను సరిచూడటం.
రక్త పరీక్షలు: ఇన్ఫెక్షన్ స్థాయిలు, కాలేయ పనితీరు.
**అల్ట్రాసౌండ్ :** ఇది అత్యంత ముఖ్యమైన, మొదటి పరీక్ష.
వ్యాధిపై స్పష్టత రానప్పుడు చేస్తారు.
కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో చేస్తారు.

**సకాలంలో చికిత్స తీసుకోకపోతే వచ్చే ప్రమాదాలు!**

దీనిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకమైన సమస్యలకు దారితీస్తుంది:
పిత్తాశయంలో చీము పట్టడం.
కణజాలం చనిపోవడం.
పిత్తాశయం పగిలిపోవడం.
పొట్ట భాగమంతా ఇన్ఫెక్షన్ వ్యాపించడం
ప్యాంక్రియాటైటిస్ (క్లోమ గ్రంథి వాపు).
ఇన్ఫెక్షన్ రక్తంలోకి పాకడం.

నివారణ మార్గాలు, ఆహారపు అలవాట్లు
**పీచు పదార్థాలు :** పండ్లు, కూరగా య లు, తృణధాన్యాలు ఎక్కువగా తినాలి.
**ఆయిల్, వేపుళ్లు తగ్గించాలి:** వేయించిన ఆహారాలు, సంతృప్త కొవ్వులు ఉన్న ఆహారాన్ని పరిమితం చేయాలి.
**ఆరోగ్యకరమైన బరువు:** వ్యాయామం ద్వారా బరువును అదుపులో ఉంచుకోవాలి.
ఒకేసారి బరువు తగ్గకూడదు: క్రాష్ డైటింగ్‌లు చేసి ఒక్కసారిగా బరువు తగ్గడం వల్ల రాళ్లు ఏర్పడే ప్రమాదం ఉంది.
సమయానికి భోజనం: ప్రతిరోజూ క్రమం తప్పకుండా సరైన సమయానికి తింటూ ఉండాలి.

**ముఖ్యమైన విషయాలు**

సర్జరీ : పిత్తాశయంలో ఇన్ఫెక్షన్ లేదా రాళ్లు ఉన్నప్పుడు, శస్త్రచికిత్స ద్వారా పిత్తాశయాన్ని తొలగించడం చాలా సురక్షితమైన పరిష్కారం. పిత్తాశయం లేకపోయినా కాలేయం నేరుగా పైత్యరసాన్ని పేగుల్లోకి పంపుతుంది కాబట్టి సాధారణ జీవితానికి ఏ ఇబ్బంది ఉండదు.

**డాక్టర్‌ను ఎప్పుడు కలవాలి?**

హఠాత్తుగా కుడివైపు కడుపునొప్పి రావడం, దాంతో పాటు జ్వరం లేదా కళ్ళు పచ్చగా మార డం కనిపిస్తే వెంటనే గాస్ట్రోఎంటరాలజిస్ట్‌ను సంప్రదించాలి.


## కంటిలోపలి ఒత్తిడి పడిపోవడం అంటే ఏంటి?

సాధారణంగా ఆరోగ్యకరమైన కంటి ఒత్తిడి 10 నుంచి 21 mmHg మధ్య ఉంటుంది. 6 mmHg కంటే తగ్గితే దాన్ని హైపోటోనీ అంటారు. కంటి ఒత్తిడి తగ్గడం వల్ల చూపును స్పష్టంగా చూపే మాక్యులా అనే భాగంపై మడతలు పడతాయి. దీనివల్ల చూపు గణనీయంగా తగ్గుతుంది. అసలు హైపోటోని అంటే ఏంటి, ఈ సమస్య రావడానికి ప్రధాన కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్స విధానాల గురించి పూర్తి సమాచారాన్ని ఐ స్పెషలిస్ట్ డాక్టర్ బాలం ప్రదీప్ అందించారు. ఆ పూర్తి వివరాలేంటో తెలుసుకుం దాం. సర్వేంద్రియానం నయనం ప్రధానం అంటారు. కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎంత ముఖ్యమో ఇది తెలుపుతుంది.

## ప్రోస్టేట్ క్యాన్సర్ ముదిరితే శరీరంలో ఏ భాగాలకు పాకుతుంది?

ప్రోస్టేట్ క్యాన్సర్ ప్రారంభంలో గుర్తిస్తే నయం చేయవచ్చు, కానీ ఎముకలకు పాకినప్పుడు (దీశీఅవ వీఝఆఱంఱం) అది స్టేజ్-4గా మారి నొప్పితో కూడిన సవాలుగా మారుతుంది. అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ ఇప్పుడు ఇదే పరిస్థితిలో ఉన్నారు. అసలు క్యాన్సర్ ఎముకలకు పాకడం అంటే ఏంటి, దీన్ని లక్షణాల్ని ఎలా గుర్తించాలో ఇప్పుడు తెలుసుకుందాం.

అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ తీవ్రమైన ప్రోస్టేట్ క్యాన్సర్ తో బాధపడుతున్నారు. ఈ క్యాన్సర్ శరీరంలోని ఇతర భాగాలకు, ముఖ్యంగా ఎముకలకు విస్తరిం చిందని (మల్టిపుల్ మెటాస్టాసిస్) ఆయన కుమారుడు హంటర్ బైడెన్ బీబీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడిం చారు. "క్యాన్సర్ ఎముకలకు, మరిన్ని భాగాలకు వ్యాపించింది. ఇది చాలా తీవ్రమైన నొప్పితో కూడుకుంది. ఆయనను శారీరకంగా చాలా బలహీనపరిచింది. ఆయనను ఈ స్థితిలో చూడటం చాలా బాధాకరంగా ఉంది" అని హంటర్ బైడెన్ ఆవేదన వ్యక్తం చేశారు. మే 2025లో బైడెన్‌కు ప్రోస్టేట్ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఆయన క్యాన్సర్ తీవ్రతను కొలిచే 'గ్లీసన్ స్కోర్' 9 (గ్రేడ్ గ్రూప్ 5)గా తేలింది. అమెరికన్ క్యాన్సర్ సొసైటీ ప్రకారం, గ్రేడ్ 5 అంటే




క్యాన్సర్ కణాలు చాలా వేగంగా, తీవ్రంగా వృద్ధి చెందుతున్నాయని అర్థం. గ్లీసన్ స్కోర్ 8 నుంచి 10 మధ్య ఉంటే, క్యాన్సర్ శరీరంలోని ఇతర అవయవాలకు వేగంగా వ్యాపించే అవకాశం చాలా ఎక్కువగా ఉంటుంది. అసలు ఎముకల కు క్యాన్సర్ పాకడం (దీశీఅవ వీఝఆఱంఱం) అంటే ఏంటి, లక్షణాలు ఎలా ఉంటాయి, చికిత్స విధానాలు గురించి పూర్తి వివరాలు తెలుసుకుందాం.

ఎముకలకు క్యాన్సర్ పాకడం అంటే ఏంటి? మయోక్లినిక్ నివేదిక ప్రకారం క్యాన్సర్ మొదలైన మూల భాగం (ఇక్కడ ప్రోస్టేట్ (గ్రంథి) నుంచి కణాలు రక్తప్రసరణ లేదా శోషరస వ్యవస్థ ద్వారా ప్రయాణించి ఎముకల్లోకి చేరుకుని, అక్కడ పెరగడాన్ని బోన్ మెటాస్టాసిస్ అంటారు. రొమ్ము క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్‌లు ఎముకలకు వ్యాపించే అవకాశం చాలా ఎక్కువ. ప్రోస్టేట్ క్యాన్సర్ సాధారణంగా వెన్నుపా ము, పిరుదుల ఎముకలు తొంటి ఎముకలు పక్కటెముకలకు వ్యాపిస్తుంది. తీవ్రమైన **ఎముకల నొప్పి:** ఎముక నిర్మాణం దెబ్బతినడం వల్ల నిరంతరం, నరకయాతన కలిగించే నొప్పి ఉంటుంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో, కదిలినప్పుడు నొప్పి తీవ్రమవుతుంది. ఎముకలు చాలా బలహీన పడతాయి. చిన్న దెబ్బ తగిలినా లేదా చిన్న కదలికలకే ఎముకలు విరిగిపోయే ప్రమాదం ఉంది.

అర్హులైన ప్రతి ఒక్కరికీ

# నూతన పెన్షన్లు అందిస్తాం

- **రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్**
- **నూతన పెన్షన్ల కోసం ఆగస్టు 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి**
- **గీత, చేనేత కార్మికులకు 50 ఏళ్ల నుంచే పెన్షన్.. దివ్యాంగులకు 51 శాతం వైకల్యం నిబంధన**
- **ప్రస్తుతం జిల్లాలో 2,18,002 మంది లబ్ధిదారులకు ప్రతి నెల సుమారు రూ.47 కోట్ల పెన్షన్ల పంపిణీ**



**జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 13 (నినాదం ):** అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ నూతన పెన్షన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. నూతన రేషన్ కార్డులు, నూతన పెన్షన్ల పంపిణీ పై గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం (కలెక్టరేట్) సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తో కలిసి మంత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ఎన్నో రోజులుగా నూతన పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, ఫైలేరియా బాధితులు, డయాలసిస్ రోగులు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, తలసేమియా బాధితులు తదితర అర్హులైన వర్గాలకు నూతన పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరూ ఆగస్టు 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో బిల్ కలెక్టర్ల ద్వారా దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి నూతన పెన్షన్ అందించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతం జిల్లాలో 2,18,002 మంది లబ్ధిదారులకు ప్రతి నెల సుమారు రూ. 47 కోట్ల మేర పెన్షన్లు ప్రభుత్వం అందిస్తోందని మంత్రి తెలిపారు. గీత కార్మికులు, చేనేత కార్మికులకు 50 సంవత్సరాల వయస్సు నుంచే పెన్షన్ పొందే అవకాశం కల్పిస్తున్నామని, దివ్యాంగులకు 51 శాతం వైకల్యం నిబంధన ప్రకారం పెన్షన్ అందిస్తామని మంత్రి తెలిపారు. గ్రామాల్లో పర్యటించిన సమయంలో కొత్త పెన్షన్ల కోసం అనేక మంది ప్రజలు తమకు విజ్ఞప్తులు చేశారని, వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు తెలంగాణలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం, పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రతి లబ్ధిదారునికి రూ. 5 లక్షలు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పేదల సంక్షేమం, సామాజిక భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రంలోని యువతకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సుమారు రూ. 200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన జరిగిందని, ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఒకే చోట నాణ్యమైన విద్యను అభ్యసించేలా సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పేద విద్యార్థికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య అందించాలనే లక్ష్యంతో ఈ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లకు పెండింగ్ బిల్లుల చెల్లింపులుగురుకులాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 1,000 కోట్ల బిల్లులను ప్రభుత్వం క్లియర్ చేసిందని తెలిపారు. సాగునీటి అంశంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇటీవల సమీక్ష నిర్వహించారని మంత్రి తెలిపారు. రైతులకు అవసరమైన మేరకు సాగునీరు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, రాష్ట్రంలో సాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో వెలుమ కార్పొరేషన్ చైర్పర్సన్ జువ్వాడ నరసింహారావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్, అదనపు కలెక్టర్ బి రాజ గౌడ్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గుండెలో రక్త సరఫరాకు అడ్డుగా ఉన్న కణితిని శస్త్ర చికిత్సతో తొలగింపు

- **మెడికవర్ హాస్పిటల్స్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ రాకేష్‌కుమార్**




**నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 13 (నినాదం) :** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మెడికవర్ ఆసుపత్రిలో తొలిసారిగా గుండెలో రక్త సరఫరాకు అడ్డుగా ఉన్న కణితిని శస్త్ర చికిత్స ద్వారా విజయవంతంగా తొలగించినట్టు మెడికవర్ హాస్పిటల్స్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ రాకేష్ కుమార్ తెలిపారు. గురువారం మెడికవర్ హాస్పిటల్స్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గుండె శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ రాకేష్ కుమార్ మాట్లాడుతూ సుమారు 40 ఏళ్ల వయసు గల మహిళ ఆస్పత్రికి రాగా శ్వాస సంబంధిత సమస్య, కాళ్లవాపులు, ఇలాంటి వాటితో రావడం జరిగిందన్నారు. గుండెకు సంబంధించిన సమస్యలు రావడంతో పరీక్షించినట్లు వైద్య నిపుణులు తెలిపారు. అయితే చేసిన పరీక్షల్లో గుండెలో ఏర్పడిన కణితి కారణంగా రక్త సరఫరాకు ఆటంకం ఏర్పడడం జరిగిందన్నారు. గుండెలో ఏర్పడిన ప్రతి కణితి క్యాన్సర్ కు సంబంధించినది కాదని తెలిపారు. ఓపెన్ హార్ట్ సర్జరీ ద్వారా ఏదైతే గుండెలో రక్త సరఫరాకు అడ్డుగా ఉన్న కణితిని తొలగించడం జరిగిందన్నారు. దీంతో మహిళ ఆరోగ్యంగా ఉందన్నారు. నిజామాబాద్‌లో తొలిసారిగా ఇలాంటి క్లిష్టమైన గుండె శస్త్రచికిత్సను విజయవంతంగా చేశామన్నారు. అనంతరం మత్తు వైద్య నిపుణులు డాక్టర్ ఏలేటి వను, మెడికల్ హాస్పిటల్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కూరపాటి యజ్ఞ లు మాట్లాడుతూ ఎంతో క్లిష్టమైన గుండె సర్జరీని గుండెలో కణితి కారణంగా రక్తసరఫరాకు ఆటంకం ఏర్పడటం అరుదైన, సవాలుతో కూడుకున్న పరిస్థితి అన్నారు. సకాలంలో గుర్తించి, సరైన సమయంలో శస్త్రచికిత్స చేయడం ద్వారా రోగికి మంచి ఫలితం అందించగలిగమన్నారు. నిజామాబాద్‌లో తొలిసారిగా ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.. అయితే డాక్టర్ రాకేష్ మాట్లాడుతూ క్యాన్సర్ కణితికి గుండెల్లో ఏర్పడే కణితికి చాలా తేడా ఉంటుందన్నారు. క్యాన్సర్ కు సంబంధించిన కనితి అయినప్పుడు వాటికి లక్షణాలు వేరుగా ఉంటాయని తెలిపారు అలాగే క్షయ వ్యాధికి సంబంధించిన కనితీలు సైతం ఏర్పడతాయని చెప్పారు. నిపుణులైన వైద్యుల సూచన మేరకు సరైన చికిత్స తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ హెడ్ స్వామి, డీఎంఎస్ యజ్ఞ, మార్కెటింగ్ హెడ్ వినయ్ కుమార్ పాల్గొన్నారు.




## 1.49 లక్షల మందికి అధిక పెన్షన్



అధిక పెన్షన్ కోసం అదనంగా కాంట్రిబ్యూట్ చేసిన ఉద్యోగులకు బిగ్ అలర్ట్. ఇటీవలే రిటైర్మెంట్ తీసుకుని అధిక పెన్షన్ కోసం క్లెయిమ్ చేసిన వారిలో 1.49 లక్షల మందికి హయ్యర్ పెన్షన్ ఆర్డర్లు వచ్చాయి. అధిక పెన్షన్ ఆర్డర్లను జారీ చేసినట్లు ఈపీఎఫ్ఓ తాజాగా ప్రకటించింది. మరి అధిక పెన్షన్ ఎంచుకున్న వారు తమ క్లెయిమ్ స్టేటస్ ఎలా చెక్ చేసుకోవాలో ఇప్పుడు మనం తెలుసుకుందాం. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ పరిధిలోని పింఛనుదారులకు కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ వేదికగా కీలక ప్రకటన చేసింది. నవంబర్ 2022లో సుప్రీం కోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పుకు అనుగుణంగా, వాస్తవ వేతనం ఆధారంగా హయ్యర్ కాంట్రిబ్యూషన్ చెల్లించి అదనపు పెన్షన్ కోరిన ఉద్యోగులకు సంబంధించి వివరాలు వెల్లడించింది. ఇప్పటి వరకు 1,49,806 పెన్షన్ పేమెంట్ ఆర్డర్లను (ఠాూం) జారీ చేసినట్లు పార్లమెంట్ వేదికగా కేంద్ర కార్మిక శాఖ ప్రకటించింది. మరి అందుకు సంబంధించిన వివరాలు తెలుసుకుందాం.

మొత్తంగా అధిక పెన్షన్ కోసం 15.24 లక్షలకు పైగా క్లెయిమ్‌లు వచ్చినట్లు ఈపీఎఫ్ఓ గణాంకాలను కేంద్ర కార్మిక శాఖ వెల్లడించింది. వాటి ప్రాసెసింగ్ వేగవంతంగా సాగుతోందని, ఇప్పటి వరకు 1.49 లక్షల మందికి అధిక పెన్షన్ కోసం పెన్షన్ పేమెంట్ ఆర్డర్లను జారీ చేసినట్లు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో పింఛనుదారులు, ఉద్యోగులు తమ పెన్షన్ క్లెయిమ్ స్టేటస్‌ను సులభంగా ఎలా తెలుసుకోవాలో ఇప్పుడు మనం చూద్దాం.

4 పద్ధతుల్లో పెన్షన్ క్లెయిమ్ స్టేటక్ చెక్
ఈపీఎఫ్ఓ అధికారిక పోర్టల్: పీఎఫ్ అధికారిక epfindia.gov.in సందర్శించి సర్వీసెస్ సెక్షన్‌లో ఫర్ ఎంప్లాయిస్ ఆప్షన్ ఎంచుకుని నో యువర్ క్లెయిమ్ స్టేటస్ పై క్లిక్ చేయండి. మీ యూఏఎన్, క్యాప్చా నమోదు చేసి స్టేటస్ చూడవచ్చు.

ఉమాంగ్ మీ స్మార్ట్ ఫోన్లో ఉమాంగ్ యాప్ ఓపెన్ చేసి ఈపీఎఫ్ఓ సర్వీసెస్‌ను ఎంచుకోవాలి. అందులో ఎంప్లాయీ సెంట్రిక్ సర్వీసెస్ విభాగంలో ట్రాక్ క్లెయిమ్ పై క్లిక్ చేసి యూఏఎన్ ఆధారంగా ఓటీపీ నమోదు చేసి స్టేటస్ తెలుసుకోవచ్చు.
**ఎస్ఎంఎస్ సౌకర్యం:** మీ యూఏఎన్‌కు లింక్ అయి ఉన్న మొబైల్ నంబర్ నుంచి 7738299899కు జుూఖీూనూ ఖూచీ ుజుూ అని ఎస్ఎంఎస్ పంపించడం ద్వారా మీ పింఛన్ క్లెయిమ్ వివరాలను తెలుగు భాషలోనే తెలుసుకోవచ్చు.
మిస్డ్ కాల్: రిజిస్టర్డ్ మొబైల్ నుంచి 9966044425కు మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా మీ ఖాతాలోని పీఎఫ్ బ్యాలెన్స్, చివరిగా సమర్పించిన క్లెయిమ్ సమాచారాన్ని వెంటనే పొందవచ్చు.

ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ కిందమార్చి 31, 2026 నాటికి మొత్తం 85.84 లక్షల మంది పెన్షనర్లు లబ్ధి పొందుతున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. అదనపు పెన్షన్ ఆమోదం పొందిన సభ్యులకు సవరించిన పెన్షన్ బకాయిలతో పాటు ప్రతి నెలా పెరిగిన పెన్షన్ మొత్తం వారి ఖాతాల్లో జమ అవుతుంది. తమ పెన్షన్ పేమెంట్ ఆర్డర్ తీసుకుని వివరాలు తనిఖీ చేసుకోవాల్సిన అవసరం ఉంది. అందులో ఏదైనా తప్పు ఉన్నట్లు గుర్తిస్తే ఈపీఎఫ్ఓ ప్రాంతీయ కార్యాలయంలో సంప్రదించడం మంచిది.

## మాజీ ప్రధానులు జవహర్ లాల్ నెహ్రూ, రాజీవ్ గాంధీ విగ్రహాలను ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి




జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 13 (నినాదం):** ఈనెల 15 న సంగారెడ్డి పట్టణానికి సీఎం రేవంత్ రెడ్డి రానున్న విషయం తెలిసిందే. సంగారెడ్డి పట్టణం లోని ఐబీ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన మాజీ ప్రధానులు జవహర్ లాల్ నెహ్రూ, రాజీవ్ గాంధీ గార్ల విగ్రహాలను ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. గురువారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డిలు విగ్రహాలు నెలకొల్పిన స్థలాన్ని అధికారులు,నాయకులతో కలిసి పరిశీలించారు. సీఎం చేతులమీదుగా విగ్రహ ఆవిష్కరణ జరుగుతున్న నేపథ్యం లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ఏర్పాట్లను అధికారులకు సూచించారు. విగ్రహ ఆవిష్కరణ సమయం లో సీఎం తో పాటు ఎవరెవరు పాల్గొంటారో అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ జూలకంటి అంజనేయులు, సిడిసి చైర్మన్ రామ్ రెడ్డి, నాయకులు రఘు గౌడ్,జార్జ్, కూన సంతోష్,కిరణ్ గౌడ్, మ హేష్, శ్రీకాంత్, ప్రవీణ్ , సందీప్ రెడ్డి, మొగులయ్య, ఖలీల్ పాల్గొన్నారు.

## పులుమద్ది నూతన గ్రామ కమిటీ ఎన్నిక



- అధ్యక్షునిగా నల్ల ఆనందం మాదిగ ఎన్నిక

**వికారాబాద్, ఆగస్టు 13(నినాదం):** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గురువారం వికారాబాద్ మండలం పులమద్ది గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీ ఎన్నుకోవడం జరిగింది. ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జ్ చిట్టిగిద్ద కిష్టయ్య మాదిగ, గుట్టకింది రవికుమార్ మాదిగ, వి హెచ్ పి ఎస్ విజయ్ కుమార్, మాదిగ గోపాల్ మాదిగ, రాజు మాదిగ ఆధ్వర్యంలో పులుమద్ది నూతన గ్రామ అధ్యక్షుడిగా నల్ల ఆనందం మాదిగ, అధికార ప్రతినిధి రామకృష్ణ మాదిగ, ఉపాధ్యక్షులు బాబేష్ మాదిగ, ఎన్ ప్రవీణ్ మాదిగ, నందకిషోర్ మాదిగ, ప్రశాంత్ మాదిగ, చందు మాదిగ, యువరాజు మాదిగ, ప్రవీణ్ మాదిగ, నాగేష్ మాదిగ, విక్రమ్ మాదిగ, జస్వంత్ మాదిగ, వెంకటేశం మాదిగ రాకేష్ మాదిగ గౌరవ సలహాదారులుగా శ్యామయ్య మాదిగ,పాపయ్య మాదిగ, చంద్రయ్య మాదిగ, శ్రీనివాస్ మాదిగ,చంద్రయ్య మాదిగ, ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొని ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీ ఎన్నుకోవడం జరిగింది.

## అంగన్వాడీలకు హెల్త్ ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ 20 లక్షలు ఇవ్వాలి



**వికారాబాద్, ఆగస్టు 13(నినాదం):** ఫ్రీ ఫైర్ స్కూల్స్ అంగన్వాడికు అప్పచెప్పాలని, అదనపు పనిభారం బిఎల్ఓ డ్యూటీలు రద్దు చేయాలని, సొంత భవనాలు నిర్మించాలని మండల కేంద్రాలలో మీటింగ్ హాల్స్ ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం జిల్లా పరిధిలోని నవాబు పేట మండల కేంద్రంలో అంగన్వాడి టీచర్స్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ మహిపాల్ మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు 32వేలు అమలు చెయ్యాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్ 10లక్షలు ఇవ్వాలన్నారు. హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, యూనిఫాంలు ఇవ్వాలని ప్రతి గ్రామంలో అంగన్వాడి సొంత భవనాలు నిర్మించాలని కోరారు. మండల కేంద్రంలో మీటింగ్ హాల్ ఏర్పాటు చేయాలన్నారు. పోటీ సెంటర్లు రద్దు చేయాలి ప్రీ ప్రైమరీ శ్రీ విద్యను అంగన్వాడీలకే ఇవ్వాలని ఆయన అన్నారు. అందరికీ ఇండ్లు ఇళ్లస్థలాలు ఇవ్వాలని అకారణంగా అంగన్వాడి టీచర్స్ హెల్పర్స్ ను తొలగించే ప్రక్రియ ఆపాలని డిమాండ్ చేశారు. నిరంతరం అధికారుల నాయకుల వేధింపులు ఆపాలి అన్నారు. లేనిచో ఆందోళన పోరాటలు చ్చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు సంగీత, లక్ష్మీ రాములమ్మ, జయ బానిస, విజయలక్ష్మి, జయాబునిసా, రాములమ్మ, కాంసమ్మ, సంగీత, సునీత, జ్యోతి, నాగమణి జయమ్మ, దేవమ్మ, శకుంతల, అన్నపూర్ణ, పద్మ, విజయ, సునీత, స్వరూప, భావన, సుమిత్ర, ప్రసన్న,అలివేణి, విజయ లక్ష్మి, నంబమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## హర్ గర్ తిరంగా నినాదంతో ర్యాలీలు



**వికారాబాద్, ఆగస్టు 13(నినాదం):** జిల్లాలో గురువారం హర్ గర్ తిరంగా కార్యక్రమం సందర్భంగా బీ జే పి ఆధ్వర్యంలో హర్ గర్ తిరంగా నినాదాలతో ర్యాలీలు నిర్వహించారు. పరిగి పట్టణ అధ్యక్షులు బాలకృష్ణ రెడ్డి, పరిగి మండల అధ్యక్షురాలు అనసూయ శ్యామ్ సుందర్, ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించిన హర్ ఘర్ తిరంగా యాత్రలో బీజేపీ పరిగి అసెంబ్లీ ఇంచార్జ్ మారుతి కిరణ్ బూనేటి, బీజేపీ నాయకుడు వెన్న ఈశ్వరప్ప తదితరులు ర్యాలీలో నినదించారు. ఈ సందర్భంగా మారుతి కిరణ్ బూనేటి గారు మాట్లాడుతూ హర్ గర్ తిరంగా మన దేశ గౌరవానికి ప్రతీకని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రామచంద్రయ్య, రాము యాదవ్, కేశవులు, డి. ఆంజనేయులు, పరిగి అసెంబ్లీ కన్వీనర్ ఉగ్ర నరసింహ, మండల మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, రంగంపల్లి గ్రామ సర్పంచ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముని అశోక్, రంగంపల్లి గ్రామ ఉపసర్పంచ్, మండల ప్రధాన కార్యదర్శి రమేష్, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు అనూష, జిల్లా మహిళా మార్చనాయకురాలు వాణిశ్రీ గుప్తా, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎస్పీ శీను, బీజేపీ నాయకులు కంకల్ రవీందర్, కన్నయ్యల రాజ, పోల్కంపల్లి భీమయ్య, జిల్లా కార్మిక సెల్ జాయింట్ కన్వీనర్ జోక సురేష్ బాబు, ప్రభాకర్, బీజేవైఎం అసెంబ్లీ కో-కన్వీనర్ మనోహర్ గౌడ్, వికారాబాద్ లో ఏ వి ఎన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రమేష్, విద్యార్థులు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యా వైద్య రంగాలకు ప్రాధాన్యత

- శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్




**వికారాబాద్, ఆగస్టు 13(నినాదం):** తెలంగాణ ప్రభుత్వం సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యా వైద్య రంగాలకు ప్రాధాన్యత ని స్తున్నట్లు శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా పరిధిలోని ధారూర్ మండలం కుక్కింద గ్రామంలో రూ. 25 లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని (పీహెచ్ సీ ) మరియు ఔసుపల్లి గ్రామంలో రూ. 20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన గ్రామ సభలలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అదిక ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. హాస్పిటల్ నిర్మాణానికి, ఆధునిక పరికరాల ఏర్పాటుకు భారీ ఎత్తున నిధులను మంజూరు చేస్తున్నదని చెప్పారు. డాక్టర్లు, నర్సింగ్ స్టాఫ్ పోస్ట్ లను భర్తీ చేస్తున్నదని తెలిపారు. పట్టణాలలో బస్తి దవాఖానాల లాగా గ్రామాలలో పల్లె దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. ఆధునిక కాలంలో మానసిక ఒత్తిడి ద్వారా ప్రజలు పెద్ద పెద్ద జబ్బులకు గురవుతున్నారని యాబై సంవత్సరాలు దాటిన ప్రతి వ్యక్తి ఆరు నెలలకు ఒకసారి హెల్త్ చెకప్ చేయించుకోవాలని తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకో వచ్చని ఆయన సూచించారు. పేదలు వైద్యం కోసం డబ్బులు ఖర్చు చేయలేరని రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద ఎత్తున నిధులను అందిస్తున్నట్లు చెప్పారు. సీ ఎం నాయకత్వం లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ రంగాలకు భారీగా నిధులను మంజూరు చేస్తున్నదని అన్నారు. రైతులకు రుణమాఫి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రెండు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ సిలెండర్, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, మహాళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు వంటి పథకాలు అమలవుతున్నాయని అన్నారు. మహిళలను కోటీశ్వరు లను చేయాలనే లక్ష్యంతో మహిళా సాధికార పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. సీ ఎం సహకారంతో వికారాబాద్ నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు అవుతున్నాయని రోడ్లు, భవనాల శాఖ ద్వారా 600 కోట్లు, పంచాయితీ రాజ్ శాఖ ద్వారా ఇప్పటికే 480కోట్ల రూపాయల నిధులు మంజూరు కాగా నూతనంగా మరో 53 కోట్లు నూతనంగా మంజూరైనట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో పదేళ్ళ రోడ్లకు నిధులు ఇవ్వలేదని దీంతో రోడ్లు అద్వానంగా తయారైనట్లు ఆరోపించారు. తాను అధికారంలోకి వచ్చాక రోడ్లను నిర్మించాలని ప్రత్యేక శ్రద్దతో పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేయించినట్లు చెప్పారు. ఆర్ అండ్ బి పంచాయితీ రాజ్ శాఖల ద్వారా మంజూరైన నిధులతో వచ్చే రెండేళ్లలో నియోజక వర్గంలోని అన్ని రోడ్లు అభివృద్ధి చెందనున్నాయని అన్నారు. వికారాబాద్ ప్రాంతానికి సాగునీరు అందించాలనే ఆశయంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ప్రాణహిత చేవెళ్ల, పాలమూరు రంగారెడ్డి పథకాల ద్వారా ప్రయత్నాలు చేశాను. ప్రాణహిత-చేవెళ్ల పథకంలో సుమారు 1500 కోట్ల రూపాయల పనులు కూడా అయ్యాయని అయితే గత ప్రభుత్వం పదేళ్ళు ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని పనులు జరుగలేదని అన్నారు. అనంతరం జూరాల నుండి నీళ్ళను తరలించే విదంగా సర్వేలు చేయించి జీఓ కూడా తీసుకువచ్చామని అన్నారు. ఈ పథకాన్ని కూడా గత ప్రభుత్వం పక్కన పెట్టి మన ప్రాంతానికి అన్యాయం చేసిందని ప్రస్తుతం పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నీళ్ళు కొడంగల్ సమీపం వరకు వస్తున్నాయని వికారాబాద్ కు కూడా ఇప్పించాలని కోరగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగీకారం తెలిపినట్లు చెప్పారు. సాగు నీళ్ళు వస్తే మన ప్రాంత రైతుల కష్టాలు తీరుతాయని అన్నారు. స్వర్గీయ మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిర్మించిన కోట్ పల్లి ప్రాజెక్టును తరువాత ఎవ్వరూ పట్టించుకోలేదని ప్రస్తుతం పూర్తి స్థాయిలో మరమ్మత్తుల కోసం తొంబై కోట్ల రూపాయలు మంజూరు చేయించానని తెలిపారు. పనులు చురుకుగా జరుగుతున్నాయని అన్నారు. అదేవిధంగా చెరువుల ఆధునికీకరణ, నూతన చెక్ డ్యాం నిర్మాణానికి నిధులను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతగిరిని రూ. 2,500 కోట్లతో పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా అయిదువేల నుండి పదివేల ఉద్యోగాల కల్పన జరుగుతుంది. స్థానికులకే ఉద్యోగాలు వస్తాయని అన్నారు.

## తెల్లాపూర్‌లో రూ.48 కోట్లతో ఆధునిక ప్రభుత్వ పాఠశాల

ఆగస్టు 17న భూమిపూజ..

ఎకరా స్థలంలో కేజీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యాబోధన..

పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య ఉచితంగా అందించడమే లక్ష్యం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి




**పటాన్చెరు, ఆగస్టు 13(నినాదం):** పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా తెల్లాపూర్‌లో రూ. 48 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్ (సి యు ఆర్ ఈ) పరిధిలోని తెల్లాపూర్‌లో ఎకరా విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే ప్రాంగణంలో విద్యాబోధన అందించనున్నట్లు వెల్లడించారు. గురువారం వివిధ శాఖల అధికారులతో కలిసి పాఠశాల నిర్మించనున్న తెల్లాపూర్‌లోని సర్వే నంబర్ 323, గద్దర్ విగ్రహం వెనుక ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. పాఠశాల నిర్మాణానికి సంబంధించిన స్థల పరిస్థితులు, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, నిర్మాణ ప్రణాళిక తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్యుత్తమ విద్య అందించాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. ఆర్థిక స్థోమతతో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థికి సమానమైన, నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలని అన్నారు. ఒకే ప్రాంగణంలో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యను అందించడం ద్వారా విద్యార్థులకు నిరంతర విద్యా వాతావరణం కల్పించవచ్చని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థుల సమగ్ర వికాసానికి అవసరమైన అన్ని సౌకర్యాలను పాఠశాలలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. విశాలమైన ఆటస్థలాలు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, అత్యాధునిక సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు, సమృద్ధిగా పుస్తకాలతో లైబ్రరీలు, ఇతర ఆధునిక విద్యా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకత వంటి అంశాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయనున్నట్లు చెప్పారు. పెరుగుతున్న జనాభా, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తెల్లాపూర్ ప్రాంతంలో ఆధునిక ప్రభుత్వ పాఠశాల అవసరం ఉందని, ఈ పాఠశాల అందుబాటులోకి వస్తే పరిసర ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వందలాది మంది విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఆగస్టు 17న నూతన ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వెల్లడించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను సూచించారు. తెల్లాపూర్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఈ పాఠశాల భవిష్యత్ తరాలకు విద్యా కేంద్రంగా నిలవడంతో పాటు, ప్రభుత్వ విద్యా రంగంలో నూతన ప్రమాణాలకు నాంది పలుకుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, సీనియర్ నాయకులు సోమిరెడ్డి, దేవేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భౌరంపేట్ శ్రీ దుర్గాదేవి ఆలయ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

అధ్యక్షునిగా వెంకట్రాం అనంతరెడ్డి



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 13 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ భౌరంపేట్ శ్రీ దుర్గాదేవి ఆలయ నూతన కమిటీని గురువారం గ్రామ నాయకులు, పెద్దలు, భక్తుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడిగా వెంకట్రామ్ ఆనంద్ రెడ్డిని ఎన్నుకున్నట్లు మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రకటనలో తెలిపారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షులుగా వి. సుభాష్ రెడ్డి, కె . సందీప్ చారి ని నియమించగా కోశాధికారిగా ఈ. లక్ష్మీకాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దుబ్బ విష్ణు, సంయుక్త కార్యదర్శిగా కె .నవీన్ చారి గారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా ఈ . కృష్ణ రెడ్డి, ఈ . జంగా రెడ్డి, జి . బుచ్చిరెడ్డి, ఎన్ . హన్మంత్ రెడ్డి, చింత వెంకటేష్, నామాల రాము, డి . మ హేష్, సి హెచ్ శ్రీకాంత్ రెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను గ్రామ పెద్దలు, నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గ్రామ పెద్దలు మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధి కోసం నూతన కమిటీ సభ్యులంతా ఐక్యంగా పనిచేస్తూ, గ్రామస్తులు, భక్తులను కలుపుకొని ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. ఎటువంటి భేదాభిప్రాయాలకు, బేషజాలకు తావులేకుండా అందరూ కలిసి పనిచేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, పెద్దలు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై యుఎస్‌పిసి రెండవ దశ పోరాటం

- టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటప్ప



**రాజేంద్రనగర్ , ఆగస్టు 13 ( నినాదం):** యు ఎస్ పి సి రెండవ దశ పోరాటం లో భాగంగా గురువారం గండిపేట మండలం తాసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అధికారి విక్రమ్ రెడ్డి కి మెమొరాండం అందజేశాం. ఈ సందర్భంగా టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటప్ప మాట్లాడుతూ... ఉపాధ్యాయ విద్యారంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలైన పీఆర్సీ ని వెంటనే అమలు చేయాలి, సిపిఎస్ ను రద్దు చేయాలి, ఈనెల ఆగస్టు 15 లోపు బదిలీలు పదోన్నతుల షెడ్యూల్ను వెంటనే విడుదల చేయాలని అన్నారు. మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు తక్షణమే యుపిఎస్ లో అమలు చేయాలని సర్వీస్ లో ఉన్న ఉపాధ్యాయులకు పూర్తిగా టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని అన్నారు. ప్రాథమిక పాఠశాలలకు గొడ్డలి పెట్టగా ఉన్న జీవోను 25న సవరించి 20 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలకు కనీసం ఇద్దరూ ఉపాధ్యాయులు నియమిస్తూ 50 మంది పైగా ఉన్న విద్యార్థులు ఉన్న దగ్గర ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా జీవోను మార్పు చేయాలన్నారు. వివో 2018 ప్రకారం ఉమ్మడి సర్వీస్ రూల్స్ ను రూపొందించి అర్హులైన ఉపాధ్యాయులకు ఎంఈఓ లు డిప్యూటీ ఈవోలు, జె ఎల్ ఎస్ డైట్ లెక్చరర్, బీఈడీ కళాశాలల అధ్యాపకులుగా పదోన్నతులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రమతో దోపిడికి గురవుతున్న కేజీబీవీ సిబ్బందికి ఎస్ ఎస్ ఏ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలన్నారు. అన్ని గురుకులాల పాఠశాలలో సమయ సారాన్ని ఒకే విధంగా ఉండేటట్లు చూడాలన్నారు. ఉపాధ్యాయులకు నైట్ డ్యూటీ లో నుండి మినహాయింపు నివ్వాలని కోరారు. ఈ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు టీఎస్ యుటిఎఫ్, ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ యూఎస్పిసి నిరంతరం పోరాటం చేస్తుందని అన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి పోరాట షెడ్యూల్ ఈనెల ఏడో తారీఖు ప్రతి పాఠశాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలపనున్నారు. ప్రభుత్వం స్పందించకపోతే కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కావున వెంటనే ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్, గండిపేట్ మండల అధ్యక్షుడు ఎండి మాజీ ప్రధాన కార్యదర్శి కె రవికుమార్, నాయకులు ఇందిరా, హనుమంతు, ప్రహ్లాద రావు, శ్రీనివాస్, విజయ్ కుమార్, కిషన్, శ్రీకాంత్, రామచంద్ర రావు, సునీల్ భాష, బిక్షపతి, మానయ్య తదితరులు పాల్గొన్నారు.

## అల్వాల్‌లో కనుల విందుగా తిరంగా భారీ ర్యాలీ



**అల్వాల్, ఆగస్టు 13 ( నినాదం):** బిజెపి అధిష్టానం పిలుపుమేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా అల్వాల్ బిజెపి నాయకులు గురువారం ప్రజలకు జాతీయ పతాకాలను ఉచిత పంపిణీ చేశారు. అల్వాల్ ప్రధాన రహదారి మీసేవ నుండి ఓల్డ్ అల్వాల్ ఐజి స్టార్ట్ వరకు భారీ హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. అల్వాల్ మెయిన్ రోడ్ నుండి ప్రధాన రహదారిపై భారీ త్రవర్ణ పథకాన్ని ప్రదర్శిస్తూ విద్యార్థులు పార్టీ శ్రేణులు దేశభక్తితో నినాదాలతో భారీగా సాగారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లు పి మాణిక్ రెడ్డి, శ్రీనివాస్ వర్మ, సీనియర్ నాయకులు మల్లికార్జున్ గౌడ్, కార్తీక్ గౌడ, రాజిరెడ్డి, సూర్య, కృష్ణారెడ్డి, అజయ్ రెడ్డి, అరవింద్ రెడ్డి, మురళి, మోయి సుజాత, కర్ణ శ్రీ, ఉదయ్, రామ్ సింగ్, ఆనంద్, జేఏసీ సురేందర్ రెడ్డి, వికె మహేష్, వినయ్, అనిల్, రాము, ఉదయ్, విష్ణుమూర్తి, పాల్గొన్నారు.

## విద్యారంగం అభివృద్ధికి చర్యలు చేపట్టాలి ఖాళీ పోస్టులను భర్తీలు చేయాలి



**కొడంగల్,ఆగస్టు13 (నినాదం):** విద్యా రంగంలో ఉన్న సమస్యలు పరిష్కారానికై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు గురువారం తాసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్నటువంటి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని దానితోపాటు విద్యారంగంలో ఖాళీగా ఉన్న డిఇఓ డిప్యూటీ డిఈఓ ఎంఈఓ మరియు బోధనేతర సిబ్బంది పోస్టులను భర్తీ చేసి విద్యారంగ అభివృద్ధికి సమూలమైన చర్యలు చేపట్టాలని లేఖలో పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు పనిభారం తగ్గించి, బోధనేతర పనులు తొలగించాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులైన తాగునీరు, విద్యుత్ సదుపాయం, తరగతి గదుల నిర్మాణం వంటి సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్, గుంజ వెంకటయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

# సిసి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

### పనులు ప్రారంభించిన కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 13 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డి నగర్ డివిజన్ లోని రంగారెడ్డి నగర్ లో రూ. 30 లక్షల అంచనా వ్యయంతో మంజూరైన అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. కాలనీల్లో రోడ్ల సమస్యను పరిష్కరించేందుకు రూ. 30 లక్షల నిధులు మంజూరు చేసి విడుదలకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ప్రజల ప్రాథమిక అవసరాలను పట్టించుకోకుండా, అనేక ప్రాంతాల్లో కనీస మౌలిక వసతుల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని కూన శ్రీశైలం గౌడ్ విమర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యతను గత పాలకులు విస్మరించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ, నిధులు మంజూరు చేస్తూ పనులను చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలోని కాలనీలు, బస్తీలలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా నిలవాలని, రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కూన శ్రీశైలం గౌడ్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మోతే శ్రీనివాస్ యాదవ్, జి రమేష్, బాలరాజు, రమేష్ మంజుల్కర్, కాజా బాయ్, తిమ్మయ్య, పురుషోత్తం, మాధవి, నయీమ్, ఆనంద్ గౌడ్, షకీర్, మల్లం శ్రీను, నారాయణ, రాకేష్, జ్ఞానేశ్వర్ రెడ్డి, తోకలా శ్రీనివాస్, శ్యామల, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు.



## హర్ ఘర్ తిరంగా ర్యాలీలో
# పారమిత ఎన్‌సీసీ కేడెట్లు


### త్రివర్ణ పతాకాలతో ర్యాలీగా వెళ్లి దేశభక్తిని చాటిన విద్యార్థులు



**కరీంనగర్, ఆగస్టు13(నినాదం)** జాతీయ గీతం 'వందే మాతరం' 150 సంవత్సరాల వేడుకల్లో భాగంగా హర్ ఘర్ తిరంగా–2026 కార్యక్రమాన్ని మంకమ్మతోటలోని పారమిత పాఠశాల ఎన్‌సీసీ కేడెట్లు ఘనంగా నిర్వహించారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాజీ తెలిపారు. పారమిత ఉన్నత పాఠశాల నుంచి మహాత్మా జ్యోతిరావ్ పూలే ప్రాంగణం వరకు సుమారు 100 మంది ఎన్‌సీసీ కేడెట్లు త్రివర్ణ పతాకాలు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. నగర వీధుల్లో 'వందే మాతరం' ఆలపిస్తూ, జాతీయ గీతం గొప్పతనాన్ని చాటుతూ దేశభక్తిని ప్రదర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న కేడెట్లను పాఠశాల అధినేత డా. ఇనుగంటి ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్‌రావు, వినోదరావు, వియు. యం. ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యా యులు ప్రశాంత్, బాలాజీ, కవిత ప్రసాద్, సమన్వయకర్తలు శ్రీనాథ్, చంద్రసేన, ఎన్‌సీసీ అధికారి ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొని కేడెట్లను అభినందించారు.

# గోశాలకు రూ.40 వేల పశుగ్రాసం సాయం

### మూగజీవాల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత: గోశాల నిర్వాహకులు



**కరీంనగర్, ఆగస్టు13(నినాదం)** గిరిజా గోశాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మృత్యుంజయ మహాదేవాలయం గోశాల వ్యవస్థాపక చైర్మన్ పురాణం మహేశ్వరి శర్మ సారథ్యంలో నిర్వహిస్తున్న గోశాలకు పశు గ్రాసం కోసం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రూ. 40 వేల ఆర్థిక సహాయం అందించారు. పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు నల్ల లింగారెడ్డి తన శాఖ నిర్వహణ నుంచి రూ. 40 వేల చెక్కును గోశాల నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, గోశాల కార్యదర్శి చల్ల మోహన్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి సంఘ్యం లక్ష్మణరావు, పశుసంవర్ధక శాఖ మంత్రిత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోశాల నిర్వాహకులు మాట్లాడుతూ మూగజీవాల సంరక్షణకు ఆర్థిక సహాయం అందించిన నల్ల లింగారెడ్డి, పశు సంవర్ధక శాఖ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. గోవులు పాలు, సేంద్రియ ఎరువు ద్వారా రైతులకు, వ్యవసాయానికి, సమాజానికి ఎంతో మేలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆహారం, నీరు, వైద్యం, ఆశ్రయం కల్పిస్తూ మూగజీవాలను సంరక్షించడం మానవతా సేవతో సమానమని అన్నారు. గోవులు, మూగజీవాల సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని, గోశాల నిర్వహణకు పశుగ్రాసం, వైద్యం తదితర అవసరాల కోసం దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

# మెడికవర్‌లో ప్రతినెల రెండో గురువారం ఉచిత క్యాన్సర్ శిబిరం

### తొలి శిబిరంలో 186 మందికి పరీక్షలు.. 26 మందికి క్యాన్సర్ నిర్ధారణ.

### మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు డాక్టర్ అన్వేష్, డాక్టర్ నీలేష్, డాక్టర్ స్నేహ




**కరీంనగర్, ఆగస్టు13(నినాదం):** క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్సతో వ్యాధిని సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుందని హైదరాబాద్ మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు డాక్టర్ అన్వేష్, డాక్టర్ నీలేష్, డాక్టర్ స్నేహ తెలిపారు. కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన ఉచిత క్యాన్సర్ పరీక్షల శిబిరానికి 186 మంది హాజరై వివిధ పరీక్షలు చేయించుకోగా, 26 మందికి క్యాన్సర్ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు వైద్యులు వెల్లడించారు. క్యాన్సర్ కేసుల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఇకపై ప్రతి నెల రెండో గురువారం ఉచిత క్యాన్సర్ పరీక్షల శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వైద్యులు మాట్లాడుతూ కరీంనగర్‌లో ముఖ్యంగా రొమ్ము క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయని పేర్కొన్నారు. లక్షణాలు బయటపడకముందే పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని తొలిదశలో గుర్తించి సకాలంలో చికిత్స అందించవచ్చన్నారు. వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే దశ పెరిగే కొద్దీ చికిత్స క్లిష్టతరమవుతుందని హెచ్చరించారు. ఊబకాయాన్ని నియంత్రించుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక సమస్యలను ముందుగానే గుర్తించవచ్చన్నారు. ప్రజలు ఉచిత శిబిరాలను సద్వినియోగం చేసుకుని ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మెడికవర్ కేంద్రం అధిపతి గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ కేంద్రం అధిపతి సంపత్, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, ప్రజా సంబంధాల అధికారి అబ్దుల్ వకీల్ తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే అభివృద్ధి పనులకు స్థల పరిశీలన



**జమ్మికుంట, ఆగస్టు 13 (నినాదం):** దక్షిణ మధ్య రైల్వే సంస్థ ఆధ్వర్యంలో రైల్వే లైన్ విస్తరణ అభివృద్ధిలో భాగంగా లెవెల్ క్రాసింగ్ లైన్ ల వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి అండర్ బ్రిడ్జి ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా మడిపల్లి, పాపయ్యపల్లి గ్రామాల మధ్య నిర్మించే రోడ్డు ఓవర్ బ్రిడ్జి పనుల కొరకు పరిశీలన చేయడం జరిగింది. రెండు గ్రామాల ప్రజలకు నిర్మించబోయే విధానాలను గురించి వివరించడంతోపాటు వారి సూచనలు సలహాలు తీసుకున్నారు. కార్యక్రమంలో హుజరాబాద్ ఆర్డిఓ జల కుమారి, తాసిల్దార్ సుధాకర్, ఆర్ ఐ శంకరయ్య సత్యనారాయణ, తో పాటు పంచాయతీ డిపార్ట్మెంట్ మిషన్ భగీరథ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురి అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

## రూ.117 కోట్ల పుష్కర నిధుల్లో రూ.37 కోట్లు ధర్మపురికే: మంత్రి లక్ష్మణ్‌కుమార్

**ధర్మపురి ఆగష్టు 13 ( నినాదం ):** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ధర్మపురి క్షేత్ర సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు భవిష్యత్తులో చేపట్టనున్న కార్యక్రమాలతో ధర్మపురి క్షేత్రం రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని తెలిపారు. గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. గురువారం ధర్మపురి మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో అంబేద్కర్ భవన నిర్మాణ పనులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల సమయంలో పట్టణంలోని వివిధ కుల సంఘాల భవనాల నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని ఇచ్చిన హామీ మేరకు పనులు చేపడుతున్నామని తెలిపారు.

**విద్యార్థులకు ఉపయోగపడేలా భవనం**

ధర్మపురిలో నిర్మిస్తున్న అంబేద్కర్ భవనం భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్దనున్నట్లు మంత్రి తెలిపారు. భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసి, తద్వారా వచ్చే ఆదాయాన్ని భవనం నిర్వహణకు ఉపయోగించుకునేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వివరించారు. మరో రెండు అంతస్తుల్లో విద్యార్థుల



చదువుకు అవసరమైన సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు.

**రూ. 37 కోట్లతో పుష్కర పనులు**

ధర్మపురి క్షేత్ర అభివృద్ధిని ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యంతో చేపడుతోందని మంత్రి పేర్కొన్నారు. గోదావరి పుష్కరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 117 కోట్లు కేటాయించిందని, అందులో ధర్మపురి క్షేత్రంలో వివిధ అభివృద్ధి పనులకు రూ. 37 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు క్షేత్ర అభివృద్ధికి అవసరమైన శాశ్వత పనులను చేపడుతున్నట్లు చెప్పారు.

**మరిన్ని నిధులతో అభివృద్ధి**

పుష్కరాల నిధులతో పాటు టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ. 15 కోట్ల నిధులు సమకూర్చి ధర్మపురిలో అభివృద్ధి పనులు కొనసాగిస్తామని మంత్రి వెల్లడించారు. అమృత్ పథకం ద్వారా కూడా అదనపు నిధులు సాధించి పట్టణంలో మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు. భక్తుల సౌకర్యాలు, పట్టణ అభివృద్ధి, క్షేత్ర ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు.

**భక్తులకు మెరుగైన సౌకర్యాలు**

ధర్మపురి క్షేత్రానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా క్షేత్రాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో ధర్మపురిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని, రాబోయే రోజుల్లో వీటి ఫలితంగా ధర్మపురి పట్టణంతో పాటు క్షేత్రం రూపురేఖలు గణనీయంగా మారనున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్,ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, ధర్మపురి మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తిమ్మాపూర్ ఖండ శతాబ్ది ఉత్సవాల యువ సమ్మేళనం

### దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలి: ఆర్ఎస్ఎస్ వక్తలు

**కరీంనగర్, ఆగస్టు13(నినాదం):** ఆర్ఎస్ఎస్ తిమ్మాపూర్ ఖండ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా కొత్తపల్లిలోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన యువ సమ్మేళనం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ భాను చందర్, తడగొప్పుల శంకరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు యువతే బలమైన పునాది అని, క్రమశిక్షణ, దేశభక్తి, అంకితభావంతో దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యతో పాటు సమయపాలన, నాయకత్వ లక్షణాలు, ధైర్యంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, అయితే ఆందోళనలు ప్రజాస్వామ్య నిబంధనల పరిధిలోనే జరగాలని అన్నారు. ఇటీవల



యువత చేపట్టిన ఆందోళనలను ఆసరాగా చేసుకుని దేశ వ్యతిరేక శక్తులు అలజడులు సృష్టించే అవకాశం ఉన్నందున యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా సమాజమంతా ఒక్కటేననే భావనను యువత పెంపొందించుకోవాలని, యోగా, వ్యాయామం, బౌద్ధిక చర్చలను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నివారణ, రక్తదానం వంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచి, దేశ నిర్మాణాత్మక కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో యువ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ తిమ్మాపూర్ ఖండ కార్యవాహ ఆవుల కుమార్, సహకార్యవాహ మురళి, రమణ, కన్నం సాయి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా విద్యాబోధన కొనసాగించాలి

### అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ మరమ్మతులు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్, ఆగస్టు13(నినాదం):** విద్యార్థుల విద్యకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశిం చారు. గురువారం ముక్రాంపురంలోని ఓల్డ్ హైస్కూల్ ప్రాంగణంలోని సమీకృత బాలుర వసతి గృహాన్ని, డాక్టర్ స్ట్రీట్‌లోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆమె పరిశీలిం చారు. అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో లీకేజీలు, వంటశాల షెడ్డు, తాగునీరు, మరుగుదొడ్లకు సంబంధించిన సమస్యలను గుర్తించిన కలెక్టర్ వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారు లను ఆదేశించారు. విద్యార్థులకు అనుకూ లమైన వాతావరణం కల్పించేలా అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచాలని సూచించారు. మరమ్మతులు పూర్తయ్యే వరకు పాఠశాల విద్యార్థులను ముక్రాంపురంలోని సమీకృత బాలుర వసతి గృహానికి తరలించి, అక్కడే వసతి, భోజనం, తరగతుల నిర్వహణ కొనసాగించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, భోజనం తదితర సౌకర్యాలు



కల్పించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. మరమ్మతులు పూర్తైన వెంటనే విద్యార్థులను తిరిగి పాఠశాలకు తరలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సమన్వయకర్తలు అశోక్‌రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేపై వ్యక్తిగత విమర్శలు తగవు.. కౌశిక్‌రెడ్డికి అండగా మేమున్నాం..

### నిజాలు మాట్లాడితే విమర్శించడం సరికాదు: మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్

**జమ్మికుంట, ఆగస్టు 13 (నినాదం) :** హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై కాంగ్రెస్ పార్టీ నేతలు వ్యక్తిగత విమర్శ చేయడం సరైన పద్ధతి కాదని నిజాలు మాట్లాడితే దుష్ప్రచారాలు చేయడం దిక్కుమాలిన చర్య అని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ వైస్ చైర్మన్ అన్నారు. గురువారం జమ్మికుంటలో ఏర్పాటు చేస్తే మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, కమలాపూర్‌లో నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని రాజకీయ విమర్శలకు వేదికగా మార్చి హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ మున్సిపల్ వైస్ చైర్మన్ జావేద్ సంయుక్తంగా ఖండించారు. కమలాపూర్ సభలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందనే వాస్తవాన్ని మాత్రమే ప్రస్తావించారని తెలిపారు. అదేవిధంగా కమలాపూర్‌లో ఉప్పల్ మండలంగా ప్రకటించాలని ప్రజల తరఫున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఈ అంశాలను వక్రీకరించి వ్యక్తిగత విమర్శలకు దిగడం సరైన రాజకీయ సంస్కృతి కాదన్నారు. ఎమ్మెల్యే ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారని,



రైతులు, యువత, మహిళలు, దళితులు, బీసీలు, అభి వృద్ధి, సాగునీరు, నిధులు, విద్య, వైద్యం తదితర అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ప్రజల గొంతుకగా వ్యవహరిస్తున్నారని కొనియాడారు. రాజకీయంగా ఎదుర్కోలేక కొందరు కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారాలు, వ్యక్తిగత ఆరోపణలు, సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రజా ప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకుని ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అవసరం ఉంద న్నారు. ప్రజల మద్దతుతో పనిచేస్తున్న నాయకులను వ్యక్తిగతంగా కించ పరచే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజాస్వామ్యంలో అంతి మ తీర్పు ప్రజలదేనని పేర్కొన్నారు. రాజకీయాల్లో పరస్పర గౌరవం, హుందాతనం పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.

**దేశిని కోటి నోరు అదుపులో పెట్టుకో: వైస్ చైర్మన్ జావేద్**

ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జావేద్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నేత దేశిని కోటికీ లేదని నిజాలు తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవలేని నీవు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పై నోరు జారితే నియోజకవర్గంలో తిరుగనీయమని ఆయన హెచ్చరించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ఏర్పడేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని తెలిపారు. ఇంకొకసారి ఎమ్మెల్యే పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని జావేద్ హెచ్చరించారు.

# వావిలాలలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**జమ్మికుంట, ఆగస్టు 13 (నినాదం):** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకుహర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జమ్మికుంట బీజేపీ మండల అధ్యక్షుడు దొంతరవేన రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో జమ్మికుంట మండలం వావిలాల గ్రామంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో దాదాపు 200 మంది విద్యార్థి,విద్యార్థినిలతో కలిసి గ్రామ ప్రజలతో కలిసినాయకులు ,కార్యకర్తలతో అందరితో కలిసి హర్ ఘర్ తిరంగా ర్యాలీని వావిలాల గ్రామంలో ర్యాలీని నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జాతీయ జెండా కేవలం మూడు రంగుల వస్త్రం కాదని ఇది మన స్వతంత్ర పోరాటానికి ప్రతీక మన దేశ ఐక్యతకు చిహ్నం కోట్లాది భారతీయుల ఆత్మగౌరవానికి ప్రతిరూపమని అన్నారు. జాతీయ జెండాను ప్రతి ఒక్కరు గౌరవించాలని ప్రతి ఒక్కరిలో దేశభక్తి పెంపొందించే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు జమ్మికుంట మండల బిజెపి ఇంచార్జ్ పుప్పాల రఘు, మాజీ జమ్మికుంట మండలాధ్యక్షులు సంపెల్లి సంపత్ రావు, వావిలాల బూత్ అధ్యక్షులు మేడిపల్లి సమ్మయ్య, పాపక్కపల్లె బూత్అధ్యక్షులు మేరుగు శ్రీనివాస్, వావిలాల బిజెపి సీనియర్ నాయకులు వీరగొని రాజయ్య, బిజెపి జమ్మికుంట మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు కంకణాల స్వరూప రాణి, గోపాలపురం బూత్ అధ్యక్షులు రమణాకర్ రెడ్డి గారు,



మాజీ సర్పంచ్ బండారి తిరుపతి, బిజెపి సీనియర్ నాయకులు వీర్ల సాంబమూర్తి, బండారి బాలు, తోడేటి శ్రీనివాస్, బాసాని సత్తయ్య పోల్సాని పురుషోత్తం రావు, అంకుశపురం గ్రామ సర్పంచ్ కావిడి కుమార స్వామి, తిరుపతి, చెట్టి హరీష్, మహేందర్, కంకణాల శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ సంపత్, లింగారావు గౌడుగు అంజి, జమ్మికుంట మండల ప్రధాన కార్యదర్శి పూల్లూరు ఈశ్వర్ , పాపక్కపల్లె వార్డ్ మెంబర్ అడ్డాల రవళి – తిరుపతి,పాపక్కపల్లె లింగాల రమేష్ పుట్టకోకుల కుమార్ సురేందర్, విజేందర్, బాలరాజు వెలుపల మధునయ్య, రుద్రవరం శివానంద చారి, మడిపల్లి విక్రం, మొగుల మొగిలి, పాల్గొన్నారు.

## కోరపల్లి పాఠశాలలో బోనాల వేడుకలు



**జమ్మికుంట, ఆగస్టు 13 (నినాదం)** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను విద్యార్థులకు తెలిసే విధంగా జమ్మికుంట మండలంలోని కోరపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బోనాల ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోతరాజుల వేషాలతో పాటు అమ్మవారి అలంకరణలతో బోనాల నెత్తిన పెట్టుకొని పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రవీందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు తెలుసుకొని పెద్దలను గౌరవించడంతోపాటు ఆ పండగలను భవిష్యత్తులో అత్యంత ఘనంగా జరపాలనే ఉద్దేశంతో పాఠ్య పుస్తకాలతో సమానంగా సంస్కృతి గురించి కూడా బోధించడం జరుగుతుందని వెల్లడించారు.

# వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్లు కూడా ఇవ్వాల్సిందే..!

### బీజేపీ సీనియర్ నాయకులు మట్ట పవన్ రెడ్డి



**జమ్మికుంట, ఆగస్టు 13 (నినాదం):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన 420 హామీలలో భాగంగా వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్లను కూడా వెంటనే అమలు చేయాలని ఇల్లందకుంట మండల బీజేపీ సీనియర్ నాయకులు మట్ట పవన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో గత ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల పెన్షన్లను పెంచి ఇస్తామని హామీ ఇచ్చిందని, కానీ రెండున్నరేళ్లు గడిచినా పెన్షన్ల పెంపుపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకుండా ప్రజలను మభ్యపెడుతోం దని పవన్ రెడ్డి విమర్శించారు. ముఖ్యంగా వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్ల విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం తీవ్ర అన్యాయమని అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రకటించిన నేపథ్యంలో మీ–సేవ కేంద్రాలకు వెళ్లిన వృద్ధులు, బీడీ కార్మికులకు సంబంధించి దరఖాస్తు చేసుకునే ఆప్షన్ సైట్‌లో కనిపించడం లేదని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌లో కూడా వృద్ధాప్య, బీడీ కార్మికుల వివరాల నమోదు కోసం ప్రత్యేకంగా ఎలాంటి కాలమ్ లేకపోవడం అనుమానాలకు తావిస్తోంద న్నారు. వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారా? లేదా? సైట్‌లో ఆప్షన్ కనిపించకపోవడానికి ఏమైనా సాంకేతిక సమస్య ఉందా? అనే విషయాలపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని మట్ట పవన్ రెడ్డి డిమాండ్ చేశారు. అలాగే ఆగస్టు 15 నుంచి పెన్షన్లను పెంచి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో, వృద్ధులు, బీడీ కార్మికులకు కూడా పెంచిన పెన్షన్‌ను అందించాలని కోరారు. హామీలను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## మెరుగైన విద్యుత్ అందించాలని
# అధికారులకు వినతి



**జమ్మికుంట, ఆగస్టు 13 (నినాదం) :** జమ్మికుంట మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల గోవిందపూర్ వాగును ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రస్తుతం ఓవర్‌లోడ్ సమస్యను ఎదుర్కొంటోంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా పరిసర ప్రాంతాల్లోని రైతుల వ్యవసాయ బావులకు సంబంధించిన మోటార్లు నడుస్తుండటంతో రైతులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆ సమస్యను పరిష్కరించాలని విద్యుత్ అధికారులకు వినతి పత్రం అందించిన మూడో వార్డు సభ్యులు బండారి ప్రశాంత్. ఈ సమస్యను గుర్తించిన వెంకటేశ్వర్లపల్లి గ్రామపంచాయతీ 3వ వార్డు మెంబర్ బండారి ప్రశాంత్, జమ్మికుంట విద్యుత్ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ అవసరాలకు సరిపడే సామర్థ్యం కలిగిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు. దీనిపై స్పందించిన విద్యుత్ అధికారులు సమస్యను అతి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని ప్రశాంత్ పేర్కొన్నారు.

# రైతులు వరి వేసుకోకండి.. నష్టపోకండి

• జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి ఆగస్టు 13 (నినాదం):** ఖరీఫ్ సీజన్ సమయం ముగిసినందున జిల్లాలోని రైతులు ఎట్టి పరిస్థితులలో వరి వేయవద్దని, వరి వేస్తే నష్టపోవాల్సి వస్తుందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ నల్గొండ జిల్లా, తిప్పర్తి మండల కేంద్రం శివారులో వరి సాగుకు భూములు సిద్ధం చేసుకుంటున్న రైతులు మోహన్, పరశురాం, ఖాదర్ తదితరులతో మాట్లాడారు. వరి పంటకు సాగునీటి అవకాశాలే లేవని, అలాంటప్పుడు వరి ఎందుకు వేస్తున్నారని జిల్లా కలెక్టర్ ప్రశ్నించారు. బలవంతంగా వరి సాగు చేస్తే నష్ట పోవలసి వస్తుందని రైతులతో చెప్పారు. ఆరతడి పంటలు వేసుకుంటే నష్టం లేకుండా, ఆదాయం వస్తుందని తెలియజేస్తూ ఆరుతడి పంటలపై అవగాహన కల్పించారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఈ సంవత్సరం వర్షాలు కురిసే అవకాశం లేదని, వచ్చే ఖరీఫ్ సీజన్ వరకు వర్షాలు కురిసే అవకాశం లేనందున ప్రస్తుతం వరి వేసుకునేందుకు పరిస్థితులు అనుకూలంగా లేవని, అంతేకాక ప్రాజెక్టుల నుండి కూడా సాగునీరు వచ్చే అవకాశం లేదని, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నుండి కూడా సాగునీరు రాదని, వర్షం లేకపోవడం, ప్రాజెక్టుల ద్వారా సాగునీరు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లలో నీరు తగ్గిపోయిందని తెలిపారు. తిప్పర్తి మండల కేంద్రం శివారులో చౌడు భూముల్లో రైతులు వరి పంటకు సిద్ధం చేయడాన్ని గమనించిన కలెక్టర్ చౌడు భూముల్లో మినుములు, పెసర వంటి పంటలు వేసుకోవాలని, మినుము, పెసర పంటలకు పెట్టుబడి తక్కువని, ఎకరాకు 8000 చొప్పున ఆదాయం వస్తుందని, అదే వరి పంటకు పెట్టుబడి ఎక్కువని, పొరపాటున నీళ్లు లేక, వర్షం రాక పెట్టిన పెట్టుబడి కూడా రాక రైతు అప్పుల పాలు కావాల్సి వస్తుందని అన్నారు. చవుడు భూములలో జిప్సం వేసుకున్నట్లయితే మినుము, పెసర పంటల లాంటివి సులభంగా తీసుకోవచ్చని, అంతేకాక చౌడు నెలల్లో రేగు, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటలు కూడా వేసుకునేందుకు అవకాశం ఉందని, ఈ దిశగా రైతులు ఆలోచించి ఆరుతడి పంటలు ,ఉద్యాన పంటలు వేసుకునేలా చూడాల్సిందిగా ఆయన వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఇందుకు జిల్లా కలెక్టర్ స్పందిస్తూ యూరియా ఇండెంట్ పంపాల్సిందిగా జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ . వ్యవసాయ సహాయ సంచాలకులు విజయేందర్ రెడ్డి, సన్నీ రాజ్, గిరిరాజు ,ఏవో శ్రీనివాస్, ఏ ఈ ఓ సంతోషి, తదితరులు ఉన్నారు.

## శ్రావణ మాస ఉత్సవాలకు ముస్తాబైన కోటగుళ్లు



• ఆలయంలో నెల రోజులపాటు ఉత్సవాలు
• ప్రతి శ్రావణ శుక్ర, సోమవారాల్లో స్వామివారికి ప్రత్యేక అలంకరణ
• ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్న కోటగుళ్ల పరిరక్షణ కమిటీ

**భూపాలపల్లి, ఆగస్టు 13 (నినాదం) :** భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండలం లో ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణ పేశ్వరాలయం కోటగుళ్లు దేవాలయం శ్రావణమాస ఉత్సవాలకు ముస్తాబయింది. ఆగస్టు 13 గురువారం నుండి శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభం కాగా సెప్టెంబర్ 11 వరకు నెల రోజులపాటు ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ప్రతి శుక్రవారం, సోమవారాల్లో స్వామివారికి పట్టు వస్త్రాలతో ప్రత్యేక అలంకరణ, గోశాల గోమాతలకు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అదేవిధంగా శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చే భక్తులకు కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు.

## చేనేత సహకార సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల



**మిర్యాలగూడ ఆగస్టు 13( నినాదం):** మిర్యాలగూడ చేనేత సహకార సంఘం పాలకమండలి ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్‌ను గురువారం ఏఓ (అసిస్టెంట్ ఆఫీసర్) అధికారికంగా విడుదల చేశారు. ఏఓ గారి చేతుల మీదుగా నోటిఫికేషన్ విడుదల కావడంతో ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లైంది. ఈ కార్యక్రమంలో ఏఓతో పాటు చేనేత సహకార సంఘం మేనేజర్, ప్రస్తుత (పాత) పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చేనేత సంఘం సభ్యులు ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

## తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బోనాలు

• ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ ఆగస్టు 13( నినాదం):** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రత్యేక శ్రవణ మాస బోనాల ఉత్సవాలు అని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారంమిర్యాలగూడ మండలం తకెళ్లపాడు గ్రామంలో నిర్వహించిన శ్రావణ మాస బోనాల మహోత్సవంలో పాల్గొన్నారు. తొలుత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం మాట్లాడుతూశ్రావణ మాస బోనాల మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించిన గ్రామ ప్రజలకు, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.గ్రామంలో ఆధ్యాత్మికత, ఐక్యత, సాంస్కృతిక సంప్రదాయాలను కొనసాగిస్తూ ఇలాంటి పండుగలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో తక్కెళ్ళపాడు గ్రామ సర్పంచ్ సిహెచ్ సుజాత జానయ్య, యాద్గార్పల్లి సర్పంచ్ జొన్నలగడ్డ శ్రీనివాస్ రెడ్డి, డిసిసి కార్యదర్శి చిలుకూరు బాలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కొప్పుల సైదులు, మండల పార్టీ అధ్యక్షులు గుండు నరేందర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు గాయం ఉపేందర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, బంటు శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు ప్రోత్సాహాన్ని అందించాలి



ఎమ్మెల్యే సతీమణి మాధవి

**మిర్యాలగూడ ఆగస్టు 13 (నినాదం):** ప్రభుత్వ పాఠశాలలకు ప్రోత్సాహం అందించాలని ఎమ్మెల్యే సతీమణి మాధవి అన్నారు. గురువారం మిర్యాలగూడ మండలం ఉట్లపల్లి గ్రామం లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గ్రామ మాజీ సర్పంచ్ మేడ సురేందర్ రెడ్డి సుచరిత దంపతుల సహకారంతో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన ప్లేట్లు, పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి సతీమణి మాధవి, కుమారుడు సాయి ప్రసన్న రెడ్డి పాల్గొనడం జరిగింది. వారు మాట్లాడుతూ గ్రామంలో గ్రామ అభివృద్ధికి మా నుండి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా తప్పక చేయడం జరుగుతుందని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటామని తెలిపారు. దాత మేడ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ,... గ్రామ అభివృద్ధికి తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు . అలాగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే సతీమణి మాధవి మరియు కుమారుడు సాయి ప్రసన్నారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సలీమా, గ్రామ కార్యదర్శి రాధ, వార్డు సబ్యులు జానయ్య, అయోధ్య, లక్ష్మమ్మ, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు బట్టు వెంకన్న, షాబుద్దీన్, బొంగరాల కిరణ్, బొప్పిడి శ్రీనివాస్ రెడ్డి, సంజీవ, ప్రసాద్, వీరబాబు, మేధా ఫౌండేషన్ ఫౌండర్స్ నాగరాజు, వేణు, మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గతంలో డ్రా తీసిన వాళ్లకే డబల్ బెడ్ రూమ్ ఇండ్లు

పట్టణ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్



**నల్గొండ ప్రతినిధి ఆగస్టు 13 (నినాదం):** ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసంపూర్తిగా ఉన్న ఎలక్ట్రికల్, వాటర్ సప్లై, డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసింది నల్లగొండ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గతంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించి లాటరీ తీసి లబ్ధిదారులను ఎంపిక చేశారని తెలిపారు. డ్రా తీసిన తర్వాత మిగిలిన ఇండ్లకు గతంలో దరఖాస్తు చేసుకున్న వారితో పాటు ప్రజావాణి మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి ప్రజా దర్బారులో వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించి నిరుపేదలకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించి కొంతమంది దళారులు కావాలని ఆరోపణలు చేస్తున్నారు. వారి మాటలు ఎవరూ నమ్మవద్దు అన్నారు. పనులన్నింటినీ పూర్తి చేసి డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు అతి త్వరలో కేటాయించడం జరుగుతుంది.

# తలకు గాయమైతే నిర్లక్ష్యం వద్దు..

• యశోదా ఆసుపత్రి వైద్యుల అత్యవసర చికిత్సతో 14 ఏళ్ల బాలుడికి పునర్జన్మ



**కోదాడ,ఆగస్టు 13(నినాదం):** రోడ్డు ప్రమాదంలో తలకు గాయమైనప్పుడు బయటకు గాయం కనిపించకపోయినా నిర్లక్ష్యం చేయొద్దని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పుర్రె లోపల రక్తస్రావం జరిగి మెదడుపై ఒత్తిడి పెరిగితే ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని తెలిపారు. కోదాడకు చెందిన 14 ఏళ్ల మల్లెబోయిన తేజ దురాజ్‌పల్లి సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయాడు. మూర్ఛ రావడంతో మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించగా.. పరీక్షల్లో పుర్రె లోపల భారీగా రక్తం పేరుకుపోయి మెదడుపై తీవ్ర ఒత్తిడి ఏర్పడినట్లు వైద్యులు గుర్తించారు. మెదడు సహజ స్థానంలో నుంచి పక్కకు జరిగినట్లు నిర్ధారించారు. పక్కటెముక విరగడంతో ఊపిరితిత్తి చుట్టూ గాలి చేరినట్లు గుర్తించారు. డా. శ్రీనివాస్ బొట్ల నేతృత్వంలోని వైద్యబృందం అత్యవసరంగా క్రానియోటమీ చేసి మెదడుపై ఒత్తిడి కలిగిస్తున్న రక్తాన్ని తొలగించింది. దెబ్బతిన్న పుర్రె ఎముకను టైటానియం ప్లేట్లు, స్క్రూలతో పునర్నిర్మించారు. ఊపిరితిత్తి సమస్యకు చికిత్సతో పాటు శ్వాసమార్గ నిర్వహణ కోసం ట్రాకియోస్టమీ చేశారు. న్యూరోసర్జరీ, క్రిటికల్ కేర్, కార్డియోథొరాసిక్, పీడియాట్రిక్స్ విభాగాల వైద్యులు సమన్వయంతో చికిత్స అందించి బాలుడి ప్రాణాలను కాపాడారు.

**ప్రతి నిమిషం కీలకం**

ప్రమాదం తర్వాత స్పృహ కోల్పోవడం, మూర్ఛ, అసాధారణ మగత, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి తరలించాలని డా. శ్రీనివాస్ బొట్ల సూచించారు. సకాలంలో పరీక్షలు, అత్యవసర న్యూరోసర్జరీ అందితే శాశ్వత మెదడు నష్టాన్ని నివారించవచ్చని యశోదా మలక్‌పేట్ ఆసుపత్రి అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. శ్రీనివాస్ బొట్ల (న్యూరోసర్జన్), వాసుకిరణ్ రెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రకాష్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగసాగర్



**భూపాలపల్లి ప్రతినిధి, ఆగస్టు 13 (నినాదం):** గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి అని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగసాగర్ సూచించారు. గురువారం మేడిపల్లి, మహదేవ్‌పూర్, కాళేశ్వరం ఆశ్రమ ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థుల విద్యా ప్రమాణాలు, వసతులు, పాఠశాలల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా బాలికల పాఠశాలల్లో విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, భోజనం, వసతులు, పాఠశాలలో ఎదురవుతున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. మహదేవ్‌పూర్ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన డీటీడీఓ భోజన నాణ్యత, అమలు చేస్తున్న కామన్ మెనూపై విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మూడు పాఠశాలల్లో కామన్ మెనూ సక్రమంగా అమలు అవుతున్నట్లు, ఉపాధ్యాయులు రూపొందించిన లెసన్ ప్లాన్స్ సంతృప్తికరంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల మధ్య సమన్వయం బాగుందని, పాఠశాలల్లో సానుకూల వాతావరణం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడిన సందర్భంగా వారి నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని విద్యార్థులు అందరు సంతోషంగా ఉన్నట్లు గుర్తించినట్లు డీటీడీఓ నాగసాగర్ తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన భోజనం, వసతులు అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు.



# వెదురు సాగుతో అధిక లాభాలు

• జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి ప్రతినిధి, ఆగస్టు 13(నినాదం):** రైతులు సంప్రదాయ వ్యవసాయంతో పాటు వెదురు సాగును చేపట్టి అదనపు ఆదాయాన్ని పొందవచ్చని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. గురువారం మహాదేవపూర్ మండలం సూరారం గ్రామంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పెంచుతున్న వెదురు మొక్కల నర్సరీని జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నర్సరీలో మొక్కల పెంపకం, నిర్వహణ, పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెదురు సాగు తక్కువ నిర్వహణ ఖర్చుతో దీర్ఘకాలికంగా లాభాలను అందించే ఆదాయ వనరుగా నిలుస్తుందని తెలిపారు. రైతులు వెదురు సాగును ప్రత్యామ్నాయ ఆదాయ మార్గంగా చేపట్టి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని ఆరు మండలాల్లో వెదురు మొక్కల పెంపకం కొనసాగుతోందని, సుమారు 70 వేల వెదురు మొక్కలు రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే 1,200 మంది రైతులను వెదురు సాగు కోసం గుర్తించినట్లు, 15 కుంటల భూమికి ఒక్కో రైతుకు 60 వెదురు మొక్కలను ఉచితంగా అందజేయనున్నట్లు వెల్లడించారు. వెదురు సాగు చేపట్టిన రైతులకు వివిజి రాంజీ పథకం ద్వారా నిర్వహణ ఖర్చులను కూడా ప్రభుత్వం చెల్లించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ప్రభుత్వం వెదురు సాగును ప్రత్యేకంగా ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. అనంతరం నర్సరీని సమర్థవంతంగా నిర్వహిస్తున్న గ్రామ సంఘం అధ్యక్షురాలిని జిల్లా కలెక్టర్ అభినందించారు. నర్సరీ నిర్వహణలో మహిళా సంఘాల భాగస్వామ్యాన్ని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి బాలకృష్ణ, కాటారం ఆర్డీఓ రవీందర్, ఇండస్ట్రీ ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్ తాండ్ర సురేష్, స్థానిక సర్పంచ్, గ్రామీణ అభివృద్ధి సంస్థ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఆధ్వర్యంలో సామాజిక చైతన్యం, మానవత్వం

జిఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి

ఆగస్టు 14 నుండి 16 వరకు నిర్వహించనున్నట్లు వెల్లడి



**భూపాలపల్లి ఆగస్టు 13( నినాదం):** సామాజిక చైతన్యం, మానవత్వం, మానవతా విలువలు, మహనీయుల ఆశయాలను ప్రజలలోకి తీసుకువెళ్లే ఉద్దేశంతో సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో మూడు రోజులు సామాజిక చైతన్య నాటకోత్సవాలను నిర్వహించినట్లు ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ నాటక ఉత్సవాలు ఆగస్టు 14 నుండి 16 వరకు ప్రతిరోజు సాయంత్రం 6 గంటల 30 నిమిషాలకు స్థానిక కృష్ణ కాలనీ సి ఈ ఆర్ క్లబ్ మినీ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన తెలిపారు. ఇందులో భాగంగా ఆగస్టు 14న డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ జీవితం, ఆశయాలు, లక్ష్యాలను ప్రతిబింబించేలా “శరణం శరణం గచ్ఛామి” నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 15న మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల జీవిత పోరాటం, సామాజిక సంస్కరణలు, మానవత్వ సందేశాన్ని తెలియజేసే “సత్య బోధన” నాటకాన్ని 16న డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ ఆలోచన ప్రస్థానం, బద్ధతత్వం వైపు ఆయన ప్రయాణాన్ని ప్రతిబింబించే “బుద్ధునితో నా ప్రయాణం” నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మూడు రోజుల నాటకోత్సవాలకు ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, యువత, విద్యార్థులు, స్థానిక ప్రజలు, సేవా సమితి సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై నాటక ప్రదర్శనలను విజయవంతం చేయవలసిందిగా జిఎం కోరారు.

# గోపాల్పూర్ చెరువు అంశంపై విజిలెన్స్ విచారణ.?



**హనుమకొండ, ఆగస్టు 13,(నినాదం):** హనుమకొండ గోపాల్పూర్ చెరువుకు సంబంధించిన అంశంపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. విజిలెన్స్ డీజీ ఆదేశాల మేరకు వరంగల్ విజిలెన్స్ అధికారులు బల్దియాలోని టౌన్ ప్లానింగ్ విభాగానికి చేరుకుని చెరువుకు సంబంధించిన కీలక రికార్డులు, అనుమతుల వివరాలను కూడా సేకరిస్తున్నారు. గోపాల్ పూర్ చెరువు మొత్తం విస్తీర్ణం ఎంత? చెరువుకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ మ్యాప్‌లో హద్దులు ఎలా ఉన్నాయి? చెరువు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇప్పటివరకు ఎన్ని నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు? చెరువు పరిధికి సమీపంలో ఏమైనా నిర్మాణాలకు పర్మిషన్లు మంజూరు చేశారా? అనే అంశాలపై అధికారులు వివరాలు పరిశీలిస్తున్నట్లు సమాచారం. అలాగే చెరువు పరిధి, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, మాస్టర్ ప్లాన్, లేఅవుట్ అనుమతులు, భవన నిర్మాణ అనుమతులు, సంబంధిత ఫైళ్లు, నోట్ ఫైల్స్, పర్మిషన్ రికార్డులు తదితర పూర్తి డాక్యుమెంట్లను విజిలెన్స్ అధికారులు టౌన్ ప్లానింగ్ అధికారులను కోరినట్లు తెలుస్తోంది. చెరువు విస్తీర్ణం, హద్దులు, చుట్టుపక్కల ఇచ్చిన అనుమతులు, వాటికి సంబంధించిన నిబంధనలు పాటించారా లేదా అనే అంశాలపై రికార్డుల ఆధారంగా సమగ్రంగా విచారణ కొనసాగనున్నట్లు సమాచారం. అయితే చెరువు మొత్తం 21 ఎకరాల ఒక గుంట విస్తీర్ణంలో ఉండగా చెరువు పరిధి విస్తీర్ణంలో సుమారు 15 ఎకరాలు కబ్జాకు గురైనట్లు విశ్వసనీయ సమాచారం.

# అర్హులందరికీ చేయూత పథకం అమలు చేస్తాం

చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి



**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 13,(నినాదం):** భువనగిరి మున్సిపాలిటీలోని 35 వార్డుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి చేయూత పథకం వర్తింప చేస్తామని మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశం హాల్లో చైర్పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ చంద్రారెడ్డి సమక్షంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం నూతన పెన్షన్ల ప్రక్రియను ప్రకటించడంతో అర్హులైన పేదవారికి చేయూత పథకం దరఖాస్తుల స్వీకరణ హడావుడి పెరిగింది. పట్టణంలోని ప్రజా ప్రతినిధుల వార్డులలో అర్హులైన వారికి పెన్షన్ పథకం దరఖాస్తులు స్వీకరించాలని అధికారులకు సూచించారు. దరఖాస్తులను వార్డుల వారిగా పరిశీలించాలని అధికారులకు కోరారు. రాష్ట్ర ప్రభుత్వము అందజేసిన మార్గదర్శకాలు ప్రకారం సామాజిక పెన్షన్లు ఒంటరి మహిళలు, కల్లు గీత కార్మికులు, వితంతువులు, చేనేత కార్మికులు, ఫైలేరియా, వికలాంగులు, తలెసేమియా, సికిల్ సెల్ డిసీస్, ఏమో పిలియా సంబంధించిన వారు మాత్రమే దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. పెన్షన్ విషయంలో సభ్యులు సూచన సలహాలు కూడా స్వీకరించారు. చేయూత పింఛన్ పేద ప్రజలకు ఒక అండ అని అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ తప్పనిసరిగా అందజేస్తామని తెలిపారు. దరఖాస్తులు నింపడంలో ఎలాంటి అనుమానాలు ఉన్న వార్డ్ ప్రజాప్రతినిధులు లేదా వార్డ్ ఆఫీసర్ సలహాలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వైస్ పర్సన్ పోతంశెట్టి మంజుల, సభ్యులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పంటలు ఎండిపోతున్నాయి అమరవరం లిఫ్ట్ నడిపించాలి

• మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరిన కాల్వపల్లి సర్పంచ్ సక్రూనాయక్



**హుజూర్నగర్ (మఠం పల్లి) ఆగస్టు 13 (నినాదం ):** ఎల్నినో ప్రభావంతో వర్షాలు లేకపోవడంతో సాగు చేసిన పంటలకు సరిపడా నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీరు లేక పంట పొలాలు ఎండిపోతుండటంతో రైతుల సమస్యను గుర్తించిన కాల్వపల్లి తండా సర్పంచ్ సక్రూ నాయక్ తన తోటి వారు దొనబండ తండా సర్పంచ్ అరుణ దేశ్ పాండు, అల్లిపురం సర్పంచ్ జ్యోతి పిచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ హనుమ నాయక్, ఉప సర్పంచ్ నితిన్ నాయక్, విజయ్, చంటి తదితరులు కలసి రైతుల సమస్యను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కాల్వపల్లి సర్పంచ్ సక్రూ నాయక్ మాట్లాడుతూ వర్షాలు లేక పంటలకు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రైతుల పంటలను కాపాడేందుకు అమరవరం లిఫ్ట్‌ను వెంటనే నడిపించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల పంటలను కాపాడేందుకు అమరవరం లిఫ్ట్‌ను నడిపించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని వారు మంత్రిని కోరారు. రైతుల సమస్యను సానుకూలంగా విన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ, అమరవరం లిఫ్ట్ నడిచేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి హామీపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. రైతుల కష్టాలను గుర్తించి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవడం పట్ల సర్పంచ్‌లు, రైతులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# యువత ఉత్సాహం చూస్తుంటే భారత్ విశ్వ గురువుగా మారడం ఖాయం

**ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

**'భారత్ మాతాకీ జై' తో మార్మోగిన నిర్మల్.. ఘనంగా తిరంగా ర్యాలీ**






**నిర్మల్ ప్రతినిధి, ఆగస్టు 13 ( నినాదం):** దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, దేశం, ధర్మం కోసం యువత తమ సమయాన్ని కేటాయించాలని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన తిరంగా ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. పాఠశాల, కళాశాలల విద్యార్థులు, యువకులు, దేశభక్తులు, బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని దేశభక్తిని చాటారు. 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' నినాదాలతో నిర్మల్ పట్టణం మార్మోగింది. స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్, అంబేద్కర్ చౌక్, పాత బస్టాండ్ మీదుగా వివేక్ చౌక్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, స్వామి వివేకానంద విగ్రహాలకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ర్యాలీలో యువత చూపిన ఉత్సాహం చూస్తుంటే భారతదేశం ప్రపంచంలోనే విశ్వగురుగా అవతరించే దిశగా ముందుకు సాగుతోందని అన్నారు. దేశభక్తి భావన ప్రతి ఒక్కరిలో మరింత బలపడాల్సిన అవసరం ఉందన్నారు. 'వందేమాతరం' గీతాన్ని దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరూ ఆలపించేలా ప్రధాని నరేంద్ర మోదీ చట్టబద్ధత కల్పించారని అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కేంద్రంలోని మోదీ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించి యువతతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, భూమయ్య, స్రవంతి రెడ్డి, తక్కల రమణ రెడ్డి, కరిపే విలాస్, మెడిసెమ్మ రాజు, రాజేశ్వర్ రెడ్డి, దీజీవీ జిల్లా అధ్యక్షులు నిరంజన్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు , పట్టణ బీజేపీ కౌన్సిలర్లు, విద్యార్థులు, బీజేపీ నాయకులు కార్యకర్తలు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ముువ్వన్నెల జెండా నీడలో.. అమరవీరుల త్యాగాల జ్ఞాపకం

**500 మీటర్ల జాతీయ జెండాతో తిరంగ ర్యాలీ**

**బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి**



**మంచిర్యాల, ఆగస్టు 13 (నినాదం):** స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు పూర్తవుతున్న వేళ.. ముువ్వన్నెల జెండా కేవలం జాతీయ చిహ్నంగా కాకుండా, ఎన్నో త్యాగాల జ్ఞాపకంగా నిలుస్తోంది. స్వేచ్ఛగా ఊపిరి పీలుస్తున్న ప్రతి భారతీయుడి వెనుక ఎందరో అమరవీరుల త్యాగం దాగి ఉంది. ఆ త్యాగాలను నేటి తరానికి గుర్తుచేస్తూ మంచిర్యాల పట్టణంలో నిర్వహించిన తిరంగ ర్యాలీ దేశభక్తి భావాన్ని చాటింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చేతుల్లో జాతీయ జెండాలు.. అడుగుల్లో ఉత్సాహం.. నోట దేశభక్తి నినాదాలతో పట్టణ వీధులు మార్మోగాయి. సుమారు 500 మీటర్ల భారీ జాతీయ జెండాను విద్యార్థులు ప్రదర్శించడం ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం ఒక్కరోజులో రాలేదని, దాని వెనుక ఎన్నో దశాబ్దాల పోరాటం, వేలాది మంది త్యాగాలు ఉన్నాయని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు తమ కుటుంబాలను, ఆస్తులను, చివరకు ప్రాణాలను సైతం దేశం కోసం అర్పించారని గుర్తుచేశారు. నేడు మనం స్వేచ్ఛగా జీవిస్తూ విద్య, ఉపాధి, వ్యాపారం, భావ వ్యక్తీకరణ వంటి హక్కులను అనుభవిస్తున్నామంటే.. వాటి వెనుక అమరవీరుల పోరాటం ఉందనే విషయాన్ని యువత గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్య వేడుకలు కేవలం ఆర్భాటంగా కాకుండా.. దేశ చరిత్రను తెలుసుకునే సందర్భంగా మారాలని సూచించారు.

**సరిహద్దుల్లో సైనికుల త్యాగం**

స్వాతంత్ర్యం సాధించిన వారిని స్మరించుకోవడంతో పాటు.. నేటి స్వేచ్ఛను కాపాడుతున్న సైనికుల సేవలను కూడా గుర్తించాలని పేర్కొన్నారు. కుటుంబాలకు దూరంగా, ఎండా వానలను లెక్కచేయకుండా సరిహద్దుల్లో సైనికులు విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. దేశ ప్రజలు ప్రశాంతంగా నిద్రిస్తున్న సమయంలో సరిహద్దుల్లో సైనికులు అప్రమత్తంగా ఉంటారని.. వారి త్యాగం వల్లే దేశ భద్రత సాధ్యమవుతోందని చెప్పారు. ప్రతి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమర సైనికులను, వారి కుటుంబాలను స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు. 2047 నాటికి భారత్‌ను వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. ఈ లక్ష్యం కేవలం ప్రభుత్వాల బాధ్యత కాదని.. ప్రతి పౌరుడి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని చెప్పారు. ప్రత్యేకంగా విద్యార్థులు దేశ భవిష్యత్తుకు పునాదులని పేర్కొన్నారు. విద్యతోపాటు క్రమశిక్షణ, బాధ్యత, సేవాభావం, దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. యువత తమ ప్రతిభను దేశ ప్రగతికి వినియోగిస్తే ప్రపంచంలో భారత్‌ను అగ్రగామి దేశంగా నిలపడం సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, పెద్దపల్లి పురుషోత్తం, పాల్గొన్నారు.

# పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

**తాహసిల్దార్ కు వినతిపత్రం అందజేత**



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, ఆగస్టు 13(నినాదం) :** పీఆర్సీని వెంటనే ప్రకటించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సోయం ఇందు రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూఎస్‌పీసీ దశలవారీ పోరాట కార్యక్రమంలో భాగంగా కౌటాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ ప్రమోద్ కు వినతిపత్రం అందజేశారు. పీఆర్సీ కాలపరిమితి ముగిసి 36 నెలలు గడిచినా ఇప్పటివరకు పీఆర్సీని ప్రకటించకపోవడం బాధాకర మన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని, వివిధ రకాల పెండింగ్ బిల్లులు, జీపీఎఫ్ రుణాలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీవో 317 బాధితులకు న్యాయం చేయడంతో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఇతర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఈ నెల 19న జిల్లా కేంద్రంలో భారీ ధర్నా నిర్వహిస్తామని, అలాగే ఈ నెల 29న హైదరాబాద్ ధర్నా చౌక్‌లో వేలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయులతో పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావుల వినోద్, గుణాకర్ చౌదరి, రవికుమార్, చిలుకయ్య, రాథోడ్ కృష్ణ, రావుజి, సంతోష్, గంగా సింగ్, చంద్రమౌళి, విలాస్, భగవాన్, తిరుపతి, అవినాష్, కృష్ణ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి




**మంచిర్యాల, ఆగస్టు13 (నినాదం):** ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగుతూ తమ ప్రతిభను చాటుకోవాలని మంచిర్యాల కార్పొరేషన్ మేయర్ మధుకర్ పేర్కొన్నారు. మంచిర్యాలలోని ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విజేతలు, రన్నరప్ జట్లకు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని అన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో క్రీడా సౌకర్యాలు కల్పించి విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని అన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో ఐటీఐ/ఏటీసీ ప్రిన్సిపాల్, తెలంగాణ ఎన్జీవోస్ యూనియన్ నాయకులు శ్రీహరి, శ్రావణ్ కుమార్, గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ నాయకులు కె.వనజ రెడ్డి, సుధాకర్, సిబ్బంది, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులపై తక్షణ స్పందన ఉండాలి

**మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్**



మంచిర్యాల, ఆగస్టు 13 (నినాదం): ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, చట్టపరిధిలో వేగంగా విచారణ చేపట్టి బాధితులకు న్యాయం అందించాలని మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ పోలీసు అధికారులను ఆదేశించారు. సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్‌ను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి, స్టేషన్‌లోని విధులు, రికార్డుల నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న డీసీపీ ముందుగా స్వీకరణ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడకు వివిధ సమస్యలపై వచ్చిన బాధితులతో నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి వ్యక్తి సమస్యను సానుభూతితో వినాలని, ఫిర్యాదు స్వీకరించిన వెంటనే దాని స్వభావాన్ని బట్టి చట్టపరమైన చర్యలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. ఫిర్యాదుదారులను అనవసరంగా తిప్పించకుండా, వారికి కేసు దర్యాప్తు పురోగతిపై అవసరమైన సమాచారం అందించాలని అధికారులకు స్పష్టం చేశారు.

**రికార్డుల నిర్వహణపై ఆరా**

అనంతరం స్వీకరణ కేంద్రంలో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదుల నమోదు, వాటిపై తీసుకున్న చర్యలు, పెండింగ్‌లో ఉన్న అంశాలు తదితర వివరాలను పరిశీలిస్తూ రికార్డుల నిర్వహణ తీరును సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలని, ప్రతి ఫిర్యాదుపై తీసుకున్న చర్యలు స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు.

**అసాంఘిక శక్తులపై నిఘా పెంచాలి..**

స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలను డీసీపీ అడిగి తెలుసుకున్నారు. వారికి కేటాయించిన విధులు, ఆయా ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిస్థితి, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై సేకరిస్తున్న సమాచారం గురించి ఎస్ఐ, సీఐ రవీందర్‌ను ప్రశ్నించారు. సమస్యాత్మక ప్రాంతాలు, అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఉన్న ప్రాంతాలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలను ప్రోత్సహించే వ్యక్తుల కదలికలపై సమాచారం సేకరించి ముందస్తు చర్యలు చేపట్టాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలనూ ఉపేక్షించవద్దని అధికారులకు సూచించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ పోలీసింగ్ కొనసాగించాలని స్పష్టం చేశారు.

**సిబ్బంది సమస్యలు తెలుసుకున్న డీసీపీ..**

తనిఖీలో భాగంగా పోలీస్ సిబ్బందితో డీసీపీ నేరుగా మాట్లాడారు. విధుల్లో ఎదురవుతున్న ఇబ్బందులు, శాఖాపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సంక్షేమం, విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలపై వారి నుంచి వివరాలు సేకరించారు. పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటేనే పోలీస్ శాఖపై నమ్మకం మరింత పెరుగుతుందని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను ఓపికగా విని పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు.

# భైంసా లో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**నిర్మల్ ప్రతినిధి/భైంసా, ఆగస్టు 13(నినాదం ):** భైంసాలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమంలో ముధోల్ ఎమ్మెల్యే శ్రీ పవార్ రామారావు పటేల్ పాల్గొన్నారు. జాతీయ జెండాను చేతబట్టి ర్యాలీలో పాల్గొన్న ఆయన దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు జాతీయ జెండా ఔన్నత్యాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. యువత పెద్ద సంఖ్యలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మోల్ల దత్తాత్రి, ప్రజాప్రతినిధులు,విద్యార్థులు నాయకులు, కార్యకర్తలు, యువత తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ జెండాలతో నిర్వహించిన ర్యాలీ దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా సాగింది.

# 2030 నాటికి ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం..!!

**అవగాహనతోనే హెచ్ఐవీ-ఎయిడ్స్‌కు అడ్డుకట్ట:**

**కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డా. జి. సుబ్బారావు**

**ఎయిడ్స్ పై అపోహలను తొలగించి.. అవగాహనను పెంచాలి**

**విద్యార్థులు సమాజంలో చైతన్య దూతలుగా నిలవాలి: ఐసీటీసీ కౌన్సిలర్ శంకర్**



**గోదావరిఖని ఆగస్టు 13 (నినాదం):** హెచ్ఐవీ--ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటంతో పాటు, సమాజంలో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డా. జి. సుబ్బారావు పిలుపునిచ్చారు. కళాశాల జంతుశాస్త్ర విభాగం, హెల్త్‌కేర్ విభాగం, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఐసీటీసీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన హెచ్ఐవీల-ఎయిడ్స్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు నిరంతరం కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని, సమాజంలో చైతన్యం తీసుకురావాలని సూచించారు. అవగాహనతో తగ్గుతున్న హెచ్ఐవీ కేసులు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఐసీటీసీ విభాగ కౌన్సిలర్ శంకర్ ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడుతూ.. గతంలో హెచ్ఐవీ కేసులు అధికంగా ఉండేవని, ప్రభుత్వ చర్యలు, విస్తృతంగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల కారణంగా ప్రస్తుతం కేసుల సంఖ్య గణనీయం గా తగ్గుతోందని తెలిపారు. 2030 నాటికి ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**ఎయిడ్స్‌పై పూర్తి అవగాహన అవసరం..**

జంతుశాస్త్రం, హెల్త్‌కేర్ విభాగాల అధిపతి డా. డి. కిరణ్మయి మాట్లాడుతూ హెచ్ఐవీ--ఎయిడ్స్ వ్యాధికి సంబంధించిన కారణాలు, లక్షణాలు, నివారణ చర్యలు, చికిత్స విధానాలపై ప్రతి విద్యార్థి పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. విద్యార్థులు తాము తెలుసుకున్న విషయాలను నిరక్షరాస్యులు, గ్రామీణ ప్రజలకు సైతం వివరించి అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి. సవిత, అధ్యాపకులు డా. జి. శారద, పి. శ్రీదేవి, సుమలత, నివేదిత, స్రవంతి, సమత తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి హెల్త్‌కేర్ అధ్యాపకులు బి. ప్రసాద్ వందన సమర్పించారు. అధిక సంఖ్యలో విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గంజాయి, సైబర్ నేరాలపై
# పోలీసుల ఉక్కుపాదం

**సీఐ పొన్నమనేని రంజిత్ రావు**




**సుల్తానాబాద్, ఆగస్టు 13 (నినాదం):** పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం బురమియా పేట్ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో సమాజ అవగాహన సదస్సు నిర్వహించారు. సుల్తానాబాద్ సీఐ పి. రంజిత్‌రావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ఎలిగేడు ఎస్‌హెచ్‌ఓ ఎల్. మధు కర్, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నా రు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూ రంగా ఉండాలని, వాటి విక్రయం, వినియోగంపై సమాచారం అందిం చాలని సీఐ సూచించారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, OTP, PIN, బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పొద్దని ఎస్ హెచ్‌ఓ మధుకర్ హెచ్చరించారు. సైబర్ మోసా నికి గురైతే వెంటనే 1930కు సమాచారం ఇవ్వా లని తెలిపారు. అలాగే హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్ప నిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహ నాలు నడపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం వంటి వాటికి దూరంగా ఉండాల ని సూచిం చారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలా పాలపై అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమా చారం అందించాలని కోరారు. ప్రజల సహకారం తోనే నేర రహిత, గంజాయి రహిత సమాజాన్ని నిర్మించగలమని సీఐ రంజిత్‌రావు పేర్కొన్నారు.

# లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

**చింతలమానేపల్లి ఆగష్టు 12 (నినాదం):** మండలంలోని బాబాసాగర్, గూడెం, బాలాజీ అనుకోడ, చింతలమానేపల్లి, కర్జెల్లి తదితర గ్రామాలకు చెందిన ఎనిమిది మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ. 2.15 లక్షల విలువైన చెక్కులను మంగళవారం బీజేపీ మండల నాయకులు పంపిణీ చేశారు. సిర్పూర్ (టి )ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్‌బాబు ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థికంగా కొంత ఊరటనిస్తోందని, బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అండగా ఉంటున్నారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల సీనియర్ నాయకులు ఎలుమల మల్లయ్య, దుబ్బుల మురళి, కతేర్ల మల్లయ్య, సత్పుతే తుకారం, చౌదరి నానయ్య, పవన్ పురోహిత్, మోహన్, రామస్వామి, దందరే పోశన్న, జాడి తిరుపతి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



# వర్షం పడితే.. మార్కెట్‌లో వరదే!



**మంచిర్యాల, ఆగస్టు 13 (నినాదం):** వర్షం వస్తే చాలు.. మంచిర్యాల ప్రధాన కూరగాయల మార్కె ట్‌లో వ్యాపారుల గుండెల్లో గుబులు మొదలవు తోంది. మార్కెట్‌లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపో వడంతో చిన్నపాటి వర్షానికే నీరు పొంగిపొర్లు తోంది. కూరగాయలు అమ్ముకునే వ్యాపారులు, కొనుగోలుకు వచ్చే ప్రజలు మురుగు నీటిలోనే నడవాల్సిన దుస్థితి నెలకొంటోంది. నీరు నిలిచిపోవ డంతో కూరగాయలు తడిసి నాణ్యత దెబ్బతినే పరిస్థితి కూడా ఏర్పడుతోందని వ్యాపా రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను తెలుసుకున్న మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్ గురువారం ప్రధాన కూర గాయల మార్కె ట్‌ను సందర్శించారు. కూరగాయల మార్కెట్ సం ఘం నాయకులతో కలిసి మార్కెట్ అంతా పరిశీ లించారు. వర్షం కురిసినప్పు డు నీరు ఎక్కడి నుంచి వస్తోంది.. ఎక్కడ నిలిచిపోతోం ది.. డ్రైనేజీ వ్యవస్థలో ఎక్కడ లోపం ఉంది.. అనే అంశాలను పరిశీలిం చారు.

**వ్యాపారుల గోడు విన్న మేయర్..**

మార్కెట్‌లో వ్యాపారం నిర్వహిస్తున్న వారితో మేయర్ నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. ప్రతిరోజూ కూరగాయల విక్ర యాలపై ఆధారపడి జీవించే తమకు వర్షాకాలంలో నీటి సమస్య తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని వ్యాపారులు వివరించారు. వర్షపు నీటితో పాటు మురుగు నీరు మార్కెట్‌లోకి చేరడం తో వ్యాపార నిర్వహణ కష్టంగా మారుతోందని తెలిపారు. కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చే సామాన్య ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నా రని, మార్కెట్‌లో పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడాల్సిన అవసరం ఉందని వారు మేయర్ దృష్టికి తీసుకెళ్లారు.

**ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం..**

వ్యాపారుల సమస్యలను ఓపికగా విన్న మేయర్ దర్ని మధుకర్.. సమస్యను మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వర్షాకాలంలో ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడకుండా డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని తెలిపారు. మార్కెట్ కేవలం వ్యాపార కేంద్రం మాత్రమే కాదని.. వందలాది మంది వ్యాపారులు, కార్మికులు, కొనుగోలు దారుల జీవనాధారంతో ముడిపడి ఉందని, వారి ఇబ్బందులను పరిష్కరించాల్సిన బాధ్యత స్థానిక సంస్థలపై ఉందని మేయర్ పేర్కొన్నారు.

# చిన్నారుల భవిష్యత్‌కు గ్రామస్థుల భరోసా

**మానవత్వానికి మచ్చుతునక..**

**ఆపదలో కుటుంబానికి అండగా కనుకుల గ్రామం**



**సుల్తానాబాద్, ఆగస్టు 13 (నినాదం):** కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న ముత్యాల రా జుమోహన్ మృతి చెందడంతో చిన్నారులు దిక్కు లేని పరిస్థితుల్లో పడకుండా సుల్తానాబాద్ మం డలం కనుకుల గ్రామస్థులు మానవత్వాన్ని చాటుకున్నారు. రాజుమోహన్‌కు చిన్నపిల్లలు ఉండటం తో వారి భవిష్యత్‌కు భరోసా కల్పించాలనే ఉద్దే శంతో గ్రామస్థులు ముందుకొచ్చారు. చిన్నారుల పేర్లపై రూ. లక్ష మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్ డీ) చేయాలని నిర్ణయించి, ఆ మొత్తం భవిష్యత్ లో వారి అవసరాలకు ఉపయోగపడేలా ఏర్పాటు చేశారు. కష్ట కాలంలో ఆ కుటుంబానికి అండగా నిలిచి, చిన్నారుల భవిష్యత్‌పై భరోసా కల్పించిన గ్రామస్థుల ఔదార్యాన్ని పలువురు అభినందించా రు. ఆపదలో తోడుగా నిలవడమే నిజమైన మా నవత్వమని కనుకుల గ్రామస్థులు తమ సేవాభా వంతో చాటిచెప్పారు.

# మేడారం నుంచి మహిళలకు మహా వరం!

16న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన..
వితంతు, ఒంటరి మహిళలకు పింఛన్లకు శ్రీకారం
16 వేల కోట్ల హ్యామ్ రోడ్ల పైలాన్ ఆవిష్కరణ..
నూతన కలెక్టరేట్ ప్రారంభం
మంత్రి సీతక్క




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (నినాదం):** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ నెల 16న ములుగు జిల్లాలోపర్యటించనున్న నేపథ్యంలో మేడారం నుంచి ములుగు జిల్లా కేంద్రం వరకు ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క గురువారం మేడారం సమ్మక్క--సారలమ్మ ఆలయ ప్రాంగణం, హ్యామ్ రోడ్ల పైలాన్ నిర్మాణ పనులు, నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సీఎం పర్యటనలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మేడారంలో వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వితంతు, ఒంటరి మహిళలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించనున్నారు. ఆగస్టు 31 వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులను గుర్తిస్తామని సీతక్క తెలిపారు. అనంతరం ములుగు జిల్లా కేంద్రంలోని గట్టమ్మ సమీపంలో రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో సుమారు రూ.16 వేల కోట్లతో చేపట్టనున్న హ్యామ్ రోడ్ల పనుల పైలాన్‌ను సీఎం ఆవిష్కరించనున్నారు. నూతన కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభించి ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం అని సీతక్క పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా బిట్స్ పిలానీ సహకారంతో 'ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్' ద్వారా శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్ సహకారం అందించనున్నట్లు తెలిపారు. అర్హులైన మహిళా వ్యాపారులకు రూ.లక్ష నుంచి రూ.15 లక్షల వరకు గ్రాంట్ పొందే అవకాశం ఉందన్నారు. ములుగు పర్యాటక ప్రాంతాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో క్యాంటీన్లు, మొబైల్ టిఫిన్ కేంద్రాలు, స్థానిక ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసి ఆదాయ అవకాశాలను పెంచాలని సూచించారు. మహిళా సంఘాల రుణాలపై జిల్లాలో ఇప్పటివరకు సుమారు రూ.13 కోట్ల వడ్డీని ప్రభుత్వం చెల్లించిందని మంత్రి వెల్లడించారు. మేడారం ఆలయ తుది దశ అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, కలెక్టరేట్‌లో పారిశుధ్యం, విద్యుత్, తాగునీరు, రహదారులు, పార్కింగ్ తదితర మౌలిక సదుపాయాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సీతక్క పిలుపునిచ్చారు.

# శాంతి భద్రతలపై రాజీ లేదు : సీపీ అంబర్ కిషోర్ ఝా



**మంచిర్యాల, ఆగస్టు 13 (నినాదం):** ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యమని, శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు. మంచిర్యాల జోన్ పరిధిలోని శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న సీపీకి అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలిస్తూ పోలీసుల పనితీరు, కేసుల దర్యాప్తు, ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.

**కేసుల దర్యాప్తుపై ప్రత్యేక దృష్టి**

పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను సీపీ పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, దర్యాప్తు పురోగతి, నిందితుల అరెస్టులు, దర్యాప్తులో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**కేసుల దర్యాప్తుపై ప్రత్యేక దృష్టి...**

జాప్యం జరగకుండా నిర్ణీత సమయంలో పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసును సాంకేతిక ఆధారాలతో సమగ్రంగా దర్యాప్తు చేయాలని, ఆధారాల సేకరణలో నిర్లక్ష్యం చేయరాదని స్పష్టం చేశారు.

**బాధితులకు భరోసా కల్పించాలి...**

పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని సీపీ సూచించారు. సమస్యను చెప్పుకునేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరికీ పోలీసులు భరోసా కల్పించాలని అన్నారు. ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా చట్టపరంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీసులపై ప్రజలకు నమ్మకం పెరిగేలా ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

**నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు...**

శ్రీరాంపూర్ ప్రాంతంలో శాంతిభద్రతల పరిస్థితిపై సీపీ ఆరా తీశారు. నేరాలు జరిగాక స్పందించడం కంటే ముందుగానే వాటిని అరికట్టే విధంగా పోలీసింగ్ ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై నిఘా కొనసాగించాలని, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో గస్తీని మరింత పటిష్టం చేయాలని సూచించారు.

**ప్రజలతో మమేకమై పనిచేయాలి**

పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, స్థానిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చొరవ చూపాలని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా సురక్షిత వాతావరణం కల్పించడమే పోలీసుల లక్ష్యంగా ఉండాలన్నారు. గ్రామాలు, కాలనీలు, ప్రధాన కూడళ్లలో పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన చోట పోలీసుల ఉనికిని పెంచాలని సూచించారు.

**సిబ్బంది సంక్షేమం పైనా దృష్టి...**

పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను కూడా తెలుసుకున్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండటంతో పాటు ఆరోగ్యం, మానసిక ఒత్తిడి వంటి అంశాలపైనా సిబ్బంది శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రజల కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి అవసరమైన సహకారం అందించాలని అధికారులకు సూచించారు.

**ప్రజల విశ్వాసమే పోలీసుల బలం...**

శాంతిభద్రతలను కాపాడటంలో ప్రజల సహకారం ఎంతో కీలకమని సీపీ పేర్కొన్నారు. పోలీసులు--ప్రజల మధ్య సమన్వయం పెరిగినప్పుడే నేరాల నియంత్రణ మరింత సమర్థంగా సాధ్యమవుతుందని అన్నారు. ప్రజలకు ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించే విధంగా విశ్వాసాన్ని పెంపొందించాలని సూచించారు. శ్రీరాంపూర్ ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పోలీస్‌స్టేషన్ నిర్వహణ, కేసుల దర్యాప్తు, నేర నియంత్రణ, గస్తీ ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాల్లో నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సిఐ అశోక్, ఎస్సై సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సభను విజయవంతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలి


కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 13 (నినాదం):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 15న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో, సంగారెడ్డి జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొనే బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. గురువారం సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియం, మున్సిపల్ కార్యాలయ పరిసరాల్లో సభ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐఎస్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఇతర శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఈ నెల 15న సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నందున, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సభకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, స్మార్ట్ రేషన్ కార్డుల లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నందున, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. సభా ప్రాంగణంలో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, సీటింగ్ ఏర్పాట్లు, పార్కింగ్, విద్యుత్, రాకపోకల మార్గాలు తదితర అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. శాఖల వారీగా అప్పగించిన విధులు, బాధ్యతలను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ప్రయాణించే రూట్‌తో పాటు సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ట్రాఫిక్ నిర్వహణ, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీ, డీఎస్పీ హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, సభా వేదిక, ముఖ్యమంత్రి ప్రయాణించే రూట్, రాకపోకల మార్గాలు, సభా ప్రాంగణం తదితర అంశాలలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన పూర్తయ్యే వరకు అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండి, పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, అడిషనల్ కలెక్టర్ పాండు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ నగర్లోని పెట్రోల్ బంకులో మోసం

42 లీటర్లు సామర్థ్యం గల కారులో.. 53 లీటర్ల డీజిల్ పోసిన వైనం
వినియోగదారుల.. ఆందోళనలతో బంకును మూసిన యజమానులు
బంకులో మాయాజాలాన్ని చూసి నివ్వరపోతున్న వినియోగదారులు




**జవహర్ నగర్, ఆగస్టు 13 (నినాదం):** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ అంబేద్కర్ నగర్ భారత పెట్రోల్ బంకులో మోసం చోటుచేసుకుంది. స్విఫ్ట్ డిజైర్ కారులో డీజిల్ పోసుకునేందుకు బుధవారం రాత్రి సందీప్ అనే వినియోగదారుడు వచ్చాడు. కారు డీజిల్ సామర్థ్యం 42 లీటర్లు కాగా 53 లీటర్ల డీజిల్ బంకు సిబ్బంది పోయడం విస్మయానికి గురిచేసింది. బంకు నిర్వాహకుల మాయజాలంతో అమాయక ప్రజలు మోసపోతున్నారని వినియోగదారులు లబోదిబోమంటున్నారు. నాణ్యమైన పెట్రోలు డీజిల్ పోస్తారు అనుకుంటే వినియోగదారుల నమ్మకం పోయేలా చేయడం తగదని సందీప్ వాపోయాడు. ఈ ఘటనపై ఉప్పల్ సర్కిల్ సివిల్ సప్లై అధికారి సంధ్య సిబ్బందితో కలిసి బంకును పరిశీలించారు. ఈ సందర్భంగా సంధ్య మాట్లాడుతూ తూనికలో కొలతలలో ఎలాంటి లోటుపాట్లు లేవని నిర్ధారించారు. పెట్రోల్ బంకులో వసతులు సరిగ్గా లేవని ఉన్నతాధికారులకు విన్నవిస్తున్నామన్నారు. త్వరలోనే చర్యలు తీసుకుంటామని జిల్లా అధికారి ఎండి రియాజ్ అహ్మద్ ఖాన్ తెలిపారు. బాధితుడు డీజిల్ పోసుకున్న తర్వాత అంబేద్కర్ నగర్ వరకు ఐదు నిమిషాల కాలం వెళ్లి వచ్చినందువల్ల తప్పు జరిగిన చట్ట ప్రకారం యాజమాన్యంపై చర్యలు తీసుకోలేమని అధికారులు తెలపడంతో అధికారులు యాజమాన్యంతో కుమ్మక్కై నన్ను మోసం చేశారని నాలాగా రోజుకు వేలాదిమంది మోసపోతున్నారని బాధితుడు సందీప్ వాపోయాడు.

NINADAM CINEMA


## నేను రెడీ నుంచి "మస్తుగుందిర యవ్వారం" పాట ఘనంగా విడుదల..



యంగ్ హీరో హవీష్ కథానాయకుడిగా, హిట్ చిత్రాల దర్శకుడు త్రినాధరావు నక్కిన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఫుల్ ఎంటర్‌టైనర్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. సత్యనారాయణ కోనేరు సమర్పణలో, నిఖిల కోనేరు నిర్మిస్తున్న ఈ చిత్రంలో హవీష్ సరసన కావ్య థాపర్ కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, రెండు పాటలు, ప్రమోషనల్ కంటెంట్‌కు మంచి స్పందన లభించగా, తాజాగా చిత్రంలోని "మస్తుగుందిర యవ్వారం" పాటను వరంగల్ శాసన సభ్యులు నాయని రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా హనుమకొండలోని కాళోజి కళా క్షేత్రం వేదికగా గురువారం ఘనంగా విడుదల చేశారు. ఫుల్ జోష్‌తో కూడిన రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ పాటను కాశర్ల శ్యామ్ రాశారు. ఆకట్టుకునే ట్యూన్, ఎనర్జిటిక్ బీట్, అందమైన విజువల్స్‌తో పాటు హీరో హవీష్, హీరోయిన్ కావ్య థాపర్ కెమిస్ట్రీ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా "మస్తుగుందిర యవ్వారం..." అంటూ సాగే తెలంగాణా స్లాంగ్ లిరిక్స్ యూత్‌ను ఆకట్టుకునేలా ఉన్నాయి. హవీష్‌ను సరికొత్త లుక్‌లో చూపిస్తూ దర్శకుడు త్రినాధరావు నక్కిన తనదైన ఫ్యామిలీ ఎంటర్‌టైనింగ్ స్టైల్‌లో సినిమా.

## అలా ..రజనీకాంత్ గారితో జతకట్టా

శ్రియా శరణ్ అనుభవాలు



టాలీవుడ్, కోలీవుడ్ తార నటి శ్రియ శరణ్ సూపర్ స్టార్ రజనీకాంత్ తో నటించిన 'శివాజీ: ది బాస్' సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. శ్రియ కెరీర్ లోనే అత్యధిక కలెక్షన్స్ సాధించిన చిత్రాలలో ఒకటిగా నిలిచింది. అయితే ఈ సినిమా షూటింగ్ సమయంలో జరిగిన ఒక మధురమైన జ్ఞాపకాన్నిశ్రియ తాజాగా పంచుకున్నారు. దర్శకుడు శంకర్ తనకు ఆ అవకాశం ఇచ్చిన వైనం గురించి ఆమె మాట్లాడుతూ..ఒకరోజు శంకర్ సర్ నాకు ఫోన్ చేసి, 'ఒక సినిమా ఉంది, అందులో పనిచేస్తావా?' అని అడిగారు. నేను సరేనని చెప్పాను, ఆయన 'సరే' అన్నారు. నేను అక్కడికి వెళ్లేసరికి చాలా మంది ప్రముఖులు వచ్చారు. ఎ.ఆర్. రెహమాన్ సర్, రజనీకాంత్ సర్ వచ్చారు. అప్పుడు నేను శంకర్ గారిని చూసి, 'ఇది కచ్చితంగా చాలా పెద్ద సినిమా అయి ఉంటుంది' అనుకున్నాను, ఎందుకంటే అక్కడ అంత పెద్ద వాళ్ళంతా గుమిగూడారు. అప్పుడు ఆయన నన్ను చూసి, 'మీ కో-స్టార్ రజనీకాంత్ సర్‌ని కలవండి' అని చెప్పారు. దానికి నేను షాక్ అయ్యి 'అవునా? సరే!' అన్నాను. ఆ తర్వాత అక్కడ ఎ.ఆర్. రెహమాన్ సర్ ఉన్నారు, అలాగే సినిమాటోగ్రాఫర్ కే.వి. ఆనంద్ సర్ కూడా ఉన్నారు' అంటూ రజనీకాంత్‌తో తన మొదటి పరిచయ క్షణాలను శ్రియ ఎంతో సరదాగా గుర్తుచేసుకున్నారు.

## రజనీకాంత్ ధర్మన్ మూవీ

సెకండ్ షెడ్యూల్ ప్రారంభం



సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'ధర్మన్' చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఈ సినిమాకు సంబంధించి ప్రస్తుతం సెకండ్ షెడ్యూల్ షూటింగ్ ప్రారంభ మైనట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా ఒక వీడియోను విడుదల చేసింది. 'ఓ మై కడవులే', 'డ్రాగన్' వంటి వైవిధ్యమైన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. లోకనాయకుడు కమల్ హాసన్ తన సొంత నిర్మాణ సంస్థ అయిన 'రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్' బ్యానర్‌పై ఈ సినిమా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రజనీకాంత్ సరసన సిమ్రాన్, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తుండగా, కమెడియన్ యోగి బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇక ఈ సినిమాకు సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఇక ఇదివరకే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌లో రజనీకాంత్ రక్తంతో తడిసిన సర్జికల్ టూల్ పట్టుకుని 'ది డెడ్లీ డాక్టర్' ట్యాగ్‌లైన్‌తో కనిపించి ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేశారు. ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్న ఈ రెండో షెడ్యూల్‌తో సినిమాపై మరింత హైప్ క్రియేట్ అవుతోంది.

## రాకాలో మరో ముగ్గురు ముద్దుగుమ్మలు

జాన్వీ, రష్మిక, మృణాల్ ఉన్నట్లుగా ప్రచారం



అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'రాకా' సినిమాకి సంబంధించి చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా బయట పెట్టింది కొన్ని విషయాలే! ఇందులో నటిస్తున్న తారాగణంపై కూడా ఇంకా పూర్తిగా స్పష్టత లేదు. కథానాయికగా దీపికా పదుకొణె పేరు మాత్రమే ఇప్పటివరకూ ఖరారైంది. ఆమెతోపాటు... మరో ముగ్గురు ప్రముఖ కథానాయికలు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. అతిథి పాత్రల గురించి కూడా ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఆ పరంపరలోనే షారుక్ ఖాన్, షాహిద్ కపూర్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ సినిమాలోని కథానాయి కల పాత్రలపై కూడా కొన్ని కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చినట్టుగా బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. మొదట్నుంచి ముంబయిలోనే ఈ సినిమా చిత్రీకరణ సాగుతుండడం, అక్కడ్నుంచి పలు విషయాలు ప్రచారంలోకి వస్తుండడంతో సినీ ప్రేమికులు వాటి గురించి ప్రత్యేకమైన ఆసక్తిని కనబరుస్తూ చర్చించుకుంటున్నారు.

## సుకుమార్ కూతురు సుకృతివేణికి బోస్టన్ స్కూల్ స్కాలర్‌షిప్



'పుష్ప' చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో దర్శకుడిగా మంచి గుర్తింపు పొందారు సుకుమార్. ఇటీవల జాతీయ అవార్డుల్లో ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగానూ ఘనత సాధించారు. ఆయన తనయ సుకృతి వేణి కూడా విభిన్న బాటలో పయనిస్తున్నారు. 2024 సంవత్సరానికి జాతీయ ఉత్తమ బాల నటిగా 'గాంధీ తాత చెట్టు'కు అవార్డు సాధించిన సుకృతి వేణి ఇప్పుడు మరో అరుదైన ఘనతను కైవసం చేసుకుంది. అమెరికాలోని 'బోస్టన్ అంతర్జాతీయ బర్క్‌లీ స్కూల్ ఆఫ్ మ్యూజిక్' సంగీత విభాగంలో ఎన్‌సెంబుల్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికై ఫుల్ స్కాలర్‌షిప్‌ను సొంతం చేసుకున్నారు. మొత్తం 272 మంది పిల్లలు ఆడిషన్ ఇవ్వగా, కేవలం 14 మందికి మాత్రమే పూర్తి స్కాలర్‌షిప్ వచ్చింది. అందులో సింగర్స్ విభాగంలో ఎంపికైన ఏకైక విద్యార్థిని సుకృతి వేణి కావడం విశేషం.

## అతిగా ఫోన్ వాడకంతో 3 లక్షలు బొక్క

నటి షకీలాకు చేదు అనుభవం



ప్రముఖ నటి షకీల ఇటీవల తనకు ఎదురైన ఒక భయంకరమైన ఆరోగ్య సమస్య గురించి అభిమానులతో పంచుకున్నారు. రీల్స్ మోజులో అతిగా మొబైల్ ఉపయోగించడం వల్ల తాను తీవ్రమైన మెడ నొప్పితో బాధపడ్డానని, దీనివల్ల రూ.3 లక్షల ఖర్చుతో శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చిందని ఆమె వెల్లడించారు. ఈ విషయాన్ని తెలుపుతూ అభిమానులకు జాగ్రత్తలు చెప్పారు. ఫోన్‌లో చాలాసేపు గేమ్స్ ఆడటం, యూట్యూబ్, ఇన్‌స్టాలో రీల్స్ చూడటం వల్ల తనకు ఈ పరిస్థితి వచ్చిందని షకీల తెలిపారు. నిద్రపోయే సమయంలో కూడా ఒక పక్కకు వాలి గంటలు గంటలు ఫోన్ చూడటంతో మెడలోని నరాలపై తీవ్ర ప్రభావం పడిందని, అందుకే శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు 'ఫోన్ చాలా ముఖ్యం. కానీ, అవసరానికి మించి దాన్ని వాడకండి. ఉపయోగం లేని వీడియోలను చూస్తూ సమయం వృథా చేయకండి. సరిగ్గా వాడకపోతే డబ్బులు పోవడమే కాకుండా, భరించలేని నరకయాతన అనుభవించాల్సి వస్తుంది. చిన్న పిల్లలకు ఫోన్ ఇవ్వడంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలి. మొబైల్ వాడకాన్ని తగ్గించాలి' అని షకీల కోరారు. 18 ఏళ్ల వయసులో 'ప్లే గర్ల్స్' అనే తమిళ చిత్రంతో షకీల ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. 2000 సంవత్సరంలో వచ్చిన మలయాళ చిత్రం 'కిన్నార తుంబికల్' ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. డైరెక్టర్ తేజ రూపొందించిన 'జయం' సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత నిజం, బంగారం, తొట్టిగ్యాంగ్ వంటి పలు చిత్రాల్లో ఆమె నటించారు.

## లోకేశ్ కనగరాజ్ చిత్రం డిసికి పెరుగుతున్న కలెక్షన్లు




కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ హీరోగా అరంగేట్రం చేసిన తొలి చిత్రం 'డీసీ' బాక్సాఫీస్ వద్ద అద్భుత మైన కలెక్షన్లతో దూసుకుపోతోంది. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహించిన ఈ తమిళ యాక్షన్ డ్రామా ఇండియన్ మార్కెట్లో మొదటి రోజు నుంచే మంచి వసుళ్లను రాబడు తున్న సంగతి తెలిసిందే. ఫస్ట్ డేనే రూ. 6 కోట్లకు పైగా వసుళ్లను రాబట్టిన ఈ చిత్రం అనంతరం వరుసగా కలెక్షన్స్‌తో దూసుకుపో తుంది. తాజాగా ఆరో రోజు కూడా బాక్సాఫీస్ వద్ద తన జోరును కొనసాగించింది. వర్కింగ్ డేస్‌లోనూ ఈ చిత్రం పట్టుసడలించకుండా మంచి వసూళ్లను రాబడుతోంది. కేవలం ఆరో రోజే భారతదేశంలో సుమారు రూ. 5 కోట్లు నెట్ రాబట్టగా, ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా కలెక్షన్లు రూ. 58.62 కోట్లకు పైగా చేరుకున్నాయి. వీకెండ్ కల్లా ఈ చిత్రం రూ. 60 కోట్ల మార్క్‌ను దాటే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 'విక్రమ్', 'లియో', 'కూలీ' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాలతో స్టార్ డైరెక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్న లోకేష్ కనగరాజ్, ఈ చిత్రంతో పూర్తి స్థాయి నటుడిగా మారడం విశేషం. ప్రస్తుతం లోకేష్ అల్లు అర్జున్‌తో 'ఏఏ23' ప్రాజెక్ట్‌ను తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel,
Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)Published at 6-3-439, kisannagar, Karimnagar-505001 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787